
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 22, జూలై 2025

కీలక సమయంలో వరుణుడు కరుణించాడు. జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో ముంచెత్తుతున్నాయి. ప్రధానంగా పశ్చిమప్రాంతం జలకళను సంతరించుకుంది. నీటి వనరుల్లో జలాలు చేరుతున్నాయి. పలుచోట్ల చెరువులు నిండాయి. భూగర్భ జలం కూడా పెరిగింది. చాలావరకు భూములన్నీ పదునెక్కాయి. దీంతో ఖరీఫ్ పంటల సాగు ఊపందుకోనుంది. ఇప్పటికే సాగు చేసిన పైర్లు కళకళలాడుతున్నాయి. నాలుగు రోజుల నుంచి వాతావరణం మారిపోయి ఒక్కసారిగా చల్లబడటంతో జనం సేదతీరుతున్నారు.


వర్షపు నీటితో నిండిన ఎర్రగొండపాలెం మండలం రామసముద్రం చెరువు


పెద్దారవీడు మండలం కొత్తపల్లిలోని కొడలి చెరువులోకి చేరిన నీరు

పశ్చిమాన జలకళ

జిల్లావ్యాప్తంగా వర్షాలు

నాలుగు రోజుల్లో 73.70 మి.మీ సగటు వర్షపాతం

- 20 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా నమోదు
- అన్ని ప్రాంతాల్లోనూ సాగుకు మేలు
- ఎండలు, నీటి ఇక్కట్ల నుంచి ప్రజలకు ఉపశమనం
- మరో వారం కురిసే అవకాశం ఉందంటున్న వాతావరణ శాఖ

ఒంగోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దాదాపు నెలన్నరకుపైగా చినుకు జాడ కోసం ఎదురుచేస్తున్న ప్రజానీకానికి ప్రత్యేకించి రైతులకు పెద్దఎత్తున ఊరట లభించింది. నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల భారీ వర్షమే పడింది. ఈనెల 18 నుంచి సోమవారం వరకు నాలుగు రోజుల్లో ఏకంగా 73.70 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఈనెలలో 87.8 మి.మీ సాధారణ వర్షపాతం కాగా ఈ సమయానికి 59.5 మి.మీ కురవాలి. అయితే ఇప్పటికే 96.0 మి.మీ వర్షపాతం నమోదైంది. అంతేకాక పది మండలాల్లో రెట్టింపునకు పైగా వర్షం పడింది. మరో 20 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా కురిసింది.

టంగుటూరు మండలంలో అత్యధికం

జిల్లాలో అత్యధిక వర్షపాతం టంగుటూరు మండలంలో నమోదైంది. ఈ సమయానికి

మిగతా 6వ పేజీలో



గోదాదేవికి గులాబీల అర్చన

ఆడి మాసం సందర్భంగా ఒంగోలు గుర్రంవారి వీధిలోని కోదండరామస్వామి ఆలయంలో ఉన్న శ్రీరంగమన్నార్ సమేత గోదాదేవికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష గులాబీలతో అర్చన చేశారు. భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

రైతులకు 9 గంటలు నిరంతరాయంగా సరఫరా

- ఒంగోలులో 250 అడుగుల స్తంభాలు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి వెల్లడి
- ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, కలెక్టర్ అన్సారియాతో కలిసి సబ్‌స్టేషన్ ప్రారంభం


ఒంగోలులోని వెంకటేశ్వరకాలనీలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్

ఒంగోలు క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తున్నదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. రైతులకు నిరంతరాయంగా 9 గంటలు కరెంటు అందిస్తున్నామని చెప్పారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ఒంగోలు నగరంలోని వెంకటేశ్వర కాలనీలో రూ.4.50కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను మంత్రి ప్రారంభించారు. మంగమూరు రోడ్డు జంక్షన్‌లో రూ.11 కోట్ల వ్యయంతో, భాగ్యనగర్‌లో రూ.4.50కోట్లతో నిర్మించనున్న సబ్‌స్టేషన్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతు సబ్‌స్టేషన్‌ల నిర్మాణంతో అవాంతరాలు లేకుండా నిరంతర సరఫరా ఉంటుందన్నారు. లోఓల్టేజీ సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. ఒంగోలు నగరంలో వైర్లు వేలాడకుండా 250 అడుగుల ఎత్తు స్తంభాలు వేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని చెప్పారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, దీపం పథకాలను అమలు చేసినట్లు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలో అమల్లోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు వలన నిరంతరం విద్యుత్ సరఫరా జరుగుతుందని చెప్పారు. నగర శివారు గ్రామాల రైతులకు, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. తొలుత మంగమ్మ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ ప్రారంభానికి విచ్చేసిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు జనార్దనరావు, విజయకుమార్‌లకు విద్యుత్ శాఖ తరఫున పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కె.సీతారామయ్య, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈఈ ఎం.హరిబాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మార్కాపురంలో మూసివేసి ఉన్న మెడికల్ షాపు

దాడుల భయంతో మూత

- తనిఖీల సమాచారంతో తెరుచుకోని మెడికల్ షాపులు
- విచ్చలవిడిగా నకిలీ, కాలం చెల్లిన మందుల అమ్మకాలు
- ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల ఆరా

మార్కాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం డివిజన్‌లో విచ్చలవిడిగా సాగుతున్న నకిలీ, కాలం చెల్లిన మందుల విక్రయాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. క్రమం తప్పకుండా ఫిర్యాదులు అందుతుండడంతో దాడులకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం మార్కాపురంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో చాలా వరకు మెడికల్ షాపులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూసివేశారు. విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తారనే భయంతోనే షాపులు అనధికారికంగా బంద్ చేసినట్లు తెలిసింది.

ఇష్టారీతిన విక్రయాలు

ఒక్క మార్కాపురం పట్టణంలోనే సుమారు 150 వరకు మెడికల్ షాపులు ఉన్నాయి. వీటిలో పెద్దపాటివి 20లోపే. ప్రతి మెడికల్ షాపులో కాలం చెల్లిన మందులు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. వీటిని కొనుగోలు చేసి వాడిన వారు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నాయి. అంతేకాక పల్నాడు జిల్లాలోని

కట్టడికి చర్యలు శూన్యం

మార్కాపురంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉంది. కానీ ఏ రోజూ ఒక్క మెడికల్ షాపుపై కూడా కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. వాస్తవానికి ప్రతి షాపునూ తప్పకుండా నిర్ధిష్ట కాలవ్యవధిలో తనిఖీ చేయాల్సి ఉంది. ఆకస్మిక తనిఖీలు చేపట్టి నకిలీ, కాలం చెల్లిన మందులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. ప్రతి షాపులోనూ డి.ఫార్మసీ సర్టిఫికెట్ కల్గిన వాళ్ల మాత్రమే మందులు అమ్మేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మార్కాపురంలో ఉన్న 150 దుకాణాల్లో దాదాపు 100కిపైగా దుకాణాల్లో సర్టిఫికెట్ ఉన్న వ్యక్తులు విక్రయాలు చేయడం లేదు. ధరల నియంత్రణపై కూడా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తున్న దాఖలాలు ఉండడంలేదు. కేవలం ప్రతి షాపు నుంచి నెలకు ఇంతని టార్గెట్లు పెట్టి వసూళ్ల చేసుకుంటూ ప్రజారోగ్యాన్ని గాలి కొదిలేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

మిగతా 6వ పేజీలో



విద్యాశాఖలో చిత్రవిచిత్రాలు

- క్లస్టర్ కాంప్లెక్స్‌లకు నోడల్ పర్సన్ల నియామకం
- ఉపాధ్యాయులపై పెరిగిన నిఘా
- హెచ్‌ఎంలపై కాంట్రాక్టు ఉద్యోగులకు పెత్తనం

ఒంగోలు విద్య, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిఘా పెంచుతోంది. అందులో భాగంగా బడుల్లో నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమానికి పరిశీలకులు, సాక్షులు, నోడల్‌పర్సన్‌ల పేరుతో ఇతర అధికారులు, సిబ్బందిని నియమిస్తోంది. గత శనివారం నుంచి జరుగుతున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు ప్రతి క్లస్టర్‌కు ఒక నోడల్ పర్సన్‌ను నియమించారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను క్లస్టర్ గెజిటెడ్ హెడ్మాస్టర్లు నిర్వహిస్తుండగా వారిపై అదేస్థాయి లేదా పైస్థాయి అధికారులను నోడల్ పర్సన్లుగా నియమించాల్సి

మిగతా 6వ పేజీలో



వెలిగొండను పూర్తిచేసి సస్యశ్యామలం చేస్తాం

- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- గడికోటలో సుపరిపాలనలో తొలి అడుగుకు హాజరు

6

ఎమ్మెల్యే దగ్గరే తేల్చుకుంటాం

- కందులాపురం పంచాయతీ నెహ్రూనగర్ మహిళలు స్పష్టం
- తాగునీటి కోసం కంభం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన

7



రెండు లక్షల మందికి గ్రీన్ పాస్‌పోర్టులు

- మొక్కలు నాటిన పిల్లలకు ప్రత్యేక గుర్తింపు

7


గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను సమీక్షిస్తున్న కేంద్ర బృందం సభ్యులు ప్రభాత్ శర్మ, గుర్జార్

గ్రామాల అభివృద్ధి ఎలా ఉంది..?

జిల్లాలో జరుగుతున్న పనులను సమీక్షించిన కేంద్ర బృందం సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల పనుల అమలును కేంద్ర బృందం సభ్యులు ప్రభాత్‌శర్మ, నందలాల్ గుర్జార్‌లు సమీక్షించారు. స్థానిక డ్వామా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని దిశానిర్దేశం చేశారు. డ్వామా ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సోమవారం జిల్లాకు వచ్చిన వారు ముందుగా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డ్వామా కార్యాలయంలో వివిధ పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయాశాఖల ద్వారా జరుగుతున్న పలు కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో జరుగుతున్న శిక్షణను పరిశీలించారు. వారి వెంట డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జడ్పీ సీఈవో చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్ 6లో

సబ్సిడీతో విద్యుత్ అందించాలి

- ఆక్వా రైతుల సంక్షేమ సంఘం డిమాండ్
- ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా


ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న ఆక్వా రైతులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్‌ను సరఫరా చేయాలని రొయ్యల రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదర యశ్వంత్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. రొయ్యల రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆక్వా రైతులు పలు రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటిని ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. యూనిట్ రూ.1.50కే సబ్సిడీపై విద్యుత్‌ను ఆక్వా/నాన్ ఆక్వా జోన్ అనే తేడా లేకుండా అన్ని చెరువులకు సరఫరా చేయాలన్నారు. 2019కి ముందు ఇచ్చిన విధంగానే ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు ఉచితంగా అందించడంతోపాటు కిలో ఆక్వా ఫీడ్‌ను రూ.9కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా తర్వాత పెరిగిన ఆక్వా కెమికల్స్ ధరలను తగ్గించడంతోపాటు హేచరీలను పర్యవేక్షిస్తూ నాణ్యమైన రొయ్యల లార్వాను అందించాలన్నారు. జిల్లాలో గత 30ఏళ్లుగా రొయ్యల సాగు చేసుకుం టున్న రైతుల భూములకు శాశ్వత హక్కుల కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ హక్కులు లేకపోవడంతో

మిగతా 6వ పేజీలో

అరగుండుతో మున్సిపల్ కార్మికుల నిరసన

అద్దంకిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారించే దిశగా చర్యలు తీసుకో వాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు అరగుండు చేయించుకొని తమ నిరసనను తెలియజేశారు. చాలిచాలని జీతాలతో కార్మికులు జీవనం కష్టంగా మారిందని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. గత తొమ్మిది రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్, సామ్యూల్, వడివేలు, మారుతి, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభం

పంగులూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడులో సోమవారం నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పంగులూరు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పొగకు బేళ్లతో గోడౌన్లు నిండడంతో కొనుగోలు కేంద్రాన్ని తూర్పు కొప్పెరపాడుకు మార్చారు. ఈ కొనుగోలు కేంద్రంలో సోమవారం 25 మంది రైతుల నుంచి 138 పొగాకుబేళ్లను కొనుగోలు చేసినట్లు పంగులూరు పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. కొనుగోళ్ల ప్రారంభానికి ముందు తూర్పు కొప్పెరపాడులోని గోడౌన్‌ను తహసీల్దార్ సింగారావు, బయర్ మారెళ్ల శ్రీధర్‌బాబు, లక్ష్మీదేవిలతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, స్థానిక నేతలు పూనాటి రామాంజనేయులు, ఎనికపాటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

నీరు పోలేదంటూ రోడ్డుకు కోత

● మూడు రోజులైన పట్టించుకోని అధికారులు

● అవస్థలు పడుతున్న ప్రజలు

సాల్మన్‌సెంటర్ (చీరాల), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాల్మన్ సెంటర్ వద్ద చీరాల - వేటపాలెం ప్రధాన రహదారిలో ఓ అపార్ట్‌మెంట్ అవసరాలకు సంబధించి సుమారు 15 అడుగుల రహదారిని అడ్డంగా కోత వేశారు. ఆ అపార్ట్‌మెంట్ వ్యర్థ జలాలు రోడ్డుకు అవతలి వైపు ఉన్న హైమా వైద్యశాల పక్కన ఉన్న మురుగనీటి కాలువలో కలిపేందుకు రోడ్డును కోశారు. ఈఘటన జరిగి మూడు రోజులు అవుతుంది. నేటికీ పూడ్చక పోవడంతో ఈ ప్రాతంలో వాహనదారులు పట్టుతప్పి కింద పడుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పశ్చిమాన జలకళ

(5వ పేజీ తరువాయి)

కురవాల్సిన దాని కన్నా రెండున్నర రెట్లు ఎక్కువ పడింది. కొత్తపట్నంలో రెండు రెట్లు అధికంగా కురిసింది. కాగా ఈ వర్షాలు జిల్లా ప్రజానీకానికి అన్ని విధాలా మేలు చేశాయి. పశ్చిమప్రాంతం జలకళను సంతరించుకుంది. జూన్‌లో దాదాపు 35శాతం లోటు వర్షపాతంతోపాటు ఈనెల తొలిపక్షంలో చినుకు జాడ లేదు. పైగా దాదాపు నెలరోజులుగా జిల్లా అంతటా వేసవిని తలపిస్తూ ఎండలు, ఆపై వేడిగాలులతో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరయ్యాయి. చాలాచోట్ల తాగునీటికే కాక సాధారణ నీటికి కూడా ప్రజలు అవస్థ పడ్డారు. పశుపక్షాదులు అల్లాడాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర గడిచినా సాధారణ విస్తీర్ణంలో పదిశాతం కూడా పంటలు సాగు కాకపోగా వేసిన పైర్లు సైతం వాడుముఖం పట్టాయి. ఇక ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు కరువు తప్పదనుకునే వాతావరణం నుంచి ఒక్కసారిగా మార్పు వచ్చింది.

సాగుకు బాగా అనుకూలత

నాలుగు రోజుల్లో రెండు రోజులు జిల్లాలో భారీ వర్షమే కురిసింది. అన్ని ప్రాంతాల్లోనూ పంటల సాగుకు అనుకూలత ఏర్పడింది. ఇప్పటికే పొలంలో ఉన్న పైర్లు తిరిగి నవనవలాడుతుండగా దుక్కులు దున్ని సాగుకు వీలుగా సిద్ధం చేసిన భూముల్లో తక్షణం పంటలు వేసే అవకాశం ఏర్పడింది. ఇదిలా ఉండగా జిల్లా అంతటా తాజా వర్షాలతో నీరు కనిపిస్తున్నా పశ్చిమప్రాంతంలో జలకళను సంతరించుకొంది. అక్కడి పలు మండలాల్లోని వాగులు, వంకల్లో నీరు ప్రవహిస్తోంది. చెరువులకు నీరు చేరుతోంది. బోర్లు, బావుల్లోనూ భూగర్భ జలం పెరుగుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితితో పంటలకే కాక నీటి ఇక్కట్ల నుంచి కూడా ప్రజలకు ఉపశమనం కలిగింది. మరోవైపు రానున్న వారం రోజుల్లో జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

జిల్లాలో గరిష్ఠంగా వర్షపాతం నమోదైన మండలాల వివరాలు

మండలం	ఇప్పటివరకు పడాల్సిన వర్షం(మి.మీ)	నమోదైనవర్షపాతం (మి.మీ)	నమోదైనశాతం
టంగుటూరు	58.40	205.0	251
కొత్తపట్నం	61.00	182.90	200
చీమకుర్తి	58.70	147.50	151
పొదిలి	53.30	123.40	131
కేకేమిట్ల	52.20	118.50	127
మద్దిపాడు	64.70	145.10	124
వైపాలెం	57.20	127.50	123
సింగరాయకొండ	43.70	97.10	122
జరుగుమల్లి	48.80	107.10	120
తాళ్ళూరు	54.40	112.80	107
మార్కాపురం	64.20	112.80	99
పెద్దారవీడు	61.40	118.00	94
బేస్తవారిపేట	61.40	127.61	91
కొండపి	62.20	117.10	1
పుల్లలచెరువు	62.30	112.70	77
తర్లుపాడు	65.60	114.70	75

సబ్సిడీతో విద్యుత్ అందించాలి

(5వ పేజీ తరువాయి)

రైతులు సీఏఏ, ఏపీఎస్ఏడీఏ లైసెన్సులు పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దాని వల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ సబ్సిడీ, ఇతర రాయితీలను ఆక్వా రైతులు అందుకోలేకపోతున్నారని వాపోయారు. అందువల్ల ప్రభుత్వం స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మార్నేని వెంకటేశ్వర్లు, కిలారి రవికుమార్, ఏడుగుండ్ల కృష్ణమూర్తి, బి.హరి, కూరపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దాడులతో భయం

(5వ పేజీ తరువాయి)

పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున నకిలీ ఔషధాలు మార్కాపురానికి వస్తున్నట్లు సమాచారం. వాటిని అతి తక్కువ ధరకు కొని మంచివాటితో సమానమైన ధరలను షాపు యజమానులు దండుకుంటున్నారు. ధరల విషయంలో కూడా షాపుల యజమానులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. కేవలం పది మాత్రల ధర రూ.10 కూడా ఉండని జనరిక్ మందులను కూడా రూ.100కు విక్రయిస్తున్నారు. ఇక ప్రైవేటు వైద్యశాలల్లో ఉండే మెడికల్ షాపుల్లో దోపిడీకి అడ్డూఅదుపే ఉండడం లేదు. చిన్నపాటి జబ్బుచేసినా రూ.వేలల్లో మందులకే ఖర్చు చేయాల్సివస్తోంది. కొందరు ఎలాంటి సర్టిఫికెట్లు కూడా లేకుండా అనధికారికంగా షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. చాలామంది ఆర్ఎంపీ, పీఎంపీలు కూడా హోల్‌సేల్ మెడికల్ షాపుల్లో మందులు కొని ఎలాంటి అర్హత లేకపోయినా రోగులకు వైద్యం పేరుతో అమ్మకాలు చేస్తున్నారు.

విద్యాశాఖలో చిత్రవిచిత్రాలు

(5వ పేజీ తరువాయి)

ఉంది. అయితే కాంట్రాక్టు ఉద్యోగులను నియమించి హెచ్ఎంపై పెత్తనం అప్పగించారు. దీనిపై గజిటెడ్ హెచ్ఎంలు విస్తుపోతున్నారు. జిల్లాలో 150 క్లస్టర్ కాంప్లెక్స్‌లు ఉండగా ఈ సమావేశాలను మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించాలి.

నోడల్ పర్సన్ల నియామకం

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల పర్యవేక్షణకు ప్రతి దానికి ఒక నోడల్ పర్సన్‌ను నియమించాలని ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ సమావేశాలను విద్యాశాఖ తనిఖీ అధి కారులు సందర్శించి సూచనలు ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితికి చెల్లుచీటి ఇచ్చారు. ఇప్పుడు నియమిస్తున్న నోడల్ సర్సన్ మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం సమావేశం ముగిసేవరకు అక్కడే తిష్టవేసి కార్యక్రమాలను పరిశీలిస్తారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఒక అఫిషియల్‌ను నోడల్ పర్సన్‌గా నియమిం చాలని ఉత్తర్వులు జారీచేసినా జిల్లాలో కాంట్రాక్టు ఉద్యోగులను నియమించారు. మండల విద్యావనరుల కేంద్రాల్లో పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల అకౌంటెంట్లకు ఆ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేజీబీవీల్లో పనిచేస్తున్న వారిని నోడల్ పర్సన్లుగా నియమించమని ఎక్కడా లేనప్పటికీ వారిని కూడా నియమిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 300 మంది గెజిటెడ్ హెచ్ఎంలు, 76మంది ఎంఈవోలు, డైట్ నుంచి 23 మంది అధ్యాపకులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు ఉన్నా కాంట్రాక్టు ఉద్యోగులను నియమించడం విమర్శలకు దారితీసింది.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● 'మీ కోసం'లో అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం



'మీ కోసం' కార్యక్రమంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దేశించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశపు హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషు, ఎస్‌డీసీలు వరకుమార్, శ్రీధర్‌రెడ్డి, జాన్సన్, పార్థసారథి, కుమర్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

● భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటి వరకు 30 సార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారంకావడం లేదని మార్కాపురం మండలం తిప్పాయపాలేనికి చెందిన దుగ్గిరెడ్డి మునిరెడ్డి అన్నారు. సమస్యను పరిష్కరించాలని సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వహయంలో స్థానిక అధికార పార్టీ నేతల అండదండలతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యను పరిష్కరిస్తారని ఆశించామని, అయినా సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జోక్యం చేసుకొని తమ భూ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

● అక్రమణ దారుల నుంచి పశువుల మేత భూమిని కాపాడాలని పొదిలి మండలం నిమ్మవరం గ్రామానికి చెందిన గుదే నాగరాజు కోరారు. నిమ్మవరం గ్రామంలోని 8/4 సర్వేనెంబరులో 8.25 ఎకరాల ప్రభుత్వ పశువుల మేత భూమి ఉందన్నారు. గ్రామానికి చెందిన నాసరయ్య అనే వ్యక్తి అక్రమణ చేసి పశువులకు మేత లేకుండా చేస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. ప్రభుత్వ భూమిని అక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమాన్ని సస్యశ్యామలం చేస్తాం

● మంత్రి బాలవీరాంజనేయస్వామి



సంక్షేమ కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గడికోట గ్రామంలో సోమవారం రాత్రి మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి వెనుకబడిన ప్రకాశం జిల్లాకే కాకుండా రాయలసీమకు కూడా ఏమాత్రం న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యామలంగా చేసే లక్ష్యంతో పని చేస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. పింఛన్ పెంపు, తల్లివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో అన్నిరంగాల్లో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్ సాంబశివరావును సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● చైర్మన్ సాంబశివరావు

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతానని చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన చైర్మన్‌ను సోమవారం చీరాల రోటరీక్లబ్ ప్రతినిధులు సత్కరించారు. క్లబ్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ పారిశుద్ధ్యం, డ్రైయిన్‌ల పూడికలపై ప్రత్యేకంగా వ్యవహరిస్తానని వివరించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ మూర్తి, గోకుల్ కుమార్, కృష్ణమూర్తి, లక్ష్మీ ప్రతాప్, రామకృష్ణ, హేమంత్‌కుమార్, రాఘవరావు, శ్రీనివాసబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాతనేరస్థులతో కొత్తసవాళ్లు

● నిఘా నుంచి తప్పుకోవడానికి వింతపోకడలు

● వీరికి సహకరిస్తున్న కొంతమంది సిబ్బంది

● స్వీయదాడులు చేసుకుంటూ పోలీసులపై నిందలు

● మరికొందరికి తప్పని ఉన్నతాధికారులు విచారణలు



చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పదే పదే నేరాల్లో కీలకంగా వ్యవహరిస్తూ, గంజాయి ఇతర అక్రమ రవా ణా, నాటుసారా, శాంతిభద్రతలకు విఘాతం కలిగి స్తున్న వారిపై సస్పెక్ట్ షీట్, రౌడీ షీట్, కేడీలుగా పోలీసులు కేసులు నమోదు చేస్తుంటారు. ఇలాంటి షీట్లు ఉన్న వారిపై నిరంతరం పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారు. అయితే వీరి నుంచి తప్పించుకోవడానికి పోలీసులు వింతపోకడలు పోతున్నారు.

చీరాల వన్‌టౌన్‌లో 100 పాత నేరగాళ్లు ఉండగా, వీరిలో మహిళలు 10 మంది ఉన్నారు. అలాగే టూటౌన్ పరిధిలో 70 మంది నేరగాళ్లు ఉండగా వీరిలో 15 మంది మహిళలు, రూరల్ పరిధిలో 100 మంది ఉండగా వీరిలో మహిళలు 10 మంది, వేటపాలెంలో 50 మంది ఉన్నారు. వీళ్లల్లో ఎవరో ఒకరు ఏదో మూల నేరంలో పాల్పడి కేసుల్లో ఇరుక్కోవడం నిత్యకృత్యంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో చీరాల్లో ఒకవిధంగా నేరాల సంఖ్య పెరిగిందని చెప్పవచ్చు.

దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం నేర నియంత్ర ణకు ప్రత్యేక నిఘా ఉంచింది. ఇప్పటికే వీరు ప్రతి శనివారం ఆయా స్టేషన్‌లో స్టేషన్ అధికారి వద్ద హాజరై దినచర్య వివరాలు అందచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా, ఏదైనా, కారణం చేత హాజరుకాకుంటే వారిపై నిఘా వ్యవస్థతో పాటు స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. తద్వారా వాస్తవ పరిణామాలను పోలీసులు తెలుసుకుంటారు. అయితే పోలీసులు ని త్యం నిఘా ఉంచుతుండడంతో నేరగాళ్ల ఆటలు సాగడం లేదని నేరస్థులు కొత్తఎత్తులు వేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే పోలీసుల కంటే కూడా నేరస్థులే చట్టాలపై అవగాహన పెంచుకొని వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఏకంగా బ్లేడ్లు, చాకులతో వ్యక్తిగత దాడులు చేసుకుని గాయాల బారిన పడి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్నారు. ఫలానా అధికారి వేధింపులే కారణం అని ఆ పోస్టుల సారాంశంగా ఉండడంతో అవాక్కవడం పోలీసులు వంతువుతోంది. ఇలాంటి నేపథ్యంలో అరెస్టులకు, విచారణలకు వెళ్లిన పోలీసులను కూడా భయాందో ళనకు గురి చేస్తూ దాడులు చేస్తున్నారు. ఈక్రమంలో సాక్షాత్తు పోలీసులే తమ భద్రత కోసం బతుకు జీవుడా అంటూ అక్కడి నుంచి తప్పుకొని ఈ ఘటనతో తమకు సంబంధం లేదని ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది.

అంట కాగిన పోలీసులతో అనర్థమే

ఇదిలా ఉంటే నేరగాళ్లతో కొందరు పోలీసులు అంటకాగుతున్నారు. సుదీర్ఘకాలంగా ఇక్కడిక్కడే స్టేషన్ లు మారుతూ నేరగాళ్లకు బాగా దగ్గరవుతున్నారు. పోలీసుల ప్రతి కదలికను నేరస్థులకు అందిస్తూ మామూళ్లు దండుకుంటున్నారు. ఈ తరహా పోలీసులు దాదాపుగా అన్ని స్టేషన్‌లలోని, అన్ని విభాగాల్లో ఉన్నారనడంలో సందేహం లేదు. ఈ తరహా వారిపై దృష్టి సారించకుంటే నేరనియంత్రణ కష్టమేనని ప్రజలు భావిస్తున్నారు. ఎంతోకొంత పనిచేయాలనుకునే వారు మాత్రం నేరస్థుల తెలివితేటలకు భయపడి ఉద్యోగ భద్రతతో ఊగిసలాటలాడుతున్నారు.

పీడీ యాక్టులతోనే నియంత్రణ..!

ఏదో ఒక నేరంలో కేసులు నమోదు చేయడం 41 ఏ నోటీసులు అందించడం, లేదా అరకొర రిమాండ్‌లకు పంపడంతో సమస్యలకు పరిష్కారం ఉండదని, న్యాయ నిపుణులు చెబుతున్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై స్పష్టమైన నిఘా ఉంచాలి. అలాగే యాక్టీవ్ నేరస్థులపై పీడీ యాక్టులు నమోదు చేయాలి. ఈ విధమైన చర్యలతోనే నేరనియంత్రణ సులువుగా ఉంటుంది. ఈ తరహా ఆలోచనతో జిల్లా యంత్రాంగం పరిశీలించి శాంతి భద్రతలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

14 బైక్‌లు స్వాధీనం

గుడివాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుంచి రూ.6.50లక్షల విలువైన 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. సోమవారం ఒన్‌టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక ఏలూరు రోడ్డులో బైక్‌లను తనిఖీ చేస్తుండగా కొరడాల యేసు, చిలకంటి రంగారావులు అనుమానాస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించారని, వెంటనే పోలీసులు వెంబడించి పట్టుకున్నారన్నారు. వారిని విచారించగా ఏలూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణాజిల్లాలో 14 బైక్‌లను దొంగిలించినట్టు పేర్కొన్నారు. బైక్‌లను వేర్వేరు ప్రాంతాల్లో తాకట్టు పెట్టనట్టు తెలిపారు. ఆటో డ్రైవర్, తాపీ మేస్త్రీ ఇద్దరూ కలిసి ఆటస్థలాలు, ఆసుపత్రులు, ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను దొంగతనం చేసినట్టు విచారణలో తేలిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన పలువురు కానిస్టేబుళ్లకు రివార్డులను అందజేశారు.

మహిళా సమస్యలపై ప్రశ్నిస్తాం

● వైసీపీ ఎంపీ తనుజా రాణి

న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో మహిళా సమస్యలపై ప్రశ్నిస్తామని వైసీపీ ఎంపీ తనూజా రాణి తెలిపారు. ఆదివారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోష్, గురుమూర్తిలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం సరికాదన్నారు. ఏపీలో శాంతిభద్రతల అంశాన్ని పార్లమెంట్ లో లేవనెత్తుతామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. మద్యం కుంభకోణం పేరుతో ఉద్యోగులను ఇబ్బందులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

చినగంజాం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సత్ప్రర్తన అలవర్చుకోవాలని చీరాల శక్తి బృందం ఇన్‌చార్జ్ ఎస్.హరిబాబు అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని విద్యార్థినులకు సోమవారం ఆయన శక్తి బృందం సభ్యులతో కలిసి సెలఫోన్ దుర్విని యోగం, గుడ్, బ్యాడ్‌టచ్‌లు, మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హరిబాబు మట్లాడుతూ మహిళల భద్రత విషయంలో శక్తియాప్ ఎంతో కీలకమన్నారు. విద్యార్థి దశ నుండే మహిళా చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాని ఎంచుకొని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ. మోయిన్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్ల ను ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రాంలకు దూరం గా ఉండాలని అన్నారు. శక్తి యాప్ అంటే ఏమిటి, దానిని ఉపయోగాలు, బాల్య వివాహాల వలన కలిగే కష్ట, నష్టాలు, సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వినిమోగంతో వచ్చే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో కేజీబీవీ ప్రిన్స్‌పాల్ ఎం.సుమాం జలి, శక్తిబృందం సభ్యులు సునీత ధనలక్ష్మి, చినగంజాం మహిళా కానిస్టేబుల్ కవిత,రాజు సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

చినగంజాం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కు ప్రతి ఒక్కరి బాధ్య త అని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు, ఇన్‌చార్జ్ ఎంపీడీ వో ఎన్. విజయలు అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు మండల జనసేన ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మొక్కలు నాటటమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని అన్నారు. ప్రకృతి సమన్వయం కూడా మొక్కల పెంపకంపైనే ఆధారపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో. జె.లక్ష్మీదేవి, వెలుగు సీసీ కె.వెంకటస్వామి, జనసేన నాయకులు చెరుకూరి లక్ష్మణరావు, బొప్పన శ్రీనివాసరావు, దొడ్డి పవన్, బి.సాయి, అంజి తదితరలు పాల్గొన్నారు.

'హెపటైటిస్ బీ'కి వ్యాక్సిన్

అద్దంకిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పసుమర్తిపాలెంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హెపటైటిస్ బీ, సీ పరీక్షలు నిర్వహించిన వారికి వ్యాక్సిన్ వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెపటైటిస్ బీ, సీ పరీక్షలలో నెగిటివ్ వచ్చిన వారికి ఇంటి వద్దనే ఏఎన్ఎం జె. రాధమ్మ వ్యాక్సిన్ వేసినట్లు సంస్థ ప్రతినిధి దుర్గ భవాని తెలిపారు.

నాణ్యత లేని బర్లీ పొగాకు బేళ్లను తేవొద్దు!

● రైతులకు మార్క్‌ఫెడ్ ఎండీ సూచన

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన బేళ్లను మాత్రమే రైతులు తీసుకురావాలని మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి ఎండీ ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. 'పొగాకు బేళ్లను తెచ్చే ముందు రోజు నాణ్యత తనిఖీ చేసుకోవాలి. తేమ 20 శాతంలోపు ఉంటేనే తీసుకురావాలి. అధిక తేమ, నల్ల బొగులు, పచ్చ బొగులు, పండుగుల్ల, బాగా డ్యామేజ్ అయిన బేళ్లను తీసుకొచ్చి, రైతుల శ్రమ, సమయాన్ని వృథా చేసుకోవద్దు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని పొగాకును తీసుకు వచ్చి, రైతులు ఇబ్బంది పడవద్దు. మార్క్‌ఫెడ్ సూచనలు పాటించాలి' అని ఆయన కోరారు. బర్లీ పొగాకు కొనుగోళ్లు సెప్టెంబరు చివరి వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 18 కేంద్రాల్లో బర్లీ పొగాకు కొనుగోళ్లు సాగుతున్నాయని, ఇప్పటికి 5,379 టన్నుల పొగాకును రూ.44కోట్లతో కొనుగోలు చేయగా, 2,196 మంది రైతులు లబ్ధి పొందారని ఢిల్లీరావు వివరించారు.

తాగునీరు ఇవ్వకపోతే ఎమ్మెల్యే దగ్గరే తేల్చుకుంటాం

● కందులాపురం పంచాయతీ నెహ్రూనగర్ మహిళల నిరసన ● ఫ్లోరిన్ వాటర్, వ్యర్థాలు కలిసిన నీరు వద్దంటూ అధికారులపై ఆగ్రహం

కంభం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని నెహ్రూనగర్ 5, 6, 7, 8, 9 వీధుల్లో గత 4 నెలలుగా తాగునీటి సమస్యను తీర్చాలని సంబంధిత పంచాయతీ సిబ్బందికి విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో విసిగిపోయిన ఆ ప్రాంత మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీవో వీరభద్రచారి, ఈవో ఆర్డీ విజయలక్ష్మి ఆందోళన చేస్తున్న మహిళల వద్దకు వచ్చారు. '4 నెలలుగా మా వీధులకు తాగునీరు వదలడం లేదు. తాగునీటి బదులు ఫ్లోరిన్ కలిగిన, వ్యర్థాలతో నిండిన మురికినీటిని వదులు తున్నారు. నీటిని వదిలే వాల్వ్ మురికి నీటితో నిండిపోయింది. నీరు వదిలేవారు అలాగే వదులుతుండడంతో ఆ మురికినీరే పట్టుకోవలసి వస్తోంది. దీనివల్ల వ్యాధులు వస్తున్నాయి' అని మహిళలు ఎంపీడీవో, ఈవోఆర్డీలకు వివరించారు. పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా సమస్యను పరిష్కరించలేదని, మంచినీరు పడే అర్బన్ కాలనీ సమీపంలో బోర్లు వేయకుండా ఉప్పునీరు పడేచోట బోరు వేసి ఆ నీటిని తమకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. తాము వాడే నీటిని తాగి చూడాలని కోరారు. స్పందించిన ఈవోఆర్డీ... పంచాయతీ కార్యదర్శి జ్యోతిని పిలిపించి రైల్వేస్టేషన్ వెళ్లే మార్గంలో పగిలిన పైపులైన్ బాగుచేసి నూతన పైపులైన్ వేయాలంటే రూ.5లక్షలకు పైగా ఖర్చు అవుతుందని, ఎంపీపీ రూ.3లక్షలు ఇస్తారన్నా, పంచాయతీ వద్ద రూ.2లక్షలు లేవని చెప్పారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దగ్గరకు వెళ్లి పరిష్కరించుకుంటామని మహిళలు తేల్చిచెప్పారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని ఈవోఆర్డీ హామీ ఇవ్వడంతో, సమస్య పూర్తి కాకపోతే పంచాయతీకి పన్నులు చెల్లించమని హెచ్చరించి మహిళలు వెనుతిరిగారు.


తాగునీటి సమస్యను తీర్చాలంటూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు


ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నేలకొరిగిన ఐదు దశాబ్దాల వేపచెట్టు

కూలిన భారీ వృక్షం

పొదిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పెద్దమసీదు సమీపంలో ఉన్న ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన భారీ వేపచెట్టు ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు నేలకూలింది. ఒంగోలు - పొదిలి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న వేపచెట్టు కింద పలువురు తోపుడుబండ్లను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుండేవారు. అయితే అక్కడ ఉన్న తోపుడు బండ్లపై చెట్టు పడడంతో బండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాత్రిపూట కావడంతో ప్రాణాప్రాయం తప్పిందని స్థానికులు తెలిపారు. బండ్లు పూర్తిగా దెబ్బతినడంతో జీవనాధారం కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి సిబ్బందితో కూలిన వృక్షాన్ని తొలగించారు.

భార్యను హత్యచేసిన కేసులో భర్త అరెస్టు

మార్కాపురం, జూలై21 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు సీఐ ఎం.శేషగిరి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బేపల్లి గ్రామానికి చెందిన కరిముల్లా బేల్దారి కూలీగా పని చేస్తుంటాడు. ఆయనకు నాలుగు నెలలు క్రితం పల్నాడు జిల్లా ఇప్పర్ల గ్రామానికి చెందిన మీరాబీ(25)తో వివాహమైంది. అయితే భార్య మీరాబీపై అనుమానంతో ఆదివారం ఇంటిలో ఆమె తలను గోడకుకొట్టాడు. దీంతో ఆమె ప్రాణాలు విడిచింది. మృతురాలి తల్లి, తండ్రి, సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. సోమవారం మృతురాలు చనిపోయిన ఇంటివద్ద తహసీల్దారు టి.ప్రశాంతి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. తర్వాత మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు పఠాన్ నాగూర్ బాజి ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలి భర్త కరిముల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా.. దళితుల బతుకులు మారవా?

● మాజీ ఎంపీ హర్షకుమార్

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా.. దళితుల బతుకుల్లో మార్పులు రావడం లేదని, ఈ ప్రభుత్వమైనా దళిత ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని మాజీ ఎంపీ హర్షకుమార్ పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో మాస్క్ ధరించలేదనే కారణంతో జరిగిన వివాదంలో ఎరిచర్ల కిరణ్ అనే యువకుడు మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. ఈక్రమంలో చీరాల్లో సోమవారం నిర్వహించిన కిరణ్ 5వ సంస్మరణ సభకు మాజీ ఎంపీ హాజరై నివాళులు అర్పించారు. కుటుంబాన్ని దళిత నాయకులతో కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పి మభ్య పెట్టిందే గానీ వారికి న్యాయం చేయలేదన్నారు. ఈ ప్రభుత్వమైనా ఘటనపై విచారించడంతో పాటు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల చిట్టిబాబు, బజ్జీబాబు, పేతురు, జిలానీ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.


కిరణ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్, దళిత నాయకులు

ఆర్టీసీ బస్సు, పాలవ్యాన్ ఢీ

● ప్రయాణికులు సురక్షితం

కొండపి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామంలోని మూలమలుపు వద్ద ఆర్టీసీ బస్సు, పాలవ్యాన్ సోమవారం ఉదయం ఢీకొన్నాయి. రెండు వాహనాలు తక్కువ వేగంతో ఉండటంతో ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సు ఒంగోలు వైపు వెళ్తుండగా, పాలవ్యాను కొండపి వైపు వస్తోంది. ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. వాటిలోని ప్రయాణికులు ఎవరికీ ఎటువంటి గాయాలూ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


మూలమలుపు వద్ద ఢీకొన్న ఆర్టీసీ బస్సు, పాలవ్యాను

బీజేపీ జిల్లా కమిటీ ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీని జిల్లాలో బలోపేతం చేసేందుకు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు నూతన కమిటీని సోమవారం పత్రికలకు విడుదల చేశారు. ఈ కమిటీని రాష్ట్ర కమిటీ సూచనలకు అనుగుణంగా నియమించినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాయపాటి అజయ్, అశారావు (ఒంగోలు), పిచ్చయ్య (వైపాలెం), టి.నారాయణరెడ్డి (దర్శి), బ్రహ్మేశ్వర ప్రసాద్ (గిద్దలూరు), నరాల శ్రీనివాసరెడ్డి (కనిగిరి), జీ.శ్రీనివాసరావు (సంతనూతలపాడు)లను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా మాకినేని అమరసింహం (ఒంగోలు), అశోక్‌రెడ్డి (వైపాలెం), డాక్టర్ జేవీ నారాయణ (గిద్దలూరు), కార్యదర్శులుగా కోటా రాధాకృష్ణ, విజయరావు (ఒంగోలు), దగ్గుబాటి అలేఖ్య (గిద్దలూరు), ఎం.బాలకోటయ్య, శివకుమారి (కొండపి), ఎం. లక్ష్మీ (మార్కాపురం) బి.వెంకటేష్ (కనిగిరి), కోశాధికారిగా భగత్‌వినోద్, సోషల్ మీడియా కన్వీనర్‌గా అనిల్, ఐటీ కన్వీనర్‌గా జి.సత్యనారాయణలను నియమించారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మరో 22 మందిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు లక్షల మందికి గ్రీన్ పాస్‌పోర్టులు

● మొక్కలు నాటిన పిల్లలకు ప్రత్యేక గుర్తింపు

ఒంగోలు విద్య, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇస్తోంది. వీరి స్ఫూర్తితో మిగిలిన విద్యార్థులు కూడా ఉత్తేజితులై మొక్కలు నాటేందుకు వీరిని రోల్ మోడల్‌గా చూపిస్తున్నారు. మొక్కలు నాటిన విద్యార్థులకు ప్రభుత్వం గ్రీన్ పాస్‌పోర్టు పేరుతో ఫొటో గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్నారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు జిల్లాకు రెండు లక్షల గ్రీన్ పాస్‌పోర్టు కార్డులు వచ్చాయి. సమగ్ర శిక్ష ద్వారా తయారు చేసిన గ్రీన్‌పాస్‌పోర్టు కార్డులు మండల విద్యాధికారుల కార్యాలయాలకు చేరాయి. అక్కడి నుంచి గ్రీన్‌పాస్‌పోర్టు కార్డులను విద్యార్థులకు అందజేస్తారు.

● అమ్మపేరుతో ఒక మొక్క

ప్రధానమంత్రి ప్రకటించిన అమ్మపేరుతో ఒక మొక్క నినాదంతో విద్యార్థులకు ఈ గ్రీన్ పాస్‌పోర్టులను అందజేస్తున్నారు. ఈ కార్డులో విద్యార్థి ఫొటోతో పాటు విద్యార్థి పూర్తి వివరాలు నమోదు చేస్తారు. విద్యార్థి పేరు, వయస్సు, జండర్, పెన్ ఐడీ, పాఠశాల పేరు, చిరునామా, కార్డు మొదటి పేజీలో రాసి ప్రధానోపాధ్యాయుడు సంతకం చేస్తారు. మొక్క వివరాలు కూడా నమోదు చేస్తారు. మొక్క సాధారణ పేరు, శాస్త్రీయనామం, మొక్కనాటిన తేదీ, ప్రాంతం నమోదు చేయాలి. పాఠశాలల్లో, ఇళ్ల పరిసరాల్లో ఎవరికీ ఇబ్బంది, అటంకం లేకుండా మొక్కలు నాటాలి. నాటిన మొక్కను సంరక్షించే బాధ్యత కూడా విద్యార్థులదే.



● 20లక్షల మందికి గ్రీన్‌పాస్ పోర్టులు

జిల్లాలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) సందర్భంగా రెండు లక్షల మంది విద్యార్థులు మొక్కలు నాటారు. వీరికి సుమారు 16 లక్షల రూపాయాల వ్యయం చేసి సమగ్ర శిక్ష ద్వారా మొక్కలు సమకూర్చుకొని విద్యార్థులకు అందజేశారు. ఇప్పటి నుంచి 2027-28 సంవత్సరం వరకు మొక్క ఆరోగ్యం, పెరుగుదలపై గ్రీన్‌పాస్‌పోర్టులో నమోదు చేయాలి.

జిల్లాలో 35.5 మి.మీ. వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయానికి 35.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా టంగుటూరు మండలంలో 84.2మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పామూరు మండలంలో 2.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. చీమకుర్తి 82.0, కొత్తపట్నం 78.8, కొనకనమిట్ల 69.4, ఆర్థవీడు 64.2, త్రిపురాంతకం 62.4, కొండపి 61.6, పుల్లలచెరువు 55.0, జరుగుమల్లి 49.6, మార్కాపురం 49.2, సింగరాయకొండ 48.2, సంతనూతలపాడు 45.8, పొదిలి 43.2మి.మీ. వర్షపాతం నమోదైంది. తాళ్లూరు 42.4, ఒంగోలు రూరల్ 37.6, ఒంగోలు అర్బన్ 37.6. దర్శి 37.2, పెద్దారవీడు 36.4, మద్దిపాడు 35.6, యర్రగొండపాలెం 33.2, బేస్తవారిపేట 32.8, కంభం 31.2, దొనకొండ 27.4, రాచర్ల 25.4, కురిచేడు 24.0, గిద్దలూరు 21.0, నాగులుప్పలపాడు 20.6, తర్లుబాడు 20.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మద్దిపాడు 18.4, పొన్నలూరు 17.2, దోర్నాల 16.8, పీసీపల్లి 16.6, కనిగిరి 12.2, సీఎస్‌పురం 10.8, కొమరోలు 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ముగ్గురు విద్యార్థినులను దత్తత తీసుకున్న ఎంఈవో

ఎర్రగొండపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను కోల్పోయి వైపాలెం కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న ముగ్గురు బాలికలను దత్తత తీసుకున్నట్లు ఎంఈవో పి.ఆంజనేయులు సోమవారం తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.హర్షిణి, తేజస్విని, శివరంజని బాయిని దత్తత తీసుకొని వారి అభివృద్ధికి సహకరిస్తానని ఎంఈవో ప్రకటించారు. ప్రభుత్వం అనాథ పిల్లలను దత్తత చేసుకునేలా పీ4ను అమలు చేస్తోందన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో 259 మంది నిరుపేద విద్యార్థులను గుర్తించామని, ప్రతి ఉపాధ్యాయుడూ ఇద్దరినైనా దత్తత తీసుకొని మండల విద్యాశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో కోరారు.


బయోఫెర్టిలైజర్స్, జీవ ఎరువుల వాడకంపై కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తే రైతులకు సాగు ఖర్చులు తగ్గుతాయని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. బయో ఫెర్టిలైజర్స్, జీవ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ అన్సారియా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బయో ఫెర్టిలైజర్స్, జీవ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను కలెక్టర్ వివరించారు. వ్యవసాయ శాఖసంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుందన్నారు. బయో ఫెర్టిలైజర్స్ వాడకం వల్ల నేల సారం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బయోఫెర్టిలైజర్స్, జీవ ఎరువులు తయారు చేసే దోర్నాలకు చెందిన రైతు ఈదర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కషాయాలు, ఇతర ప్రకృతి ఆధారిత ఉత్పత్తుల వల్ల రైతులకు సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నరు. ఉత్పత్తి కూడా పెరుగుతుందని ఆయన తెలిపారు.

బాలింతలకు రేషన్ సక్రమంగా అందించాలి

● ఐసీడీఎస్ పీడీ సువర్ణ

పెద్దదోర్నాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలకు రేషన్ సమయానికి సక్రమంగా అందించాలని శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సువర్ణ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పీడీ సువర్ణ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రీ స్కూల్ నిర్వహణలో రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు పడతారన్నారు. కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు జాని బాషా, సీడీపీవో కమలకుమారి, సూపర్‌వైజర్ అంజమ్మ కార్యకర్తలు పాల్గొన్నారు.


రవితేజ (ఫైల్)

విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి

కొండపి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి చెందిన ఘటన కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆరికట్ల రవితేజ అలియాస్ వెంకయ్య (28) ఆదివారం అర్ధరాత్రి కరెంటులేని సమయంలో ఇంట్లో వైర్లు సరిచేస్తుండగా అకస్మాత్తుగా సరఫరా జరిగింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆయన్ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. తెలుగుదేశంలో కీలక కార్యకర్తగా పనిచేస్తున్న రవితేజ మరణవార్త తెలుసుకున్న కొండపి ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, టీడీపీ నాయకులు బత్తుల నారాయణస్వామి, కొండపి గ్రామ నాయకులు నన్నూరి సుబ్బరామయ్య, బి.సోమయ్య, మానికొండ వెంకటేశ్వర్లు, రావెళ్ల రఘునాథ్‌బాబు, అనుమాల ప్రసాద్, ఆరికట్ల వెంకటరావు, రాంబాబులు ఆయన ఇంటికి చేరుకున్నారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రవితేజకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు

● మంత్రి గొట్టిపాటి రవికుమార్
● 36, 46 డివిజన్లలో 'తొలి అడుగు'లో ప్రచారం

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నామని, ఈ ఘనత ప్రజా ప్రభుత్వానిదే అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవార ఒంగోలులోని 36,46 డివిజన్లలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్‌లతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను పలకరించి పథకాలపై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు అందుతున్నాయా? లేదా? అని తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ఒక ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం ఇవ్వడం ఇస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తుండగా, ఆయన స్ఫూర్తితో ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను ప్రతి నిత్యం పనిచేస్తున్నాని అన్నారు. మరిన్ని నిధులు వెచ్చించి నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమం.. అభివృద్ధి.. ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. గత వైసీపీ హయాంలో అవినీతి, అడ్డగోలు వ్యవహారాలకే ప్రాధాన్యత ఇవ్వగా కూటమి ప్రభుత్వం అందరి సంక్షేమం కోరుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, పార్టీ నాయకులు మండవ మురళీకృష్ణ, కార్పొరేటర్ గుట్లపల్లి మస్తానమ్మ, స్థానిక నాయకులు దాయనేని ధర్మ, నల్లూరి ప్రదీప్ పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్

వర్జీనియా పొగాకు రైతులకు విత్తనాలు

ఒంగోలు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బ్యారెన్ రైతులకు పొగాకు నారు విత్తనాలు కందుకూరు సీటీఆర్ఐ కేంద్రంలో ఇస్తారని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం 2 నిర్వహణాధికారి జె.తులసి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి బ్యారెన్‌కు 500 గ్రాములు ఇస్తారని పేర్కొన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు తప్పనిసరిగా బోర్డు నుంచి కొనుగోలు అనుమతి పత్రం పొందాలన్నారు. అదేవిధంగా పొగాకు నారు వ్యాపారం చేసే వారు కూడా పొగాకు బోర్డు నుంచి విత్తన కొనుగోలు అనుమతి పత్రం పొందాలని చెప్పారు. ఆ పత్రాలు పొందిన వారు కందుకూరు సీటీఆర్ఐ కేంద్రం నుంచి విత్తనాలు పొందాలని ఆమె కోరారు

ఉద్యోగం ఇచ్చి ఆదుకోండి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగిని వేధిస్తున్నానని తనపై ఆరోపణలు రావడంతో విధుల నుంచి సస్పెండ్ చేసి 14 నెలలు గడుస్తున్నా తిరిగి విధుల్లోకి తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ సస్పెండ్ అయిన జి. శ్రీనివాసరావు ఆరోపించారు. సస్పెండ్ చేసిన ఆరు నెలల్లో ఉద్యోగం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీపీవో వెంకటనాయుడు కారు ముందు నిలబడి నిరసన తెలిపారు.

లిక్కర్ కేసు పేరుతో అక్రమంగా అరెస్టులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ కేసులో అక్రమంగా వైసీపీ నాయకులను అరెస్టు చేస్తున్నారని వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేని మద్యం కేసును సృష్టించి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్న వ్యక్తులను అరెస్టు చేసి టీడీపీ నాయకులు శునకానందం పొందుతున్నారని ఆరోపించారు. ఇటువంటి విధానాలను ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జి. రజిని, సాధం విజయలక్ష్మి, సుతారం శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు

మద్దిపాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు సోమవారం మద్దిపాడు ఆరోగ్యకేంద్రం వైద్యులు ఆనంద్‌మోహన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణకు సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఏఎన్ఎం రాజేశ్వరి, అక్కమ్మ పాల్గొన్నారు.

ర్యాగింగ్, గంజాయి కేసులతో భవిష్యత్ ఛిద్రం

ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించిన సీఐ

సంతనూతలపాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్, గంజాయి కేసులతో భవిష్యత్ ఛిద్రం అవుతుందని రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్ బాబు చెప్పారు. మండలంలోని ఎండ్లూరు డొంకవద్ద ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులకు సోమవారం ర్యాగింగ్, గంజాయి చట్టాలపై ఆయిన అవగాహన కల్పించారు. ఒకేసారి ఎక్కువ మంది విద్యార్థులు డ్రగ్స్ వాడటం వలన ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో వివరిస్తూ ఎన్‌డీపీఎస్ యాక్టుపై అవగాహన కల్పించారు. కాలేజీల్లో ర్యాగింగ్ కానీ, ఈవ్‌టీజింగ్ గాని చేస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా నాలుగురోజుల క్రితం కొంతమంది విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణపై సీఐ విచారణ చేశారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ అధికారికి విద్యార్థుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. విద్యార్థుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడే వరకు వేచి ఉండొద్దని వెంటనే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని అడ్మినిస్ట్రేషన్ అధికారికి సూచించారు. ఆ తర్వాత ప్రాంగణమంతా డ్రోన్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై వి.అజయ్ బాబు పాల్గొన్నారు.



కళాశాల సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్‌బాబు

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా
చీమకుర్తి సొసైటీ సేవలు



చీమకురిలో బాధ్యతలు చేపడుతున్న చైర్మన్ వెంకట్రావు



కొత్తపల్లిలో హరిప్రసాద్, సంజీవరావులను సన్మానిస్తున్న నేతలు



ఓబన్నపాలెం సొసైటీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయులు

చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పూనాటి వెంకట్రావు

చీమకుర్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యున్నతే లక్ష్యంగా చీమకుర్తి విశాల పరపతి సేవా సంఘం సేవలను అందిస్తామని సొసైటీ నూతన చైర్మన్ పూనాటి వెంకట్రావు చెప్పారు. చీమకుర్తి సొసైటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చైర్మగా పూనాటి వెంకట్రావు, డైరెక్టర్లుగా యానం వెంకటేశ్వర్లు, బ్రహ్మారెడ్డిలు పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు వారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ర్యాలీగా సొసైటీగా చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిపాటి రాఘవరావు, కందిమళ్ల గంగాధరరావు, రావిపాటి రాంబాబు, కాట్రగడ్డ రమణయ్య, అవనిగడ్డ శేషారావు,అవిశినేని వెంగన్న, గంగుల శివపార్వతి, నర్రా నాగరాజు, ఇస్తర్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి సొసైటీలో...

మద్దిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి సొసైటీ కమిటీ చైర్మన్‌గా మండవ హరిప్రసాద్, ఉపాధ్యక్షునిగా నల్లూరి సంజీవరావు, ఇతర మెంబర్లు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాల్లో రైతులకు సొసైటీ ద్వారా రుణాలు అందించి ఉన్నతికి తోడ్పడతామన్నారు. రైతులు సహకరించి డిపాజిట్లు చేయాలని కోరారు. సంజీవరావు మాట్లాడతూ సెనగలు కొనుగోలు, ఎరువుల అమ్మకాలను చేపట్టి సొసైటీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్ పాడు టీడీపీ కో ఆర్డినేటర్ మండవ జయంతి బాబు, లింగంగుంట ఎంపీటీసీ సభ్యుడు మన్నం కృష్ణ, నల్లూరి అజయ్‌బాబు, నర్రా సురేష్ బాబు, ముల్లూరి మురళి, ఓగూరి వెంకట శేషయ్య, చుండూరి రఘురాం, మండవ వెంకటస్వామి, అద్దేపల్లి దుర్గాభవాని, దాసరి శిల్ప సౌందర్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఓబన్నపాలెం, ఉప్పుగుండూరులో...

నాగులుప్పలపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఓబన్నపాలెం, ఉప్పుగుండూరు సహకార సంఘాల త్రిమెన్ కమిటీ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఓబన్నపాలెం సొసైటీ అధ్యక్షునిగా మండవ ఆంజనేయులు, డైరెక్టర్లుగా ఈదర రాజశేఖర్, భీమవరపు వెంకటేశ్వర్లు, ఉప్పుగుండూరు సొసైటీ అధ్యక్షునిగా కాట్రగడ్డ చంద్రబాబు, డైరెక్టర్‌లుగా పెంట్యాల శ్రీనివాసరావు, మనిముక్క భాస్కరరావు బాధ్యతలను స్వీకరించారు. కూటమి పార్టీ శ్రేణులు, రైతులు నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

ఉపాధి కార్యాలయానికి తాళం

19నెలల నుంచి అద్దె చెల్లించని వైనం
తాళం వేసిన భవన యజమాని
మద్దిపాడు ఎంపీడీవో ఆదేశంతో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు

మద్దిపాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు మండల జాతీయ ఉపాధి హామీ కార్యాలయం కొన్నేళ్లుగా ప్రైవేటు భవనలో కొనసాగుతోంది. 19 నెలల నుంచి అద్దె చెల్లించకపోవటంతో భవన యజమాని కడియాల ఉమామహేశ్వరరావు, ఏపీవో ధనుంజయవర్మను ప్రశ్నించారు. ఉన్నతాధికారుల నుంచి తమకు నిధులు రాలేదని ఆయన చెప్పడంతో కార్యాలయ సిబ్బంది వెళ్లిన తర్వాత భవన యజమాని శనివారం సాయంత్రం తాళం వేశారు. సోమవారం విధులకు వెళ్లిన సిబ్బంది గమనించి ఫోను ద్వారా ఏపీవో, ఎంపీడీవోలకు తెలియజేశారు. ఎంపీడీవో వి.జ్యోతి కార్యాలయం వద్దకు వెళ్లి భవన యజమానితో సంప్రదించటానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. దీంతో ఎంపీపీ పాఠశాలలో ఖాళీగా ఉన్న గదిలో జాతీయ ఉపాధి హామీ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. పాఠశాల భవనం స్లాబ్ సరిగా లేదని ఏపీవో ధనుంజయ వర్మ చెప్పగా విద్యార్థులకు లేని ఇబ్బంది మీకు వచ్చిందా లగ్జరీ విల్లా కావాలా అంటూ ఆమె అసహనం వ్యక్తం చేశారు. 19 నెలలుగా అద్దె చెల్లించని విషయం తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఏపీవోను ప్రశ్నించడంతో నీళ్లు నమిలారు. ఉపాధి హామీ కార్యాలయానికి సంబంధించిన ఫైల్స్, కంప్యూటర్, స్టేషనరీ మొత్తం అద్దె భవనంలోనే ఉంది.

బంగారం షాపులో గుమస్తా మోసం

ఎస్పీకి ఫిర్యాదు చేసిన యజమాని

ఒంగోలు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): బంగారం షాపులో గుమస్తా లెక్కలు సరిగా చూపలేదని ఒంగోలుకు చెందిన బంగారం షాపు యజమాని ఒకరు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూల నుంచి 68 మంది ఎస్పీని నేరుగా కలిసి ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న వాటిని సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా దర్శి మండలంలోని ఓ సచివాలయ ఉద్యోగి సబ్సిడీ కింది వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానని రూ.3.80 లక్షలు తీసుకొని మోసం చేశాడని అద్దంకి మండలానికి చెందిన ఓ రైతు ఫిర్యాదు చేశారు. కుటుంబ అవసరాలకు ఓ మహిళ రూ.1.50 లక్షలు తీసుకొని చెల్లని చెక్కులు ఇచ్చి మోసం చేయడమే కాకుండా డబ్బులు తిరగి ఇవ్వాలని అడుగుతుంటే బెదిరిస్తుందని ఒంగోలు నగరంలోని గోపాల్‌నగరం చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, సీఐలు దుర్గాప్రసాద్, షమీముల్లా, పాండు రంగారావు, ఎస్సై జనార్ధనరావు పాల్గొన్నారు.



ఫిర్యాదును పరిశీలిస్తున్నఎస్పీ దామోదర్

ఎస్పీకి డ్రోను కెమెరా అందజేత

శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు వినియోగంచే డ్రోను కెమెరాను ఎస్పీ ఏఆర్ దామోదర్ కు పొదిలి మండలం కాటూరివారిపాలెంనకు చెదిన ఇరువురు అందజేశారు. మాకినేని వెంకటరమణయ్య, దంటు నరసింహారావులు కలిసి డ్రోన్ కెమెరాను కొనుగోలు చేసి ఎస్పీకి చేతులు మీదుగా పొదిలి ఎస్సైకి ఇచ్చారు. ఈమేరకు ఎస్పీ దామోదర్ వారిద్దరునూ అభినందించారు. సమాజం పట్ల వారికి ఉన్న సేవా భావానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై వేమన పాల్గొన్నారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

అధికారులకు అంగన్వాడీల విజ్ఞప్తి



ఒంగోలులోని సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీల ఆందోళన

ఒంగోలునగరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేంద్రాల నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని అంగన్వాడీలు సోమవారం జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీవోల కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు ఫేస్ యాప్‌ను తొలగించాలని, సెంటర్ నిర్వహణలో ఒక్క యాప్ మాత్రమే ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీడీపీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఒంగోలు రామ్‌నగర్‌లోని సీడీపీవో కార్యాలయంలో అంగన్వాడీవర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయటంలో సర్వర్‌లు సక్రమంగా పనిచేయకపోవటం, ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్‌లో పాతఫోన్లలో సక్రమంగా పనిచేయకపోవటం వలన ఇబ్బందులు పడుతున్నామని అంగన్వాడీలు తెలిపారు. బాలింతలు, గర్భిణి, చిన్న పిల్లలకు పౌష్టికాహారం పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్ ద్వారా ఈకేవైసీ చేసి, ఫొటో తీసి మాత్రమే సరుకులు ఇవ్వాలనే నిబంధన పెట్టటంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఈశ్వరి మాత మందిర నమూనా ఆవిష్కరణ

ఒంగోలు కల్చరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కందిమల్లాయపల్లి బ్రహ్మంగారి మఠంలో శ్రీ ఈశ్వరి మాత దివ్య మందిర పునఃనిర్మాణం చేస్తున్నట్లు బ్రహ్మంగారి మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర శివకుమార స్వామి తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఒంగోలు కర్నూల్ రోడ్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠంలో ఈశ్వరిమాత మఠాన్ని నూతనంగా నిర్మిస్తున్నామని మందిర నిర్మాణానికి భక్తులు సహకారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థాన శాశ్వత ధర్మకర్తలు పేలప్రోలు రామకృష్ణ పరమహంస(బిర్లా), పేలప్రోలు బ్రహ్మానందం, ఆలయ అర్చకులు ఇంకొల్లు మధుసూదనాచార్యులు, కొండూరు విశ్వసేన్, గోనుగుంట మోహనకృష్ణ, శేషాచారి, వీరబ్రహ్మం, రాఘవ రెడ్డి, అన్నదాన సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వీర శివకుమార స్వామి, నిర్వాహకులు



దారిలేక విద్యార్థులకు ఇక్కట్లు

మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లడానికి సరైన దారికి అవకాశం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ప్రధాన ద్వారం నుంచి కళాశాల వరకు ఉన్న బాట మొత్తం నీటితో నిండిపోయింది. ఈ క్రమంలో దాతలు ఎవరైనా స్పందించి రహదారి ఏర్పాటుకు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి కోరారు.

-మద్దిపాడు ఆంధ్రజ్యోతి

అవీఇవీ

కళ్లకు గంతలతో నిరసన



కార్పొరేషన్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా తమ న్యాయమైన పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో సమ్మె కాలంలో 17 రోజుల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లలకు పెంచడంతోపాటు, చనిపోయిన కార్మికులో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్పొరేషన్, మునిసిపాలిటీలలో పనిచేసే ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలు తక్షణ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు కే సుబ్బరాయుడు, కే శ్రీనివాసరావు, కొర్నెపాటి శ్రీనివాసరావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు జీ నరసింహ, తేళ్ల విజయమ్మ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు



సీమంతాలు నిర్వహిస్తున్న నాగసత్యలత, క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ఆధ్వర్యంలో మెటర్నల్ చైల్డ్ హెల్త్ వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సతీమణి నాగసత్యలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లీ బిడ్డ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులో ప్రసవాలు పెంచడంతోపాటు, ఎన్టీఆర్ బేబీ కిట్‌లను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. 70 మంది గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు, క్లబ్ ప్రెసిడెంట్ రావిపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ కొల్లూరి శ్రీనివాసచౌదరి, క్లబ్ ప్రతినిధులు బండారు లక్ష్మీనారాయణ, కోగంటి గోపాలకృష్ణ, నర్రా సురేంద్రబాబు, కోశాధికారి ఆర్ల శ్రీరామమూర్తి, హరిబాబు పాల్గొన్నారు.

ఐద్వా నగర కమిటీ ఎన్నిక



గోవిందమ్మ



ఆదిలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఐద్వా ఒంగోలు నగర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జరిగిన ఐద్వా నగర మహాసభల్లో నగర అధ్యక్ష, కార్యదర్శులుగా బి. గోవిందమ్మ, జి. లక్ష్మీలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కె. రాజేశ్వరి, జి. కళ్యాణి, బి. రాజ్యలక్ష్మి, బి. ప్రేమలత, డి. మధురవాణి, ఎస్‌కె. మొబినాలను ఎన్నికయ్యారు. అనంతరం మహాసభలో చేసిన తీర్మాణాలను సోమవారం పత్రికలకు విడుదల చేశారు. విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల భారాలను ఉపసంహరించుకోవాలని, నగరంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టాలని, మహిళలపై జరుగుతున్న దాడులను నివారించాలని, ఒంటరి మహిళలకు, వితంతు మహిళలకు ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని సమావేశంలో తీర్మానించారు.

ఈఎస్ఐ ఆసుపత్రుల పనితీరుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఈఎస్ఐ వైద్యశాలలు, పనిచేస్తున్న ఉద్యోగులు, నిర్మాణంలోని వైద్యశాలలు, నిధులు, సిబ్బంది తదితర అంశాలపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయమంత్రి సుశ్రీ శోభ కరండ్లాజే సమాధానం ఇస్తూ ఏపీలో కాకినాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ పట్టణాల్లో ఈఎస్ఐ వైద్యశాలలు పనిచేస్తున్నాయని తెలిపారు. గుంటూరు, కర్నూలు, శ్రీకాకుళం, శ్రీసిటినెల్లూరులలో వైద్యశాలలకు స్థలాల కేటాయింపు దశలో ఉన్నాయన్నారు. విజయనగరం, విశాఖపట్నం, అచ్యుతాపురంలోని నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, విజయవాడల్లోని వైద్యశాలలకు 800 పోస్టులు మంజూరు కాగా 273 భర్తీ చేయగా 527 ఖాళీలు ఉన్నాయని మాగుంట ప్రశ్నకు కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

సమస్యలపై యూడీసీకి వినతిపత్రం అందజేత



యూడీసీకి వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

కొండపి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించే వారికి ఇబ్బందికరంగా ఉన్న ఫేస్‌యాప్‌ను తొలగించాలని తల్లులు డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం వారు నిరసన తెలిపారు. కార్యాలయ యూడీసీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గడ్డం వందనం పాల్గొన్నారు.

ఆలిండియా కరాటే పోటీలు బ్రోచర్ ఆవిష్కరణ

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ డు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 17నుంచి ఒంగోలులో జరగనున్న ఆలిండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బీఎన్ విజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు, చీఫ్ కోచ్ నల్లూరి మోహన్‌రావు మాట్లాడుతూ అకాడమి 43వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 17న ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సముద్రంలో పడి యువకుడు మృతి



చందు మృతదేహం

కొత్తపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సముద్ర స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ కొట్టుకుపోయిన యువకుడు మృత్యువాతపడ్డాడు. వివరాల్లోకి వెళితే... టంగుటూరు మండలం మర్లపాడుకు చెందిన జలదంకి నాగచందు(19) ఆదివారం మండలంలోని మడనూరు సముద్ర తీరంలో స్నానం చేస్తూ అలలకు కొట్టుకుపోయాడు. చందు మృతదేహం సోమవారం మండలంలోని వజ్జిరెడ్డిపాలెం సముద్రం తీరానికి కొట్టుకువచ్చింది. స్థానికులు అందించిన సమాచారంతో కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

చెరువులకు జలకళ

- ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం
- కొత్తపల్లిలో చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు
- కట్టడికి గ్రామస్థులు ప్రయత్నించినా లేని ఫలితం

పెద్దారవీడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులలో జలకళ సంతరించుకుంది. కానీ ఇరిగేషన్, ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని కొత్తపల్లిలో కోడలి చెరువులో నుంచి నీరు వృథాగా పోతుంది. అధికారులకు సమాచారం అందించినా స్పందించక పోవడంతో గ్రామస్థులే ఏకమై నీరు వృథాగా పోవడాన్ని అరికట్టాలని ప్రయత్నించానా ఫలితం లేకుండా పోయింది.

20 ఏళ్ల తర్వాత నిండిన అత్తాకోడళ్ల చెరువులు

అధికారుల నిర్లక్ష్యం

మండలంలోని చెరువులన్నీ చాలా ఏళ్ల తర్వాత జలకళ సంతరించుకున్నారు. ముఖ్యంగా కొత్తపల్లిలోని అత్తా, కోడళ్ల చెరువులు ప్రాముఖ్యత ఉన్నవి. శుక్ర, ఆదివారం కురిసిసన వర్షాలకు రెండూ చెరువులు పూర్తిగా నిండాయి. గతంతో కోడలి చెరువు, అత్త చెరువులకు పెద్దారవీడు, దేవరాజుగట్టు రహదారి కింద నుంచి నీరు పోయేందుకు అనుకూలంగా కాల్వ ఉండేది. కానీ గత వైసీపీ పాలనలో రోడ్డు విస్తరణలో భాగంగా నూతన రోడ్డు నిర్మాణం జరిగింది. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడు కాంట్రాక్టర్ కాల్వను పూడ్చేసి రోడ్డును నిర్మించారు. దీంతో రెండు చెరువులకు నీరు పారే కాల్వ పూడి పోయింది.

వృథాగా పోతున్న నీరు

మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కోడలి చెరువు పూర్తిగా నిండిపోయింది. అత్త చెరువుకుపై అంచులదాకా నీరు చేరింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అత్త, కోడలి చెరువులకు ఉన్న కాల్వ పూడి పోయింది. దీంతో కోడలి చెరువు నుంచి అత్త చెరువుకు చేరాల్సిన నీరు వృథాగా బయటకు పోతుంది.



కోడలి చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

స్పందించని అధికారులు.. గ్రామస్థుల ప్రయత్నం విఫలం

కొత్తపల్లిలో వృథాగా నీరు పోవడాన్ని అరికట్టాల్సిన ఇరిగేషన్ అధికారులు స్పందించలేదు. సమాచారం ఇచ్చినా అధికారులు పట్టించుకోక పోవడంతో గ్రామస్థులు ఏకమై నీరు వృథాగా పోవడాన్ని అరికట్టడానికి ఎక్స్‌కవేటర్‌తో ప్రయత్నం చేశారు. రోడ్డు విస్తరణ సమయంలో కాంట్రాక్టర్ రోడ్డు కింది ఉన్న కాల్వను పూర్తిగా పూడ్చివేయడంతో గ్రామస్థుల ప్రయత్నం ఫలించలేదు. దీంతో కోడలి చెరువులో నీరు వృథాగా పోతూనే ఉంది. ఉన్నతాధికారులు స్పందించి అత్త, కోడలి చెరువుల మధ్య ఉన్న కాల్వను పునరుద్ధరించి నీరు వృథాగా పోవడాన్ని నియంత్రించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కొత్తపల్లిలో వాన నీటితో నిండిన కోడలి చెరువు

చెరువులకు చేరిన వాన నీరు

ఎర్రగొండపాలెం రూరల్ : వరుసగా మూడు రోజులుగా కురిసిన వర్షాలకు చెరువులు వాన నీటితో కళకళాడుతున్నాయి. మండలంలోని బోయలపల్లి, గురిజేపల్లి, అమానిగుడిపాడు, రామసముద్రం గ్రామాలలోని చెరువులకు నీరు చేరుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల చెరువులు నిండుతున్నాయి. ఈ చెరువులకు నీరు చేరి నిండితే బోర్లల్లో నీరు శాతం పెరుగుతుందని రైతులు చెప్తున్నారు. బోర్లలో నీరు పెరిగితే వేసిన పంటలకు ఇబ్బందులు లేకుండా సాగు చేసుకోవచ్చునని అంటున్నారు. ఆయా గ్రామాలలోని చెరువుల కింద వందల ఎకరాల్లో కంది, పత్తి, మిరప తదితర అపరాలను రైతులు సాగు చేస్తారు.



కోడలి చెరువు నుంచి అత్త చెరువుకు నీటిని పంపేందుకు ఎక్స్‌కవేటర్‌తో పనిచేయిస్తున్న గ్రామస్థులు

25న రంగస్వామి భూముల కౌలుకు వేలం



రంగనాయక స్వామి ఆలయం

రాచర్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి భూముల కౌలుకు ఈనెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి వేలంపాటలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. చోళ్లవీడు, అనుములవీడు, రామాపురం, సోమిదేవిపల్లి, రంగాపురం గ్రామాల్లోని మెట్టభూములకు వేలంపాటలు నిర్వహిస్తున్నామని ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. చోళ్లవీడులో ఉదయం 10గంటలకు, అనుములవీడులో ఉదయం 11 గంటలకు, రామాపురంలో, మధ్యాహ్నం 12గంటలకు, రంగాపురంలో సాయంత్రం 3గంటలకు ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో వేలంపాటలు జరుగుతాయని అన్నారు. వేలం పాటల కాలపరిమితి 2025-2026 నుంచి 2027-2028 వరకు మూడేళ్ల కాలపరిమితి ఉం టుందన్నారు. 9603322656 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- 51 మందికి రూ.30.35 లక్షల చెక్కుల పంపిణీ

గిద్దలూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 51 మందికి రూ.30,35,795 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అందచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తమని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రిలో పేదవారు నాణ్యమైన వైద్యం పొందవచ్చని, వారికి అయిన ఖర్చు ను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందచేస్తున్నామన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేక మంది పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి అండగా నిలువాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చి నా ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని 337 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3,40,04,758 అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న రిటైర్డ్ ఉద్యోగులు

గిద్దలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిటైర్డ్ హోంలో నంద్యాల శాంతిరామ్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 100 మంది రిటైర్డ్ ఉద్యోగులు నేత్ర పరీక్షలు చేయించుకోగా, 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి నంద్యాల తరలించారు. డాక్టర్ ఐశ్వర్య నేత్రపరీక్షలు నిర్వహించగా రిటైర్డ్ ఉద్యోగుల అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొళాయిలను ఏర్పాటు చేయాలి

గిద్దలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో గ్రౌండ్ లెవెల్ వాటర్ ట్యాంక్‌కు కొళాయిలను ఏర్పాటు చేయాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు. వాటర్‌ట్యాంక్ చుట్టూ మొదట్లో పైపులు ఏర్పాటు చేసి కొళాయిలు బిగించగా కాలక్రమేణా పైపులు విరిగిపోవడంతో ప్రజలు నీరు వృథాగా పోకుండా కర్రలను ఏర్పాటు చేసుకున్నారు. నీరు వచ్చే ప్రతిసారీ కర్ర తీసి కర్ర పెట్టే సందర్భంలో చాలా నీరు పోతుందని అంటున్నారు. పంచాయతీ అధికారులు కర్రల స్థానంలో కొళాయిలను ఏర్పాటు చేయాలని, వాటర్‌ట్యాంక్ చుట్టు పరిశుభ్రంగా ఉండే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ సమస్యలపై ఎంపీడీవోకు వినతి

మార్కాపురం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద నాగులవరం గ్రామంలో సమస్యలు పరిస్కరించాలని కోరుతూ ఎంపీడీవో శ్రీనివాసులుకు గ్రామస్థులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నుంచి శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని తెలిపారు. చిల్ల చెట్లు, గుంతలతో బురద మయంగా మారిందన్నారు. రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉపాధి కూలి డబ్బులు మూడు నెలలుగా అందలేదని తెలిపారు.

మున్సిపల్ కార్మికులు మానవహారం

గిద్దలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం 6 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ చేసి అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ అధ్యక్షుడు మురళి, కార్యదర్శి రంగయ్య, ఇంజనీరింగ్ కార్మిక సంఘ ప్రతినిధులు మస్తాన్‌రెడ్డి, బాలయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె సోమవారం 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు ధర్నా శిబిరంలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, సుబ్బరాయుడు, హరి, ఇమాంసా, కనకయ్య పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో నీటి నిల్వలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ఆక్రమణలే కారణం

ఎర్రగొండపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం పట్టణంలోని జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లలో వాన నీరు నిలిచి ఉంటోంది. సీసీ రోడ్డుపై 20 అడుగుల మేర ఆక్రమించి, మట్టి పోయడంతో జాతీయ రహదారి 120 అడుగుల వెడల్పు ఉన్నా డివైడర్ నుంచి 20 అడుగులు మాత్రమే మిగిలింది. బిల్డింగ్ యజమానులు రోడ్డు మార్జిన్‌లలో షాపుల ముందు మట్టి వేయడంతో వాన నీరు కాల్వల్లోకి వెళ్లకుండా జాతీయ రహదారిపై నిలిచి ఉంటుంది. వాన కురిస్తే ఈ రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డు మార్జిన్‌లో మట్టిని తొలగించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ వైద్యశాల ఎదురుగా రహదారిపై నిలిచి ఉన్న నీరు



విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

పొదిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు డాక్టర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడాదిలో రెండుసార్లు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆప్తమాలిక్ అసిస్టెంట్ డాక్టర్ నాగరాజు కంటి పరీక్షలు చేశారు. అంగన్వాడీ విద్యార్థుల నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. ఎంఈవో నాగలక్ష్మి మాట్లాగుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం నాణమైన ఆహారాన్ని అందిస్తుందన్నారు. కనుక ఆరోగ్యంగా ఉండేందుకు చిక్కీ, కోడిగుడ్లు, పండ్లు లాంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు రక్త నమూనాలు తీశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ, శ్రీనివాసరెడ్డి, విజయ, రాణి, లక్ష్మీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : కొత్త మసీద్ వద్ద ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కర్నూలుకు చెందిన శాంతిరాం వైద్యశాలకు చెందిన వైద్యులు నాగరాజు, వైద్య సిబ్బంది 100 మంది రోగులను పరీక్షించారు.శస్త్ర చికిత్స అవసరమైన వారిని సొంత ఖర్చులతో కర్నూలుకు తరలించి చికిత్స అనంతరం తిరిగి దోర్నాలకు చేర్చనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పూలబాబు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారుల విద్యాభివృద్ధికి సహకరించాలి



దివ్యాంగులకు వీల్ చైర్‌ను అందజేసిన ఎంఈవో

పెద్ద దోర్నాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ చిన్నారుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. ఎమ్మార్సీ భవనంలో దివ్యాంగ చిన్నారులకు ప్రభుత్వం సమకూర్చిన వీల్ చైర్, రొటేటర్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులలోని ఆత్మన్యూనతాభావాన్ని వీడి అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని వారి కాళ్లపై వారు జీవించేందుకు సుగమం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ షేక్ రిహాన బేగం పాల్గొన్నారు.

యాప్‌ను రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గిద్దలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేసి సీడీపీవో జ్యోతికి వినతిపత్రం అందచేశారు. అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు స్వర్ణ, కార్యదర్శి మున్నా మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలకు ఆహారం ఇచ్చే సందర్భంలో సర్వర్ డౌన్ అవుతుండడంతో ఓటిపిలు రాక ఇబ్బందులు పడున్నామని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిలోనే లబ్దిదారులకు సేవలు కొనసాగించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం ప్రతినిధులు విజయ, రమణమ్మ, నాగలక్ష్మి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండంలోని వీరభద్రాపురం గ్రామంలో మద్యంను అక్రమంగా అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ శాఖ సీఐ సీహెచ్ శ్రీనివాసులు సోమవారం అరెస్టు చేశారు. గ్రామంలో మద్యం బాటిళ్లను అక్రమంగా అమ్ముతున్నారన్నా సమాచారంతో దాడి చేసి 12 బాటిళ్లను స్వాధీనం చేసుకొని దిలీప్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



పడమటిపల్లెలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మల్లయ్య

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- ఉయ్యాలవాడలో సుపరిపాలనలో తొలి అడుగు

గిద్దలూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజాసమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆదిమూర్తిపల్లి, ఉయ్యాలవాడ గ్రామాలలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఉయ్యాలవాడలో రూ.10లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. గత వైసీపీ పాలకులు అరాచకం సృష్టించడం తప్ప చేసిందేమి లేదని అన్నారు. బటన్ నొక్కడం తప్ప తట్ట మట్టిపోసి గుంతను కూడా పూడ్చలేదని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల ప్రజలను మోసగించిన వైసీపీ నాయకులకు ప్రశ్నించే అర్హత లేదని, గత ఐదేళ్లలో వారు చేసిన అరాచకానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పినా మార్పు రాలేదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు విఠా రమేష్, చెన్నబోయిన రామకృష్ణ, విఠా ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ రామసుబ్బయ్య, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, కడియం శేషగిరి, ఆవుల రాజగోపాల్, నంది శ్రీను, బోదనబోయిన గోపాలక్రిష్ణ, దప్పిలి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : మండలంలోని పెద్ద బొమ్మలాపురం పడమటి పల్లెలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఈదర మల్లయ్య ప్రతి ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మల్లారెడ్డి, ఏసురత్నం, నరేష్, ఈశ్వరయ్య, గురవయ్య దాన మయ్య పాల్గొన్నారు.

వైభవంగా శాకంబరి ఉత్సవం



గిద్దలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీగాయత్రిమాత దేవాలయంలో శాకంబరి ఉత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరించారు. ఈసందర్భంగా శాకంబరి పూజలు నిర్వహించగా మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

పెద్ద దోర్నాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సాయి బాబా మందిరంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41రోజుల అయిన సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రుద్రాభిషేకం, సాయి నాథునికి క్షీరాభిషేకం చేశారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సభ్యులు

సామూహిక సీమంతాలు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్ నగర్‌లోని భగవాన్ సత్యసాయి బాబా మందిరంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. సత్య సాయి బాబా మహిళా కమిటీ ఆధ్వర్యంలో 20 మందికి సీమంతాలు నిర్వహించి చీరెలు, పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ ఇన్‌చార్జి గోపాలుని ప్రసన్నాదేవి, మహిళా సభ్యులు సువర్చల, రాజేశ్వరి, నాగలక్ష్మీ, హృదయలక్ష్మీ, యక్కలి లక్ష్మీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

గిద్దలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బలిజ కల్యాణ మండపం ఆవరణలో నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి సౌజన్యంతో 22వ తేదీ మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బలిజ సేవా సంఘం అధ్యక్షుడు యగటీల రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని తెలపారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తా

సొసైటీ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి ప్రమాణం



కొమరోలులో బాధ్యతలను స్వీకరిస్తున్న సంజీవరెడ్డి

కొమరోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొమరోలు సొసైటీ పరిధిలోని రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం కొమరోలు సొసైటీ కార్యాలయ ఆవరణలో సొసైటీ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా గిద్దలూరు సొసైటీ అధ్యక్షుడు బాలీశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి రైతునూ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుదన్నారు. నూతన అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు మా కుటుంబ సభ్యులం అందుబాటులో ఉంటామన్నారు. రైతుల సేవకు తనను దగ్గర చేసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా కొమరోలు, ఇడమకల్లు అధ్యక్షులు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలో గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి సొసైటీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇడమకల్లు సొసైటీ అధ్యక్షులు బిజ్జం రవింద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు గోడి ఓబుల్‌రెడ్డి, డైరెక్టర్లు తిరుమలరెడ్డి, పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పులకుర్తి వెంకటేశ్వర్లు, జి వెంకటేశ్వర్లు, సొసైటీ కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు చలిచీమల శ్రీనివాస చౌదరి, కృష్ణమోహన్‌రెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ అబ్దుల్ ఖాదర్, మాజీ సైనికుల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇడమకల్లు అధ్యక్షులుగా రవీంద్రారెడ్డి బాధ్యతలు

మండలంలోని ఇడమకుల్లు సొసైటీ అధ్యక్షుడిగా బిజ్జం రవీంద్రారెడ్డి సోమవారం ఉదయం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, బిజ్జాల తిరుమలరెడ్డి నాయకులు బద్రి లక్ష్మిరంగారెడ్డి, ఎం.యల్లారెడ్డి, భూపాల్ యాదవ్, గురుస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పామూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎస్.సాంబయ్య అన్నారు. పట్టణంలో బూత్ నెంబర్ 279 పరిధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఓగూరు నరసింహారావు, ఏడుకొండలు, భాను కిరణ్, భయ్యా నారాయణ, చింతకుంట్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. బూత్ నెంబర్ 268లో జరిగిన కార్యక్రమంలో ముబీనా మౌలాలి, షేక్ హజీగౌస్, తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ ద్వారా మరిన్ని సేవలు

పామూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ మరిన్ని సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక దివ్యజ్ఞాన సమాజం కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా బీఎస్ రంగారెడ్డి, ఉపకార్యదర్శిగా బాషామొహిద్దీన్, విద్య, ఆరోగ్య, అత్యవసర కార్యదర్శులుగా ఎస్.కృష్ణయ్య, ఎం.తిరుపతిరెడ్డి, బి.హజరత్‌ను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో కె.రామిరెడ్డి, జయరామిరెడ్డి, కొండారెడ్డి, డాక్టర్ గద్దె ఏడుకొండలు, గుత్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 3న ఏపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

సీఎస్‌పురం(పామూరు), జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన సీఎస్‌పురం వడ్డెపాలెం పాఠశాలలో ఆగస్టు 3న ఏపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశం జరుఉతుందని జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ తెలిపారు. సోమవారం స్థానిక మెయిన్ స్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా ఏపీటీఎఫ్ నిర్వహించిన కార్యక్రమాల నివేదికపై చర్చించిన అనంతరం మండల శాఖ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.95 వేలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 21(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.95,472 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.53,600, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,760, తదితర విరాళాల ద్వారా ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఆలయ హుండీ చోరీ

పామూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): దేవాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీలో నగదు అపహరించారు. పామూరు పంచాయతి పరిధిలోని డీవీపాలెంలో గల శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీని పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం దేవస్థాన నిర్వాహకులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

శివయ్య మృతి టీడీపీకి తీరనిలోటు

పామూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడవాడ గ్రామ నీటి సంఘం అధ్యక్షుడు వెల్లంకి శివయ్య అకాల మృతి టీడీపీకి తీరనిలోటని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం బొడవాడలో శివయ్య మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఏ.ప్రభాకర్‌చౌదరి, బొల్లా నరసింహారావు, రమణయ్య, వీరబాబు, కోటిలింగం, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో గౌతమీ విద్యార్థుల ప్రతిభ

దొనకొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో సోమవారం విడుదల చేసిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో దొనకొండ గౌతమీ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ నాని తెలిపారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో షేక్ షమీమా, కేవీ శ్రావణి, ఏ.పెద్దకాశమ్మ ఉత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు. బీఏ విభాగంలో బి.ఏసుబాబు, జె.కృతిక ప్రతిభ చాటారని తెలిపారు. వీరిని గౌతమీ విద్యాసంస్థల ఛైర్మన్ కె.గుండారెడ్డి, డైరెక్టర్ నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ నాని అభినందించారు.

ప్రజలకు మెరుగైన సేవలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఏడాది పాలనలో పల్లెపల్లెకు ప్రగతి పథకాలు అమలు చేశామన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని దిరిశవంచ, కమ్మవారిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, రైతులకు సబ్సిడీ రుణాలు, పాఠశాలల అభివృద్ధి వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమ్మవారిపల్లిలో నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. కనిగిరి ప్రాంతంలో ఉపాధి మెరుగుకోసం చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గ్రామలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బాలు ఓబులురెడ్డి, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కమ్మవారిపల్లిలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర



ముత్తుసెల్వన్‌ను అభినందిస్తున్న డాక్టర్ ఉగ్ర

గ్రీన్ ఇండియా కోసం సైకిల్ యాత్ర

కనిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): దేశం పచ్చదనంతో ఉండాలని ఆకాంక్షిస్తూ తమిళనాడు ప్రాంతానికి చెందిన ముత్తు సెల్వన్ అనే యువకుడు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈయాత్రలో భాగంగా సోమవారం కనిగిరి పట్టణానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి తన యాత్ర ఉద్దేశ్యాన్ని వివరించారు. విరివిగా మొక్కలు పెంపకంతోనే పర్యావరణ కాలుష్యం నుంచి భావితరాలను కాపాడుకోవచ్చని తెలిపారు. అందుకోసం ప్రజలకు మొక్కల పెంపెకం యొక్క అవసరాన్ని తెలియజేస్తూ 4500 కిలోమిటర్లు సైకిల్ యాత్ర చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే మూడువేల కిలోమీటర్లు పైగా యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈసందర్భంగా ముత్తుసెల్వన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అభినందించారు. భావితరాలకు స్ఫూర్తిగా చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

కనిగిరిలో ఆక్రమణల తొలగింపు

» క్లబ్ నిర్వాహకులు, మున్సిపల్ అధికారుల మధ్య వాగ్వాదం

» పోలీసుల రంగప్రవేశం

కనిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రోడ్డు ఆక్రమణల తొలగింపులో క్లబ్ నిర్వాహకులు, మున్సిపల్ అధికారుల మధ్య సోమవారం వాగ్వాదం చోటుచేసుకుంది. పట్టణంలో క్లబ్ వెనుక నుంచి రోడ్డు మార్గం ఉంది. దశాబ్దకాలంగా క్లబ్ నిర్వాహకులు ఆమార్గంలో గోడ కట్టి మూసివేశారు. వినియోగంలో లేకపోవటంతో క్లబ్ వెనుకు రోడ్డు స్థలం చెట్లు, మట్టి కుప్పలతో మూసుకుపోయింది. ప్రస్తుతం పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా ఆరోడ్డును వినియోగంలోకి తెచ్చేందుకు మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించారు. దీంతో క్లబ్ నిర్వాహకులు ఆక్రమణల తొలగింపును అడ్డుకున్నారు. ఈక్రమంలో అధికారులు, క్లబ్ నిర్వాహకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో పట్టణంలోని ప్రముఖులు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకోవడంతో అధికారులు పోలీసులకు సమాచారం అందించారు.

దీంతో ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి సంఘటనాస్థలికి చేరుకుని ఆక్రమణల తొలగింపు ప్రక్రియను చేపట్టారు.

ఇదిలాఉండగా, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చేందుకు మున్సిపల్ అధికారులు వచ్చారని క్లబ్ సెక్రటరీ గోవర్దన్ రెడ్డి చెప్పారు. గతంలో క్లబ్ వెనుక రోడ్డు స్థలంలో మల, మూత్రవిసర్జన చేస్తుండటంతో ప్రశాంతతకు భంగంగా ఉందని అప్పట్లో గోడ కట్టినట్టు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో ఒక్కొక్కటిగా ఆక్రమణలను తొలగిస్తామని చెప్పినా అధికారులు దూకుడుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

మున్సిపల్ ఛైర్మన్ గఫార్ ఎలాంటి వాద, వివాదాలకు తావు లేకుండా ఆక్రమణలను తొలగిస్తామని చెప్పినా, తన దృష్టికి తీసుకురాకుండా మున్సిపల్ ప్లానింగ్ అధికారులు దూకుడుగా వ్యవహరించడం సబబు కాదన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు స్థలంలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు



క్లబ్ నిర్వాహకులు, మున్సిపల్ అధికారులతో చర్చిస్తున్న ఏఎస్ఐ

రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

» తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు

దర్శి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కుస్తున్న వర్షాలకు దర్శి ప్రాంతంలో రోడ్లు ఛిద్రమయ్యాయి. అనేక రోడ్లు దెబ్బ తినడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దర్శి పట్టణంలోని రోడ్లు వర్షం పడినప్పుడల్లా జలమయమవుతున్నాయి. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు దర్శి పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో వర్షపు నీరు కుంటలా చేరింది. పొదిలి రోడ్డులో డీఎస్పీ ఆఫీస్ ఎదురు రోడ్డుపై వర్షపు నీరు నిలబడి జలమయంగా మారింది. అక్కడ షాపుల యజమానులు మురుగు కాలువలను పూడ్చివేయటంతో వర్షపు నీరు వేళ్లే మార్గంలేక అక్కడే నిల్వ ఉంటున్నాయి. దీంతో దుర్గంధం వెదజల్లుతూ ప్రయాణికుల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఆ మురికి నీటిలో ద్విచక్రవాహనదారులు జారిపడిన ఘటనలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు మురుగు కాలువల నిర్మాణాల గురించి పట్టించుకోలేదు. షాపుల యజమానులు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా చోద్యం చూస్తున్నారు. గత కొంతకాలంగా ఆప్రాంతాల్లో వర్షపునీరు రోజులు తరబడి నిల్వ ఉంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మండలంలోని పోతకమూరు, చెరువుకొమ్ముపాలెం రోడ్డు, దర్శి -సామంతపూడి రోడ్డు, పోతవరం రోడ్డు వర్షాలకు గుంతలమయమయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



దర్శి గడియారం స్తంభం సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



దర్శి - పొదిలి రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

చిత్తడిగా కార్యాలయాల ప్రాంగణం



చిత్తడిగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు

కనిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే ప్రభుత్వ కార్యాలయాల వద్ద రోడ్డు చిత్తడిగా మారింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఆర్డీవో, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్, ఐసీడీఎస్, అగ్రికల్చర్, డీఆర్‌డీఏ ప్రభుత్వ కార్యాలయాల వద్ద రోడ్డు బురదమయంగా మారింది. సోమవారం కావటంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు.

గతంలో వేసిన మట్టి వర్షాలకు కొట్టుకుపోయింది. కార్యాలయాలన్నీ పల్లంగా ఉండటం ప్రాంగణం ఎత్తుగా ఉండటంతో వర్షపు నీరు కార్యాలయాల్లోకి చేరుకుంటుంది. ఆర్డీవో, సీఐ కార్యాలయాల్లోకి చిన్నపాటి వర్షానికే నీరు చేరుతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడాదిలో ఎంతో చేశాం!

» ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తున్నాం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూలై 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. మండలంలోని తూర్పు వీరాయపాలెంలో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయమంగా ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తున్నట్టు చెప్పారు. తమ పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు అవినీతి కేసుల్లో కూరుకుపోయి జైళ్లకు క్యూ కడుతున్నారని విమర్శించారు. లిక్కర్ స్కాంలో రూ.3500 కోట్ల ప్రజాధనాన్ని వైసీపీ నాయకులు దోచుకున్నారని ఆరోపించారు. ఈ కేసులో పెద్ద తమింగలాలు కూడా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ దారం నాగవేణి, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, ముప్పరాజు వెంకటేశ్వర్లు, మదుమంచి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



తూర్పువీరాయపాలెంలో వృద్ధుడితో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

ఈక్రాప్ నమోదు చేయాలి

తాళ్లూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు సమన్వయంతో ఈ క్రాప్ నమోదు చేయాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట, విస్తీర్ణాల నమోదు ఖచ్చితంగా ఉండాలన్నారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంట, ఏరకం పంట వేశారో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

పర్సన్‌ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరయ్య



బాధ్యతలు చేపడుతున్న పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జ్, డైరెక్టర్లు

పీసీపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన పరిమి ఈశ్వరయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని లాభాల్లోకి తీసుకొస్తామన్నారు. రుణాలు తీసుకున్న రైతులకు షేర్ క్యాపిటల్ ద్వారా డివిడెంట్ అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. దీర్ఘకాలిక బకాయిలు ఉన్న రైతులు చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన పర్సన్ ఇన్‌చార్జ్ పరిమి, డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం, ఉండేల పిచ్చిరెడ్డిని పార్టీ శ్రేణులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామయ్య, వీరపనేని పెద్దన్న, నాగోతు శ్రీనివాసులు, వడ్డెంపూడి వెంకటసుబ్బయ్య, పులి ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పామూరు సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జ్‌గా నియమితులైన తెలుగు యువత మండల అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, డైరెక్టర్లు కేవీ రమణయ్య, వై.రహీముల్లాను సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సన్మానించారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, బొల్లా నరసింహారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, పాలపర్తి రమణయ్య, బద్దిపూడి మార్క్, తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): పూర్వకాలం నుంచి పొలాలకు రాకపోకల కోసం ఏర్పాటు చేసిన రోడ్డును చదును చేసేందుకు గ్రామానికి చెందిన రామిశెట్టి వెంకటేశ్వర్లు యత్నిస్తున్నాడని పలువురు పేర్కొన్నారు. రాకపోకలకు ఆటంకం కలిగించకుండా చర్యలు చేపట్టాలని కొత్తపాలెంకు చెందిన పుట్టా నాగేశ్వరరావు, మరికొందరు రైతులు సోమవారం తహసీల్దార్, ఎస్ఐకి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్డుపై పొలాలకు రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. ఆరోడ్డు తమకు చెందిన భూమిలో ఉందంటూ చదును చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. రాకపోకలకు ఆటంకం కల్గించకుండా తగు చర్యలు చేపట్టాలని విన్నవించారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

జడ్పీ పాఠశాల తనిఖీ

దొనకొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి నాగరాజు, చీమకుర్తి ఎంఈవో శివాజీ తనిఖీ చేశారు. పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైన దొనకొండ జడ్పీ పాఠశాలలో మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులను విద్యాపరమైన అనేక విషయాలను ప్రశ్నించి సమాధానాలు తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధి నిమిత్తం ఏర్పాటైన మౌలిక సౌకర్యాలు, కొనసాగుతున్న విద్యాబోధనపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎన్.సాంబశివరావు, షేక్ అమీర్, హెచ్‌ఎం వీవీ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంఎన్‌ఎం విద్యార్థులు

కనిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ(ఏకేయూ) డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎన్‌ఎం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో బీఎస్సీ కంప్యూటర్ కోర్సులో షేక్ నస్రీన్ 9.24/10 శాతం మార్కులు, బీకాం కంప్యూటర్స్‌లో కోలా రాజేశ్వరి 8.81/10 మార్కులు సాధించారు. బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో గుజుల మల్లిక 9.14/10 శాతం మార్కులు, బీఎస్సీ పాలిటిక్స్‌లో వంగేపురం ప్రేరణ 8.64/10 శాతం మార్కులు సాధించారు. బీసీఏలో మాసిపోగు ప్రవీణ్‌కుమార్ 8.09/10 శాతం మార్కులు, బీబీఏ కోర్సులో షేక్ సలీమా 8.07/10 శాతం మార్కులు సాధించారు. బీఏ హిస్టరీ కోర్సులో పల్లెబోయిన శ్రావణి 7.71/10 శాతం మార్కులు, వేమవరపు అభిషైని 7.71/10 శాతం మార్కులు, బీఏ ఎకనామిక్స్ కోర్సులో యర్రబల్లి కీర్తిప్రియ 7.61/10 శాతం మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, డైరెక్టర్ ఏలూరి నరేంద్ర, ప్రిన్సిపాల్ వీఆర్‌రెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

వెలిగండ్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల బీసీ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు పేర్కొన్నారు. బోరు వేయించి ఇబ్బందులు తొలగించాలని డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డిని కోరారు. సోమవారం వెలిగండ్లలోని టీడీపీ కార్యాలయంలో కాలనీ వాసులు కాశిరెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. కొద్దిరోజుల క్రితం పంచాయతీ తరుపున బోరు వేయిస్తుండగా కొంతమంది వచ్చి అడ్డుకున్నారని తెలిపారు. సంబంధిత అధికారులకు తెలియజేసినా స్పందించలేదన్నారు. కాశిరెడ్డి వెంటనే అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. వారం రోజుల్లో బీసీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాశిరెడ్డిని కలిసినవారిలో కాలనీకి చెందిన ఆకుల రాజ్‌కుమార్‌నాయుడు, ఎస్తేరమ్మ, మారమ్మ, మేరి, సునిత, అన్నమ్మ తదితరులు ఉన్నారు.

ఎస్సీ2 హాస్టల్‌ను మార్చొద్దు!

కనిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ 2 హాస్టల్‌ను కనిగిరి పట్టణం నుంచి మారిస్తే ఉద్యమిస్తామని దళిత, బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ కార్యదర్శి పి.మోహన్ మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉన్న ఎస్సీ 2 హాస్టల్‌ను కనిగిరి నుంచి మార్చే ప్రయత్నాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విరమించుకోవాలన్నారు. గతంలోనే ఎస్సీ-1 హాస్టల్‌ను పది కిలోమీటర్లు దూరంలో ఉన్న కంచర్లవారిపల్లి గ్రామం వద్దకు మార్చారన్నారు. ప్రస్తుతం ఎస్సీ-2 హాస్టల్‌ను వెలిగండ్ల మండలంలోని పీఎన్‌వరం గ్రామానికి మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. హాస్టల్‌ను ఇక్కడే కొనసాగిస్తూ శాశ్వత వార్డెన్ నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు శాంతరాజ్, బాలగురవయ్య, దద్దాల రాములు, పలుకూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ

ముండ్లమూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు గ్రామంలో సోమవారం కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు కంది విత్తనాలు, పురుగుమందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ కంది పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కంది పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, వీఏఏలు కాంతిరత్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పీసీపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. సోమవారం పీసీపల్లిలోని బ్యాంకు సెంటరులో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్‌నేరాలు అధికమయ్యాయన్నారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నా సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త ఎత్తులతో బ్యాంకు ఖాతాల్లోని నగదును కొల్లగొడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వాట్సప్‌కు వచ్చే మెసేజ్‌లు చూడవద్దన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ముండ్లమూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో మూడు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ తెలిపారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని వీఆర్‌వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శ్రీదేవి, ఏపీఎం హనుమంతరావు, ఏవీవో పి.వెంకటరావు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వాణిజ్య పన్నుల శాఖ సీజ్ చేసిన లారీలు



గ్రానైట్ అక్రమ రవాణాపై నిఘా

- జిల్లా, మండలస్థాయిల్లో టాస్క్‌ఫోర్సులు ఏర్పాటు
- 16 లారీలను సీజ్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ
- మరో రూ.40 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అక్రమ మైనింగ్, గ్రానైట్ రవాణాపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. గ్రానైట్ అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన వరుస కథనాలపై కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పందించారు. గ్రానైట్ అక్రమ మైనింగ్, రవాణాను అరికట్టేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నామని సోమవారం ఆయన వెల్లడించారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, సీటీవో, మైనింగ్ ఏడీ, అదనపు ఎస్పీ, డీఎస్పీలతో కూడిన జిల్లా స్థాయి కమిటీ మైనింగ్, అక్రమ రవాణాను కార్యకలాపాలను పర్యవేక్షించనుంది. మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎస్‌ఐ, రవాణ, వాణిజ్య పన్నులు, జీఎస్టీ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

నెలలో 35 గ్రానైట్ లారీలు స్వాధీనం

పల్నాడు జిల్లా నుంచి పెద్ద ఎత్తున గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోంది. నెల రోజుల వ్యవధిలో 35 గ్రానైట్ లారీలను వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రానైట్ మాఫియా లారీలను నిలుపుదల చేసిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులను తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడింది. మూడు లారీలను సైతం జిల్లా సరిహద్దులను దాటించడం జరిగింది. గత నెలలో 17 లారీలను సీజ్ చేయగా ప్రభుత్వానికి పన్నులు, జరిమానాల రూపంలో రూ.42 లక్షలు ఆదాయం లభించింది. రెండు లారీలను నాలుగు రోజుల క్రితం, 14 లారీలను శనివారం స్వాధీనం చేసుకున్నారు. లారీకి రూ.2.50 లక్షలు జరిమానా, పన్ను వసూలు చేసినా.. దాదాపు రూ.40 లక్షల ఆదాయం ప్రభుత్వానికి రానుంది.

టాస్క్ ఫోర్సు ఏర్పాటుతో ప్రభుత్వానికి నెలకు రూ.కోట్లలో ఆదాయం రానుంది. గ్రానైట్ లారీకి సుమారు రూ.54 వేల వరకు పన్ను చెల్లించాల్సి ఉంది. నెలకు వందల సంఖ్యలో లారీల్లో గ్రానైట్ జీరో బిల్లులపై జిల్లా సరిహద్దులు దాటిపోతోంది. దీనిని అరికడితే ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షమే.

గడువిస్తేనే.. ధీమా!

పంటల బీమా చెల్లింపు గడువు సమీపిస్తోంది. పంటలు సాగు చేయకమునుపే బీమా గడువు ముగియనుంది. మొన్నటి వరకు తీవ్ర వర్షాభావంతో ఏ పంటలు సాగు చేయాలో ఇంకా అన్నదాతలు తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పుడిప్పుడే సాగు పనులు ప్రారంభమవుతున్నాయి. పత్తి, కంది, మిరప పంటలకు బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెలాఖరుకు ముగియనుంది. వరికి మాత్రం వచ్చే నెల 15వ తేదీ వరకు ఉంది. పంటల సాగు స్థితిని అంచనా వేయకుండానే పంటల బీమా గుడువును నిర్ణయించడం ఏమిటని అన్నదాతలు ప్రశ్నిస్తు న్నారు. కనీసం ఆగస్టు నెలాఖరు వరకు బీమా గడువు పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

పంటల బీమా గడువు నెలాఖరు వరకే

- వరికి మాత్రమే ఆగస్టు 15 చివరి తేదీ
- పత్తికి వాతావారణ ఆధారిత బీమా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పత్తి పంట సాగు చేయక ముందే ఈ నెల 15న బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసింది. అయితే పల్నాడు జిల్లాలో పత్తి సాగుపై ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక పంపడంతో బీమా గడువును ఈ నెలాఖరుకు పొగించారు. పల్నాడులో పత్తి పంటను మాత్రమే వాతావరణ ఆధారిత బీమా పథకం కింద ఎంపిక చేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద వరి, కంది, మిరప పంటలను ఎంపిక చేశారు. గడువు లోగా బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచిస్తోంది.



తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పత్తి సరిగా సాగు చేయలేదు. ఇప్పుడిప్పుడే కురుస్తున్న వర్షాలతో పత్తి సాగుకు రైతులు సమాయత్తమవు తున్నారు. పల్నాడు జిల్లాలో పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు కాగా, ఇప్పటికి 31,420 ఎకరాల్లో అంటే 14 శాతం మాత్రమే పత్తి సాగు చేశారు. గుంటూరు జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 59,140 ఎకరాలు కాగా ఇప్పటికి 4,080 ఎకరాల్లో సాగు చేశారు. బాపట్ల జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 6,307 ఎకరాలు కాగా, 26 ఎకరాల్లో మాత్రమే ప్రస్తుతం సాగైంది. వర్షాలు కొనసాగితే పత్తి సాగు చేయనున్నట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణ ఆధారిత బీమా (మిగతా 6వ పేజీలో)



దండుబాట రోడ్డులో ఎస్టీపీ ప్లాంట్‌కు ఎంపిక చేసిన స్థలం

మురుగుశుద్ధి.. లోపించిన చిత్తశుద్ధి!

- నెలాఖరుతో ముగుస్తున్న గడువు
- ఇప్పటికీ ప్రారంభం కాని ఎస్టీపీ పనులు

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చీరాల పురపాలక సంఘం పరిధిలో ఎస్టీపీ ప్లాంట్(మురుగు నీటి శుద్ధి కేంద్రం) ఊసు అటకెక్కింది. ప్లాంట్ నిర్మాణంలోని సర్వే నంబరు 129/2లోని స్థలంపై స్థానికులు ఆక్షేపణ చేశారు. ఈ స్థలంలో గతంలోనే తమకు పట్టాలు ఇచ్చారని కోర్టును ఆశ్రయించారు. అలాగే స్ట్రయిట్ కట్ కాల్వ ఎత్తిపోతలకు సంబంధించి సుమారు 10 గ్రామాల రైతులు సుమారు 20 వేల ఎకరాల సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాంట్ ఏర్పడితే పంట పొలాలు దెబ్బతింటాయని ఆందోళన బాట పట్టారు. 18 నెలల అగ్రిమెంట్‌తో రంగంలోకి దిగి న సింగం ప్రాజెక్టుకు ఈ నెలాఖరులోనే గడవు ముగియనుంది. ఎస్టీపీ ప్లాంట్‌పై కచ్చితమైన ఆలోచన లేని అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం మానేశారు.

నిధులు విడుదల.. స్థల సేకరణ.

చీరాల మున్సిపాలిటీలోని 33 వార్డుల్లో రెండు లక్షల జనాభా ఉన్నారు. పట్టణంలోని వ్యర్థ జలాలు దండుబాట రోడ్డులోని మురుగు కాల్వ నుంచి ఈపూరు పాలెం స్ట్రయిట్ కట్ కాల్వలోకి చేరుతున్నాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు.. అమృత్ నిధి ద్వారా స్ట్రయిట్ కట్‌లో కలుస్తున్న మురుగును శుద్ధి చేసేందుకు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ రెండేళ్ల క్రితం ఎస్టీపీ ఏర్పాటుకు రూ.8.25 కోట్లు నిధులు మంజూరు చేయించింది. సర్వే నంబరు 129/1 మూడు సెంట్లు, 129/2 56 సెంట్లు, 143/3లో 38 సెంట్లు మొత్తంగా ఒకేచోట మూడు సర్వే నంబర్లలో 1.24 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

దశాబ్దాల జాప్యం.. లంకలకు శాపం



వరదకు కొట్టుకుపోయిన ఆనకట్ట

- 20 ఏళ్ళక్రితం అరవింద వారధి వద్ద నదికి గండి
- కొద్దిపాటి వరదకే కరకట్టను తాకుతున్న కృష్ణమ్మ

కొల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెసర్లంక అరవింద వారధి ఎగువన సుమారు 20 ఏళ్ల క్రితం కృష్ణాన దికట్టకు గండి పడింది. వరదలు సమయంలో ఆ గండి కోతకు గురై పెద్దదైంది. గండి పూడ్చాలని పలుమార్లు లిఖిత పూర్వకంగా అర్జీలు గ్రామస్తులు అందించారు. వరద వచ్చే ముందు ఇసుక బస్తాలతో గండికి అడ్డుకట్ట వేసి..మమ అనిపించేస్తున్నారు అధికారులు. ఆర్‌సి సిబ్బంది వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోవడంతో పాటు చుట్టుపక్కల భూములు కోతకు గురై గండి మరింత పెద్దదైంది. 2024లో కృష్ణానదికి వరద హెచ్చరికలప్పుడు కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు గండిని పరిశీలించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముంపు గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మళ్లీ ఇసుక, బుసక బస్తాలతోనే గండిని పూడ్చారు. కృష్ణానదికి భారీ వరద పోటెత్తడంతో అదీ కొట్టుకుపోయింది. గండి గురించి జిల్లా కలెక్టర్ వెంకటమురళీ, ఎమ్మెల్యే సూచనల మేరకు ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక పంపడం జరిగింది. సంబంధిత శాఖ అధికారుల బృందం కొన్ని నెలల క్రితం పెసర్లంక గండిని సందర్శించింది. అక్కడ గోడ నిర్మాణానికి వ్యయ అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు అందిస్తామని వారు చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో.. ఆగస్టు నెలలో మళ్లీ కృష్ణానదికి వరదలు వచ్చే అవకాశాలున్నాయి. పాలకులు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని గండి వద్ద గోడ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తిప్పుకోవద్దు.. సత్వర పరిష్కారం చూపండి

పీజీఆర్‌ఎస్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే బాధితులను తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. సమస్యలు పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి 191 మంది అర్జీలు అందజేశారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కారమార్గం చూపారు. కొన్నిటిని ఆయా శాఖల అధికారులకు కేటాయించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థ పరిధిలోకి దస్త్రాలన్నిటిని తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వారంలో లక్ష ఫైల్స్ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పీ4 అమలు తీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. పరిశీలనకు వెళ్లే ముందు సమయంలో గ్రామ కమిటీలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల నీడ్ బెస్ట్ సర్వే పరిశీలించాలని సూచించారు. సూర్యఘర్, స్వచ్ఛతహి కార్యక్రమాలు పరిశీలించాలన్నారు. గ్రామ,వార్డు సచివాలయాల సిబ్బంది బదిలీల నేపథ్యంలో పింఛన్ల పంపిణీలో సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు

- అమరావతి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజనీర్లతో కలిసి మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కొన్ని చోట్ల మాత్రం వర్షాల కారణంగా కొంచెం ఇబ్బందులున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు 12 టవర్లలో 288 ఫ్లాట్లు, ఆలిండియా సర్వీస్ అధికారులకు 6 టవర్లలో మొత్తం 144 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శుల కోసం 25 బంగ్లాలు, సెక్రటరీల కోసం 90 బంగ్లాలు, మంత్రుల కోసం 35 బంగ్లాలు, జడ్జిల కొరకు 36 బంగ్లాలు, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కొరకు మొత్తం 21 టవర్లలో 1968 ఫ్లాట్లు నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వివరించారు. గెజిటెడ్ అధికారుల్లో టైప్-1 అధికారుల కోసం 4 టవర్లలో 384 ఫ్లాట్లు, టైప్- 2 అధికారుల కోసం 4 టవర్లలో 336 ఫ్లాట్లు, గ్రూప్- డీ ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్లలో 720 ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు ఆయన తెలియ జేశారు. అమరావతిలోని హ్యాపీనెస్ట్ 6 టవర్లలో 1200 ఫ్లాట్లు నిర్మాణం జరుగుతుందన్నారు. వాటి పైలింగ్ వర్కులు వేగంగా (మిగతా 6వ పేజీలో)



అధికారుల భవనాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ



ఫ్రీఎన్‌ఐ, ఎన్‌ఐ వర్కులతో పలు రైళ్ల రద్దు

- కొన్ని పాక్షిక్ష రద్దు, దారి మళ్లింపు, క్రమబద్ధీకరణ

కడలి గర్భశోకం



- కలుషితమవుతున్న సముద్ర జలాలు
- మృత్యువాత పడుతున్న తాబేళ్లు, డాల్ఫిన్లు
- కాలుష్య కోరల్లో తీర ప్రాంతాలు
- పర్యావరణ పరిక్షణను పట్టించుకోని అధికారులు

సాంస్కృతిక వికాసానికి పునరంకితం కావాలి

- ప్రముఖ సినీ రంగస్థల నటుడు, దర్శకుడు కేఎస్‌టీ శాయి

8

ఎంఈవోలకూ.. ముఖ హాజరు

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

6



తటాకాన్ని తలపిస్తున్న చీరాల - బాపట్ల రహదారి

జోరు వాన

- వరి, వాణిజ్య పంటలకు ఊపిరి పోసిన వరుణుడు
- లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య
- డ్రెయిన్‌లలో పూడిక అడ్డుపడి మునుగుతున్న చేలు

బాపట్ల, జూలై 21, (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు మండిన ఎండలు సెగరేపితే మనుషులతోపాటు పైర్లూ మాడిపోయాయి. వరి నారుమళ్లు, వెదసాగు వరి చివర్లు ఎండి కళావిహీనంగా మారిపోతే, ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడటంతో వాతావరణం చల్లబడింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో వరుణుడు కుమ్మరించేశాడు. వర్షంతో పట్టణాల్లో రోడ్లన్నీ జలమయమైపోతే, చేలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. తెనాలిలో మాత్రం తాజాగా మురుగు కాల్వల పూడిక తీయటంతో చిన్న వానకే మోకాళ్లలోతు నీటితో నిండిపోయే బోస్‌రోడ్‌పై చుక్కనీరు కూడా కనిపించలేదు. రోడ్లవెంట ఆక్రమణలుకూడా తీసేసి, రోడ్డుకంటే అంచులు ఎత్తు లేకుండా కాంక్రీట్ చేయటంతో వర్షపునీరు కాల్వలోకి వెళ్లిపోవటంతో ముంపు సమస్య లేకుండా పోయింది. అయితే లోతట్టు ప్రాంతాలు మాత్రం వరద ముంపును తలపించాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఖరీఫ్‌కు ఊపిరి పోసినట్టయింది. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంటే, 2025-26 ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటికే లక్షన్నర ఎకరాలకుపైగా వెదపద్ధతిలో సాగు మొదలుపెట్టేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే ఖరీఫ్ సాగు కింద వరి నారుమళ్లు బోర్ల కింద పోస్తే, చాలావరకు వెద పద్ధతిలో విత్తనాలు చల్లేశారు. అయితే నిన్నటి వరకు ఎండ వేడి ఎక్కువగా ఉండటంతో పైరు చివర్లు మాడిపోయి, ఎండిపోయిన పరిస్థితి. అయితే వర్షం పడటంతో పైరుకు జీవం పోసినట్టే. అయితే సోమవారం మధ్యాహ్నం నుంచి వదలకుండా వర్షం పడుతుండటంతో వెద పద్ధతిలో ఇటీవల విత్తనాలు చల్లిన చేలల్లో మాత్రం చిన్న మొలకలను ముంచేశాయి. మొక్క కనిపించనంతగా వర్షం నీరు ముంచేసింది. ప్రస్తుతం పైరుకు ఇబ్బంది లేకున్నా, ఇదే తరహాలో మరో రెండు రోజులు వర్షం పడితే కొత్తగా విత్తనాలు చల్లిన చేలకు మాత్రం ఎంతో కొంత నష్టం తప్పదని రైతులు చెబుతున్నారు. మరో పక్క లంక గ్రామాల్లోని అరటి, పసుపు, కంద, తమలపాకు వంటి వాణిజ్య పంటలకు వర్షం మంచిమేలే చేసింది. నిన్నటి వరకు ఎండ వేడికారణంగా నీటి తడులు పెట్టటానికి రోజులు పడితే, ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నారు. వెద పద్ధతిలో నాటు వేసిన వరికి కూడా ఎకరా విస్తీర్ణంలో పైరుకు నీటి తడి పెట్టటానికి మోటార్‌లతో రెండు రోజులకు మించి సమయం పట్టింది. అటు వాణిజ్య పంటలకు కూడా ఇదే పరిస్థితి. ఎకరా నేల తడవటానికి రోజున్నర సమయం పట్టిన పరిస్థితి. వర్షం పడటంతో నీటి తడుల కష్టాలకు తెరపడింది. వదలకుండా పడుతున్న వర్షం కారణంగా డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. భట్టిప్రోలు, రేపల్లె మెయిన్ డ్రెయిన్‌లలో చాలాచోట్ల గుర్రపు డెక్క పేరుకుపోవటంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల గుర్రపు డెక్కపై కలుపు మందులు పిచికారి చేయటంతో అవి ఎండిపోయినా, ప్రవాహానికి అడ్డుగానే ఉండిపోయాయి. అయితే ప్రవాహం వేగం ఉన్న డ్రెయిన్‌లలో మాత్రం మొత్తం కిందికి కొట్టుకుపోతుంటే, చిన్న డ్రెయిన్‌లలో ఆటంకాలు ఏర్పడటంతో నీరు కిందికి పోలేని పరిస్థితి. దీంతో చేలల్లోకి వర్షపు నీరు చేరిపోతోంది. అయితే పైర్లు కేవలం 30 శాతం మాత్రమే ఉండటంతో నష్టం పెద్దగాలేదు.

చీరాల లోని పలు వీధులు జలమయం అయ్యాయి. బాపట్ల -చీరాల ప్రధాన రహదారితో పాటు ఈపూరుపాలెం, జాండ్రపేట సెంటర్లలో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ధాటికి బాపట్ల పాత బస్టాండ్ సెంటర్‌తో తటాకాన్ని తలపించింది. పర్చూరులో ఈదురుగాలులు ధాటికి కరెంటు తీగలు తెగిపడడంతో దాదాపు రెండు గంటల పాటు కరెంటు సరఫరాకు అంతరాయం కలిగింది. వీధులన్నీ జలమయం కాగా రాకపోకలకు అంతరాయం కలిగింది. అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా కురిసిన వర్షాలు మెట్ట ప్రాంతాలయిన నువ్వు, మొక్కజొన్న పంటలకు ఊపిరి పోశాయి. రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. మరో మూడు రోజుల పాటు ఇదేరీతిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బర్లీ పొగాకు నిల్వలను రైతులు ఇళ్ల వద్దే పట్టాలతో జాగ్రత్త చేసుకున్నారు. మార్క్‌ఫెడ్ తేమ నిబంధనలు పాటించాలని నిక్కచ్చిగా చెబుతున్న తరుణంలో బేళ్ల కిందకు నీళ్లు చేరడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



బాపట్ల : బీటీ రోడ్డుపై వర్షపు నీరు



అమృతలూరులో అసంపూర్తిగా గిడ్డంగి

అసంపూర్తిగా.. గిడ్డంగులు

అమృతలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం హయాంలో రైతు భరోసా కేంద్రాల అవసరాల కోసం ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఆయా సొసైటీల పరిధిలో గిడ్డంగులు నిర్మాణం చేపట్టింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే ఎరువులను స్టాకు ఉంచడం కోసం ఈ గిడ్డంగులు నిర్మాణం చేపట్టినట్లు అప్పటి అధికారులు చెప్పారు. దీనిలో భాగంగా అమృతలూరు మండల పరిధిలోని అమృతలూరు, ఇంటూరు, పెదపూడి, బోడపాడు గ్రామాల్లో వీటి నిర్మాణాలు చేపట్టారు. రైతు భరోసా కేంద్రాలకు నాబార్డు రుణం మంజూరుకు అవకాశం లేకపోవడంతో సహకార సంఘాలకు ప్రభుత్వం 33 సంవత్సరాలు లీజు ప్రాతిపదికన భూమి కేటాయించింది. ఈ భూమిలో గిడ్డంగులు నిర్మించాలని సహకార సంఘాలను ఆదేశించింది. ఈ భూమిలో గిడ్డంగి నిర్మాణానికి నాబార్డు నుండి 4 శాతం వడ్డీతో సహకార సంఘాలకు 45 లక్షల రూపాయలు రుణం మంజూరును ప్రభుత్వం చేయించింది. వీటి నిర్మాణానికి రాష్ట్ర స్థాయిలో అనుమతులు పొందిన గుత్తేదారుడు చేసిన పని వరకు బిల్లులు చేసుకుని పత్తా లేకుండా పోయాడు. అసంపూర్తిగా ఉన్న గిడ్డంగులతో సహకార సంఘాలపై ఆర్థికంగా అదనపు భారం పడటం మినహా మరే ప్రయోజనం లేకుండా పోయింది. బోడపాడు సహకార సంఘం పరిధిలో నిర్మాణం పూర్తికాగా మిగిలిన చోట్ల వీటి గురించి పట్టించుకునేవాడే లేకుండా పోయారు.

గడువిస్తేనే..బీమా!

(5వ పేజీ తరువాయి)

పత్తి ఎకరాకు రూ.1,900 ప్రీమియం ఈ నెల 31వ తేదీ కల్లా చెల్లించాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు బీమా పొగించడంతో పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎం.జగ్గారావు సూచించారు.

సాగు మొదలు కాని కంది, మిరప

కంది, మిరప పంటలు సాగు చేయలేదు. ఆయా పంటల సాగుపై రైతులకు ఇంకా స్పష్టత లేదు. వచ్చే నెల మొదటి వారంలో సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయనున్నారు. పల్నాడులో కంది సాధారణ సాగు విస్తీర్ణం 52,635 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సాగు చేపట్టలేదని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. వర్షాలు కొనసాగితే కంది సాగు ఈ నెలాఖరుకు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. అగస్టు 15 తర్వాతే మిరప సాగు చేసే అవకాశాలున్నాయి. అయితే.. అప్పటి వరకు బీమా సౌకర్యం లేదు. పంటలు సాగు చేయక ముందే బీమా పథ కాల గడువు ముగుస్తుండటం గమనార్హం. జిల్లా యూనిట్ గా పంటల బీమాను అమలు చేస్తే పంటలు సాగు చేశాక రైతులు బీమా ప్రీమియం చెల్లించే అవకాశం ఉంటుంది. బీమా గడువును అగస్టు అఖరు వరకు పొడిగించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే బీమా సౌకర్యాన్ని వారు కోల్పోయినట్లే.

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నా యని ఆయన అన్నారు. మొత్తం భవనాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఏఐఎస్ అధికారుల క్వార్టర్లు ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తిచేస్తామని, ఇతర నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఐకానిక్ భవనాల నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు, డిజైన్ రూపొందించిన నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధుల మధ్య తుది చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఐకానిక్ భవనాల నిర్మాణం కూడా ప్రారంభిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెలాఖరునాటికి 90 శాతం మ్యాన్ పవర్‌తో పనులు జరిపిస్తామని ఆయన చెప్పారు.

- డిసెంబర్ నాటికి మెజారిటీ సంస్థల నిర్మాణాలు ప్రారంభం

అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 72 సంస్థలకు భూకేటాయింపులు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సీఎం చంద్ర బాబు సమావేశం ఏర్పాటు చేసి ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పిన ఆయన, వాటిలో మెజారిటీ సంస్థలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తాయన్నారు.

చిన్న తరహా నీటి వనరుల గణన పూర్తి చేయాలి

అద్దంకి, జూలై21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామాల వారీగా చిన్న తరహా నీటి వనరుల గణన ఆగస్టు 10వ తేదీ లోపు పూర్తి చేయాలని బాపట్ల ఆర్‌డీవో కార్యాలయం డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ కమలాకర్ అన్నారు. అద్దంకి మండల వీఆర్‌వోలతో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి స్టాటికల్ ఆఫీసర్ కమలాకర్ మాట్లాడుతూ గ్రామాలలో చిన్ననీటి తరహా నీటి వనరులైన వ్యవసాయ బావులు, బోరుబావులు, నీటికుంటలు, చెరువుల గణన వేగవంతం చేయాలన్నారు. ముందు గా తహసీల్దార్ శ్రీచరణ్ తో చర్చించారు. కార్యక్రమంలో అద్దంకి, సంతమాగులూరు ఏఎస్‌ఓ లు అమర్నాథ్, ప్రసాద్, ఆర్ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

మార్టూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): మార్టూరులో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానం నూతన కమిటి పాలక వర్గం ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేసింది. ఈ సందర్భంగా దేవస్థానంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన కమిటి సభ్యులు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. వారిలో అధ్యక్షుడిగా కనమర్ల పూడి సాంబశివరావు, సెక్రటరీగా కనమర్ల పూడి కోటేశ్వరరావు, ట్రెజరర్‌గా మోదడుగు మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా గుర్రం శ్రీనివాస రావు, శ్రీరం రవిశంకర్, చీకటి మర్ల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా గట్టా యానాదిరావు,కనమర్లపూడి నవీన్, మోదడుగు ప్రసాద్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో స్థల దాత శ్రీరాం శేషగిరిరావు, కనమర్లపూడి ఆంజనేయులు, మద్దు హరిసీతారామయ్య, భోగనాథుని సతీష్ తదితరులు పాల్గొన్నారు.



దేవస్థానం నూతన కమిటి పాలకవర్గం

జలజీవన్ మిషన్ పథకం పనులకు శంకుస్థాపన

యద్దనపూడి, (మార్టూరు) జూలై21 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం లోని పూనూరు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం క్రింద ప్రభుత్వం నుంచి రూ.94 లక్షల నిధులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. వాటితో ఇంటింటికి మంచినీళ్ల పైప్ కనెక్షన్ ను ఏర్పాటుచేయడానికి, ఈ పథకం పనులకు సోమవారం గ్రామ టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బోయపాటి సాంబయ్య, ఈదల అనిల్‌కుమార్, దుగ్గినేని కోటేశ్వరరావు,వంకాయలపాటి వెంకటేశ్వర్లు,బడుగు కోటయ్య,కోడిరెక్క బాబు తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

తాటివారిపాలెం ఉపసర్పంచ్ ఆత్మహత్య

మార్టూరు, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటివారిపాలెం గ్రామ ఉపసర్పంచ్ తొట్టెంపూడి నరసయ్య (45) గడ్డిమందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు,కుమార్తె ఉన్నారు. ఏఎస్సై భాషా కథనం మేరకు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మండలంలోని బొల్లాపల్లి రెవెన్యూ పరిధిలోని సాగర్ కాలువ వద్ద నరసయ్య మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని గురించి వివరాలను తెలియచేస్తూ, ట్రాక్టరు డ్రైవరుగా జీవనం సాగించే నరసయ్య, కొంత అప్పులు చేయగా, ఈ విషయమై భార్యాభర్తల మధ్య వివాదం చోటుచేసుకొంది. దాంతో గత మూడు రోజులు క్రితం భార్య రేణుక, కుమారుడు, కుమార్తెను తీసుకొని అద్దంకి మండలంలోని వెంపరాల గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లింది. దాంతో తీవ్ర మనస్థాపానికి గురైన నరసయ్య గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వద్ద గడ్డిమందు సీసా ఉందని ఏఎస్సై భాషా తెలిపారు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాషా తెలిపారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

అధికారులకు అంగన్వాడీల విజ్ఞప్తి



ఒంగోలులోని సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీల ఆందోళన

ఒంగోలునగరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేంద్రాల నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని అంగన్వాడీలు సోమవారం జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీవోల కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు ఫేస్ యాప్‌ను తొలగించాలని, సెంటర్ నిర్వహణలో ఒక్క యాప్ మాత్రమే ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీడీపీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఒంగోలు రామ్‌నగర్‌లోని సీడీపీవో కార్యాలయంలో అంగన్వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయటంలో సర్వర్‌లు సక్రమంగా పనిచేయకపోవటం, ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్‌లో పాతఫోన్లలో సక్రమంగా పనిచేయక పోవటం వలన ఇబ్బందులు పడుతున్నామని అంగన్వాడీలు తెలిపారు. బాలింతలు, గర్భిణి, చిన్న పిల్లలకు పౌష్టికాహారం పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్ ద్వారా ఈకేవైసీ చేసి, ఫొటో తీసి మాత్రమే సరుకులు ఇవ్వాలనే నిబంధన పెట్టటంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అన్నపూర్ణ పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

- ‘మీ కోసం’లో అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం



‘మీ కోసం’ కార్యక్రమంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దేశించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశపు హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, ఎస్‌డీసీలు వరకుమార్, శ్రీధర్‌రెడ్డి, జాన్సన్, పార్థసారథి, కుమర్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

- భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటి వరకు 30 సార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారంకావడం లేదని మార్కాపురం మండలం తిప్పాయపాలేనికి చెందిన దుగ్గిరెడ్డి మునిరెడ్డి అన్నారు. సమస్యను పరిష్కరించాలని సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వహయంలో స్థానిక అధికార పార్టీ నేతల అండదండలతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యను పరిష్కరిస్తారని ఆశించామని, అయినా సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జోక్యం చేసుకొని తమ భూ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

- ఆక్రమణ దారుల నుంచి పశువుల మేత భూమిని కాపాడాలని పొదిలి మండలం నిమ్మవరం గ్రామానికి చెందిన గుదే నాగరాజు కోరారు. నిమ్మవరం గ్రామంలోని 8/4 సర్వేనెంబరులో 8.25 ఎకరాల ప్రభుత్వ పశువుల మేత భూమి ఉందన్నారు. గ్రామానికి చెందిన నాసరయ్య అనే వ్యక్తి ఆక్రమణ చేసి పశువులకు మేత లేకుండా చేస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమాన్ని సస్యశ్యామలం చేస్తాం

- మంత్రి బాలవీరాంజనేయస్వామి



సంక్షేమ కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 21 (ఆంధ్ర జ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గడికోట గ్రామంలో సోమవారం రాత్రి మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి వెనుకబడిన ప్రకాశం జిల్లాకే కాకుండా రాయలసీమకు కూడా ఏమాత్రం న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యామలంగా చేసే లక్ష్యంతో పని చేస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. పింఛన్ పెంపు, తల్లివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో అన్నిరంగాల్లో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

అద్దంకి, జూలై21 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ, సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా అన్నారు. మండలంలోని మణికేశ్వరంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నేతలు ఇంటింటికి పర్యటించారు. గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పునరావాస కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడాన్ని టీడీపీ నాయకుల దృష్టికి తీసుకుపోయారు. ఈ సమస్యపై మంత్రి రవికుమార్ ప్రత్యేకదృష్టి సారించి భూసేకరణ చేసి ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు చేపడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బడావలి, మీరావలి, ఈసు మౌలాలి, ఆదినారాయణ, మాధ్యూస్, సుధాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మైలవరం రోడ్డుకు శంకుస్థాపన

మండలంలోని శాంతినగర్-మైలవరం రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరగా పునః నిర్మాణం కు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిధులు మంజూరు చేయించారు. ఈ తారు రోడ్డు నిర్మాణంకు మంగళవారం ఉదయం 10 గంటలకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఉదయం 10-15 గంటలకు వెంపరాలలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు. సాయంత్రం 3-00 గంటలకు పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద గెస్ట్‌హౌస్‌లో జరిగే సంతమాగులూరు మండల క్లష్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ లు, కో కన్వీనర్ ల సమావేశం లో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు.

బంగారం షాపులో గుమస్తా మోసం

ఎస్పీకి ఫిర్యాదు చేసిన యజమాని



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): బంగారం షాపులో గుమస్తా లెక్కలు సరిగా చూపలేదని ఒంగోలు కు చెందిన బంగారం షాపు యజమా ని ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూల నుంచి 68 మంది ఎస్పీని నేరుగా కలిసి ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న వాటిని సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా దర్శి మండలంలోని ఓ సచివాలయ ఉద్యోగి సబ్సిడీ కింది వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానని రూ.3.80 లక్షలు తీసుకొని మోసం చేశాడని అద్దంకి మండలానికి చెందిన ఓ రైతు ఫిర్యాదు చేశారు. కుటుంబ అవసరాలకు ఓ మహిళ రూ.1.50 లక్షలు తీసుకొని చెల్లని చెక్కులు ఇచ్చి మోసం చేయడమే కా కుండా డబ్బులు తిరగి ఇవ్వాలని అడుగుతుంటే బెదిరిస్తుందని ఒంగోలు నగరంలోని గోపాల్‌నగరం చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, సీఐలు దుర్గా ప్రసాద్, షమీముల్లా, పాండు రంగారావు, ఎస్సై జనార్ధనరావు పాల్గొన్నారు.

ఎస్పీకి డ్రోను కెమెరా అందజేత

శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు వినియోగంచే డ్రోను కెమెరాను ఎస్పీ ఏఆర్ దామోదర్ కు పొదిలి మండలం కాటూరివారిపాలెంనకు చెదిన ఇరువురు అందజేశారు. మాకినేని వెంకటరమణయ్య, దంటు నరసింహారావులు కలిసి డ్రోన్ కెమెరాను కొనుగోలు చేసి ఎస్పీకి చేతులు మీదుగా పొదిలి ఎస్సైకి ఇచ్చారు. ఈమేరకు ఎస్పీ దామోదర్ వారిద్దరునూ అభినందించారు. సమాజం పట్ల వారికి ఉన్న సేవా భావానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై వేమన పాల్గొన్నారు.

సముద్రంలో పడి యువకుడు మృతి



చందు మృతదేహం

కొత్తపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సముద్ర స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ కొట్టుకుపోయిన యువకుడు మృత్యువాతపడ్డాడు. వివరాల్లోకి వెళితే... టంగుటూరు మండలం మర్లపాడుకు చెందిన జలదంకి నాగచందు(19) ఆదివారం మండలంలోని మడనూరు సముద్ర తీరంలో స్నానం చేస్తూ అలలకు కొట్టుకుపోయాడు. చందు మృతదేహం సోమవారం మండలంలోని వజ్జిరెడ్డి పాలెం తీరానికి కొట్టుకువచ్చింది. స్థానికులు అందించిన సమాచారంతో కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

వర్జీనియా పొగాకు రైతులకు విత్తనాలు

ఒంగోలు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బ్యారెన్ రైతులకు పొగాకు నారు విత్తనాలు కందుకూరు సీటీఆర్ఐ కేంద్రంలో ఇస్తారని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం 2 నిర్వహణాధికారి జె.తులసి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి బ్యారెన్ కు 500 గ్రాములు ఇస్తారని పేర్కొన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు తప్పనిసరిగా బోర్డు నుంచి కొనుగోలు అనుమతి పత్రం పొందాలన్నారు. అదేవిధంగా పొగాకు నారు వ్యాపారం చేసే వారు కూడా పొగాకు బోర్డు నుంచి విత్తన కొనుగోలు అనుమతి పత్రం పొందాలని చెప్పారు. ఆ పత్రాలు పొందిన వారు కందుకూరు సీటీఆర్ఐ కేంద్రం నుంచి విత్తనాలు పొందాలని ఆమె కోరారు



మున్సిపల్ చైర్మన్ సాంబశివరావును సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

మన్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- చైర్మన్ సాంబశివరావు

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతానని చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన చైర్మన్‌ను సోమవారం చీరాల రోటరీక్లబ్ ప్రతినిధులు సత్కరించారు. క్లబ్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ పారిశుధ్యం, డ్రెయిన్‌ల పూడికలపై ప్రత్యేకంగా వ్యవహరిస్తానని వివరించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ మూర్తి, గోకుల్ కుమార్, కృష్ణమూర్తి, లక్ష్మీ ప్రతాప్, రామకృష్ణ, హేమంత్‌కుమార్, రాఘవరావు, శ్రీనివాసబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

14 బైక్‌లు స్వాధీనం

గుడివాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుంచి రూ.6.50లక్షల విలువైన 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. సోమవారం ఒన్‌టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక ఏలూరు రోడ్డులో బైక్‌లను తనిఖీ చేస్తుండగా కొరడాల యేసు, చిలకంటి రంగారావులు అనుమానాస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించారని, వెంటనే పోలీసులు వెంబడించి పట్టుకున్నారన్నారు. వారిని విచారించగా ఏలూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణాజిల్లాలో 14 బైక్‌లను దొంగిలించినట్టు పేర్కొన్నారు. బైక్‌లను వేర్వేరు ప్రాంతాల్లో తాకట్టు పెట్టినట్టు తెలిపారు. ఆటో డ్రైవర్, తాపీ మేస్త్రీ ఇద్దరూ కలిసి ఆటస్థలాలు, ఆసుపత్రులు, ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను దొంగతనం చేసినట్టు విచారణలో తేలిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన పలువురు కానిస్టేబుళ్లకు రివార్డులను అందజేశారు.

మహిళా సమస్యలపై ప్రశ్నిస్తాం

- వైసీపీ ఎంపీ తనుజా రాణి

న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో మహిళా సమస్యలపై ప్రశ్నిస్తామని వైసీపీ ఎంపీ తనూజా రాణి తెలిపారు. ఆదివారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గురుమూర్తిలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం సరికాదన్నారు. ఏపీలో శాంతిభద్రతల అంశాన్ని పార్లమెంట్ లో లేవనెత్తుతామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. మద్యం కుంభకోణం పేరుతో ఉద్యోగులను ఇబ్బందులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

నాణ్యత లేని బర్లీ పొగాకు బేళ్లను తేవొద్దు!

- రైతులకు మార్క్‌ఫెడ్ ఎండీ సూచన

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన బేళ్లను మాత్రమే రైతులు తీసుకురావాలని మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి ఎండీ ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ‘పొగాకు బేళ్లను తెచ్చే ముందు రోజు నాణ్యత తనిఖీ చేసుకోవాలి. తేమ 20 శాతంలోపు ఉంటేనే తీసుకురావాలి. అధిక తేమ, నల్ల బొగులు, పచ్చ బొగులు, పండుగుల్ల, బాగా డ్యామేజ్ అయిన బేళ్లను తీసుకొచ్చి, రైతుల శ్రమ, సమయాన్ని వృథా చేసుకోవద్దు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని పొగాకును తీసుకు వచ్చి, రైతులు ఇబ్బంది పడవద్దు. మార్క్‌ఫెడ్ సూచనలు పాటించాలి’ అని ఆయన కోరారు. బర్లీ పొగాకు కొనుగోళ్లు సెప్టెంబరు చివరి వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 18 కేంద్రాల్లో బర్లీ పొగాకు కొనుగోళ్లు సాగుతున్నాయని, ఇప్పటికి 5,379 టన్నుల పొగాకును రూ.44కోట్లతో కొనుగోలు చేయగా, 2,196 మంది రైతులు లబ్ధి పొందారని ఢిల్లీరావు వివరించారు.

అవీ..ఇవీ..

కూటమి ప్రభుత్వం.. రైతు ప్రభుత్వం

● ఎమ్మెల్యే కొండయ్య



ఏఎంసీ చైర్మన్ జనార్ధన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దేశాయిపేట (చీరాల), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం రైతుల, నిరుపేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. సోమవారం వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట మార్కెట్ యార్డు కార్యాలయంలో చైర్మన్‌గా కౌతవరపు జనార్ధన్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఆయనతో పాటు డైరక్టర్ల ప్రమాణ స్వీకారం చేయగా, ఎమ్మెల్యే వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతు సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా అందించే పథకాలను నిశితంగా వివరించి పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలి



చిన్నారులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న ప్రతినిధులు

ఈపూరుపాలెం (చీరాల), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆటలు, స్కూల్ సమయం ముగిశాక వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హైదరాబాదు హెల్పింగ్ సంస్థ ప్రతినిధులు సుషీల్, డా.లక్ష్మీ సింధూరి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు అన్నివిధాలుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవకాశాలు సద్వినియోగం చేసుకుని లక్ష్యాలు చేధించాలన్నారు. కార్యక్రమంలో మార్పు గ్రెగోరీ, ఫాదర్ లాజర్ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలపై వినతి

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ మించాల సాంబశివరావును స్థానికులు సర్విశెట్టి సుబ్బరామయ్య, మువ్వల శివప్రసాదరావు కోరారు. ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుందని, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని, 27వ వార్డులో హిందూశ్మశాన వాటిక ఆక్రమణలు తొలగించాలని చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యుత్ షాక్ తో గేదె మృతి



మృతిచెందిన గేదె

అద్దంకి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకొత్తపల్లిలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. మానం నరసింహారావు తన చూడి గేదెను ఆదివారం పొలం తోలుక పోయాడు. పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద మేత మేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై గేదె మృతి చెందింది. సుమారు రూ.80 వేల విలువైన గేదె మృతి చెందటంతో నరసింహారావు కన్నీటి పర్యంతమయ్యారు.

25 వరకు నల్లబర్లీ పొగాకు కొనుగోలు

బల్లికురవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో నల్లబర్లీ పొగాకు ఉన్న రైతులు ఈ నెల 25 వ తేది వరకు సంతమాగులూరు మార్కెట్ యార్డు నందు కొనుగోలు చేస్తారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు సూచించారు. మండలంలో 109 మంది రైతుల వద్ద నల్ల బర్లీ పొగాకు ఉందని రైతులందరూ తమకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పొగాకును తీసుకెళ్లి అమ్ముకోవాలన్నారు. తేమశాతం 20 శాతం మించకుండా రైతులు చూసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలను పొగాకు రైతులు సంప్రదించాలని కోరారు.

జాతీయ రహదారిపై అదుపుతప్పిన లారీ



జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తాపడిన లోడులారీ

పంగులూరు, జూలై 21 (ఆంధ్ర జ్యోతి) : డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో లారీ అదుపు తప్పి బోల్తాపడిన ఘటన సోమవారం తెల్లవారు ఝామున చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమా చారం మేరకు చెన్నై నుంచి సోలార్ సామ గ్రితో హర్యానాకు వెళుతున్న లారీ మండలంలోని జాగర్లమూడివారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఈ ఘటనలో లారీడ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మార్టూరు, జూలై21(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గొట్టిపాటి నగర్ కాలనీకి సమీపంలోని చెట్లు వద్ద గుర్తు తెలియని యువకుడు(25) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడు మద్యం సేవించి ఉన్నట్లుగా గుర్తించామన్నారు. అతను ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. మృతుని ఆ చూకీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు.

ఆటో తగిలి ద్విచక్రవాహనదారునికి గాయాలు

మార్టూరు, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఆటో తగలడంతో ద్విచక్రవాహనదారుడు రోడ్డుపై పడి గాయపడిన ఘటన సోమవారం మార్టూరులోని శ్రీచైతన్య స్కూల్ సమీపంలోని సర్వీసురోడ్డులో చోటుచేసుకొంది. పట్టణంలోని బలరాంకాలనీకి చెందిన బాపట్ల రాజు ద్విచక్రవాహనంపై వెళుతుండగా పక్కనుంచి వెళుతున్న ఆటో తగిలింది. దీంతో అతను రోడ్డుపై పడిపడ్డాడు. దీంతో ముఖంపై గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న 108 వాహనం సిబ్బంది రాజును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాతనేరస్థులతో కొత్తసవాళ్లు



● నిఘా నుంచి తప్పుకోవడానికి వింతపోకడలు
● వీరికి సహకరిస్తున్న కొంతమంది సిబ్బంది
● స్వీయదాడులు చేసుకుంటూ పోలీసులపై నిందలు
● మరికొందరికి తప్పని ఉన్నతాధికారులు విచారణలు

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పదే పదే నేరాల్లో కీలకంగా వ్యవహరిస్తూ, గంజాయి ఇతర అక్రమ రవాణా, నాటుసారా, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై సస్పెక్ట్ షీట్, రౌడీ షీట్, కేడీలుగా పోలీసులు కేసులు నమోదు చేస్తుంటారు. ఇలాంటి షీట్లు ఉన్న వారిపై నిరంతరం పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారు. అయితే వీరి నుంచి తప్పించుకోవడానికి పోలీసులు వింతపోకడలు పోతున్నారు.

చీరాల వన్‌టౌన్‌లో 100 పాత నేరగాళ్లు ఉండగా, వీరిలో మహిళలు 10 మంది ఉన్నారు. అలాగే టూటౌన్ పరిధిలో 70 మంది నేరగాళ్లు ఉండగా వీరిలో 15 మంది మహిళలు, రూరల్ పరిధిలో 100 మంది ఉండగా వీరిలో మహిళలు 10 మంది, వేటపాలెంలో 50 మంది ఉన్నారు. వీళ్లల్లో ఎవరో ఒకరు ఏదో మూల నేరంలో పాల్పడి కేసుల్లో ఇరుక్కోవడం నిత్యకృత్యంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో చీరాల్లో ఒకవిధంగా నేరాల సంఖ్య పెరిగిందని చెప్పవచ్చు.

దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా ఉంచింది. ఇప్పటికే వీరు ప్రతి శనివారం ఆయా స్టేషన్‌లో స్టేషన్ అధికారి వద్ద హాజరై దినచర్య వివరాలు అందచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా, ఏదైనా, కారణం చేత హాజరుకాకుంటే వారిపై నిఘా వ్యవస్థతో పాటు స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. తద్వారా వాస్తవ పరిణామాలను పోలీసులు తెలుసుకుంటారు. అయితే పోలీసులు నిత్యం నిఘా ఉంచుతుండడంతో నేరగాళ్ల ఆటలు సాగడం లేదని నేరస్థులు కొత్తఎత్తులు వేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే పోలీసుల కంటే కూడా నేరస్థులే చట్టాలపై అవగాహన పెంచుకొని వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఏకంగా బ్లేడ్లు, చాకులతో వ్యక్తిగత దాడులు చేసుకుని గాయాల బారిన పడి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్నారు. ఫలానా అధికారి వేధింపులే కారణం అని ఆ పోస్టుల సారాంశంగా ఉండడంతో అవాక్కవడం పోలీసులు వంతువుతోంది. ఇలాంటి నేపథ్యంలో అరెస్టులకు, విచారణలకు వెళ్లిన పోలీసులను కూడా భయాందోళనకు గురి చేస్తూ దాడులు చేస్తున్నారు. ఈక్రమంలో సాక్షాత్తు పోలీసులే తమ భద్రత కోసం బతుకు జీవుడా అంటూ అక్కడి నుంచి తప్పుకొని ఈ ఘటనతో తమకు సంబంధం లేదని ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది.

అంట కాగిన పోలీసులతో అనర్థమే

ఇదిలా ఉంటే నేరుగాళ్లతో కొందరు పోలీసులు అంటకాగుతున్నారు. సుదీర్ఘకాలంగా ఇక్కడిక్కడే స్టేషన్లు మారుతూ నేరగాళ్లకు బాగా దగ్గరవుతున్నారు. పోలీసుల ప్రతి కదలికను నేరుస్థులకు అందిస్తూ మామూళ్లు దండుకుంటున్నారు. ఈ తరహా పోలీసులు దాదాపుగా అన్ని స్టేషన్‌లలోని, అన్ని విభాగాల్లో ఉన్నారనడంలో సందేహం లేదు. ఈ తరహా వారిపై దృష్టి సారించకుంటే నేరనియంత్రణ కష్టమేనని ప్రజలు భావిస్తున్నారు. ఎంతోకొంత పనిచేయాలనుకునే వారు మాత్రం నేరస్థుల తెలివితేటలకు భయపడి ఉద్యోగ భద్రతతో ఊగిసలాటలాడుతున్నారు.

పీడీ యాక్టులతోనే నియంత్రణ..!

ఏదో ఒక నేరంలో కేసులు నమోదు చేయడం 41 ఏ నోటీసులు అందించడం, లేదా అరకొర రిమాండ్‌లకు పంపడంతో సమస్యలకు పరిష్కారం ఉండదని, న్యాయ నిపుణులు చెబుతున్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై స్పష్టమైన నిఘా ఉంచాలి. అలాగే యాక్టీవ్ నేరస్థులపై పీడీ యాక్టులు నమోదు చేయాలి. ఈ విధమైన చర్యలతోనే నేరనియంత్రణ సులువుగా ఉంటుంది. ఈ తరహా ఆలోచనతో జిల్లా యంత్రాంగం పరిశీలించి శాంతి భద్రతలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి వనరుల వినియోగంపై సర్వే చేపట్టాలి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కమలాకర్

బల్లికురవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో వ్యవసాయ బోరుబావుల నీటి వినియెగంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయాలని జిల్లా డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ కమలాకర్ అన్నారు. సోమవారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయంలో చిన్నతరహా నీటి వనరుల వినియోగంపై గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ గ్రామాలలో రైతులు వినియెగిస్తున్న బోరు బావుల ద్వారా నీటిని ఎంతవరకు వినియెగిస్తున్నారు. వారి పంటలకు నీరు సరిపోతుందా లేక వృథా అవుతుందా..? అన్న వివరాలను రైతుల నుంచి తెలుసుకొని యాప్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని గ్రామాలలో రెవెన్యూ సిబ్బంది ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ శిక్షణలో తహసీల్దార్ రవినాయక్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ఏఎస్‌వో ఆర్ అమరనాథ్, సంతమాగులూరు ఏఎస్‌వో ప్రసాదరావు, ఆర్ఐ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



అవగాహన కల్పిస్తున్న శక్తి టీం

చినగంజాం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సత్ప్రర్తన అలవర్చుకోవాలని చీరాల శక్తి బృందం ఇన్‌చార్జ్ ఎస్.హరిబాబు అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని విద్యార్థినులకు సోమవారం ఆయన శక్తి బృందం సభ్యులతో కలిసి సెలఫోన్ దుర్వినియోగం, గుడ్, బ్యాడ్‌టచ్‌లు, మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హరిబాబు మట్లాడుతూ మహిళల భద్రత విషయంలో శక్తియాప్ ఎంతో కీలకమన్నారు. విద్యార్థి దశ నుండే మహిళా చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాని ఎంచుకొని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ. మోయిన్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్లను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలకు దూరంగా ఉండాలని అన్నారు. శక్తి యాప్ అంటే ఏమిటి, దానిని ఉపయోగాలు, బాల్య వివాహాల వలన కలిగే కష్ట, నష్టాలు, సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వినిమోగంతో వచ్చే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాం జలి, శక్తిబృందం సభ్యులు సునీత ధనలక్ష్మి, చినగంజాం మహిళా కానిస్టేబుల్ కవిత,రాజు సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థినులకు హార్మోన్లపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ విజయవర్ధన్

పంగులూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి):హార్మోన్ల లోపంతో సంక్రమించే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉపాస్ వైద్యశాల ఎండోక్రైనాలజి వెద్యనిపుణులు డాక్టర్ వి.విజయవర్ధన్ అన్నారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు హార్మోన్ల లోపంతో తలెత్తే వచ్చే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థినులు వ్యక్తం చేసిన అనుమానాలను నివృతి చేశారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం. సోమేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల, పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కనాటుతున్న జనసేన నాయకులు

చినగంజాం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎన్. విజయలు అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు మండల జనసేన ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు నందు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మొక్కలు నాటటమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని అన్నారు. ప్రకృతి సమన్వయం కూడా మొక్కల పెంపకంపైనే ఆధారపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో. జె.లక్ష్మిదేవి, వెలుగు సీసీ కె.వెంకటస్వామి, జనసేన నాయకులు చెరుకూరి లక్ష్మణరావు, బొప్పన శ్రీనివాసరావు, దొడ్డి పవన్, బి.సాయి, అంజి తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



పర్చూరులో జలమయమైన వీధి

అద్దంకి, జూలై21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలు మెట్టపైర్లకు జీవం పోశాయి. రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు అద్దంకి ప్రాంత రైతులు మొక్కజొన్న, నువ్వు తదితర మెట్ట పంటలు సాగు చేశారు. నెలరోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పైర్లలో ఎదుగుదల లేకుండా పోయింది. గత మూడు రోజులుగా వర్షాలు పడటంతో పాటు ఆదివారం అద్దంకిలో సుమారు 9.54 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. ఆదివారం కురిసిన వర్షంతో వాగులకు నీరు చేరింది. ఇప్పటికే సాగు చేసిన మెట్ట పంటలకు జీవం పోసినట్లయ్యింది. మిగిలిన పొలాలలో కూడా మొక్కజొన్నతో పాటు ఇతర పంటల సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. అదే సమయంలో బోరుబావుల కింద వరి నారు మడులు పోసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు.



జీవం పోసుకున్న నూము పైరు

బల్లికురవలో కుండపోత వర్షం

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. వారం రోజుల నుంచి ఎండల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. భారీ వర్షం పడడం వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండల నుంచి ఉపశమనం పొందారు. పంటల సాగుకు రైతులు భూములను దుక్కులు దున్ని సిద్ధం చేసి ఉన్నారు. వర్షంతో రెండు మూడు రోజుల్లో గ్రామాలలో పత్తి, సజ్జ, కంది పంటల సాగు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ ఏడాదికి ఇదే పెద్ద వర్షం అని రైతులు పేర్కొంటున్నారు. పంట భూములు పదును అయ్యాయని వారు తెలిపారు. కొందరు రైతులు మొక్కజొన్న పంట సాగు చేసేందుకు సన్నాహాలలో ఉన్నారు. భారీ వర్షంతో బల్లికురవ మండల కేంద్రంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రెండు గంటల పాటు కురిసిన వర్షంతో ఎక్కడ చూసిన వర్షపు నీరు కనిపించింది.

పర్చూరు : పర్చూరులో సోమవారం గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కురవడంతో రోడ్డు జలమయం అయ్యాయి. విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆయా కాలనీలలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నివాసాల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్ప డింది. స్థానిక బొమ్మల కూడలిలో గాలి దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు. డ్రైనేజ్ కాలువలు అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. పర్చూరు - చీరాల రోడ్డులో వాగును తలపించేలా రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు చేరింది. ఇందిరా కాలనీ, అంబేద్కర్ నగర్, నెహ్రూకాలనీలలోని పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో రోడ్లు జలమయం అయ్యాయి.

నీరు పోలేదంటూ రోడ్డుకు కోత

● మూడు రోజులైన పట్టించుకోని అధికారులు
● అవస్థలు పడుతున్న ప్రజలు



చీరాల- వేటపాలెం మధ్య కోతకు గురైన రోడ్డు

సాల్మన్‌సెంటర్ (చీరాల), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాల్మన్ సెంటర్ వద్ద చీరాల - వేటపాలెం ప్రధాన రహదారిలో ఓ అపార్ట్‌మెంట్ అవసరాలకు సంబధించి సుమారు 15 అడుగుల రహదారిని అడ్డంగా కోత వేశారు. ఆ అపార్ట్‌మెంట్ వ్యర్థ జలాలు రోడ్డుకు అవతలి వైపు ఉన్న హైమా వైద్యశాల పక్కన ఉన్న మురుగనీటి కాలువలో కలిపేందుకు రోడ్డును కోశారు. ఈఘటన జరిగి మూడు రోజులు అవుతుంది. నేటికీ పూడ్చక పోవడంతో ఈ ప్రాంతంలో వాహనదారులు పట్టుతప్పి కింద పడుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభం



పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడులో సోమవారం నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పంగులూరు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పొగకు బేళ్లతో గోడౌన్లు నిండడంతో కొనుగోలు కేంద్రాన్ని తూర్పు కొప్పెరపాడుకు మార్చారు. ఈ కొనుగోలు కేంద్రంలో సోమవారం 25 మంది రైతుల నుంచి 138 పొగాకుబేళ్లను కొనుగోలు చేసినట్లు పంగులూరు పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. కొనుగోళ్ల ప్రారంభానికి ముందు తూర్పు కొప్పెరపాడులోని గోడౌన్‌ను తహసీల్దార్ సింగారావు, బయర్ మారెళ్ల శ్రీధర్‌బాబు, లక్ష్మీదేవిలతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, స్థానిక నేతలు పూనాటి రామాంజనేయులు, ఎనికపాటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

అరగుండు చేయించుకుని కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు అరగుండు చేయించుకొని తమ నిరసనను తెలియజేశారు. చాలీచాలని జీతాలతో కార్మికులు జీవనం కష్టంగా మారిందని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. గత తొమ్మిది రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్, సామ్యూల్, వడివేలు, మారుతి, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 3న విస్తృత కళా పురస్కార సభ

అద్దంకిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుట్టంరాజు కళాక్షేత్రంలో ఆగస్టు 3న పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విస్తృత కళా పురస్కారం-2025 కార్యక్రమం డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో కవి, పురస్కార గ్రహీత శ్రీకృష్ణ సంపత్‌కుమార్‌కు ట్రస్ట్ తరఫున విస్తృత కళాపురస్కారం-2025ను అందించనున్నట్లు తెలిపారు. అందరు పాల్గొన్ని జయప్రదం చేయాలని శ్రీరామచంద్రమూర్తి కోరారు.


హెపటైటిస్ బీకి వ్యాక్సిన్

అద్దంకిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పసుమర్తిపాలెంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హెపటైటిస్ బీ, సీ పరీక్షలు నిర్వహించిన వారికి వ్యాక్సిన్ వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెపటైటిస్ బీ, సీ పరీక్షలలో నెగిటివ్ వచ్చిన వారికి ఇంటి వద్దనే ఏఎన్‌ఎం జె. రాధమ్మ వ్యాక్సిన్ వేసినట్లు సంస్థ ప్రతినిధి దుర్గ భవాని తెలిపారు. పరీక్షలలో పాజిటివ్ వచ్చిన వారికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పంపించి మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

బల్లికురవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బల్లికురవలోని జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో ఎకనామిక్స్ బోధించడానికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ ద్వారా ఎకనమిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 24 వ తేదీలోగా పూర్తి బయెడేటాతో సంప్రదించాలన్నారు. అర్హత ఉన్న వారిని నియామకం చేపడతామని ప్రిన్సిపల్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 22 జూలై 2025




మత్స్య శాఖ జేడీగా శాంతి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 21(ఆంధ్రజ్యోతి: మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా కె.శాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ మత్స్య శాఖ కమిషనర్ కార్యాలయంలో జేడీగా ఉన్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈ పోస్టులో ఇక్కడున్న నాగేశ్వరరావు పదవీ విరమణ చేసి విషయం తెలిసిందే. గతంలో నాగేశ్వరరావు అనారోగ్య సమస్యలతో నెల రోజులపాటు సెలవు పెట్టగా ఇన్చార్జి జేడీగా ఆమె బాధ్యతలు నిర్వర్తించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయ సిబ్బంది శాంతికి అభినందనలు తెలియజేశారు.



'ఈగల్'కూ దొరకని

గం'జాయ్'!



- గుట్టుచప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి, వ్యాపారం
- సేల్స్‌మెన్‌ల ద్వారా విక్రయాలు
- 20 నుంచి 50 గ్రాముల పొట్లాల్లో అమ్మకాలు
- మత్తులో జోగుతున్న విద్యార్థులు, యువత
- పెరుగుతున్న నేరాల సంఖ్య

ఎంత చేసినా.. ఏమి చేసినా జిల్లాను గంజాయి మత్తు మాత్రం వీడటం లేదు. గంజాయి, మాదకద్రవ్యాల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఈగల్'ను రంగంలోకి దింపినా దాని ప్రభావం అంతంత మాత్రంగానే ఉంటోంది. విశాఖ, దాని పరిసర ప్రాంతాల నుంచి అక్రమ మార్గాల ద్వారా గంజాయిని తెప్పించుకుంటున్న అక్రమార్కులు చిన్నచిన్న ప్యాకెట్లుగా విభజిస్తున్నారు. ఆ తర్వాత వాటిని నమ్మకస్థులు, ప్రత్యేకంగా నియమించుకున్న సేల్స్‌మెన్‌ల ద్వారా యువతకు విక్రయిస్తున్నారు. ఈ మత్తుకు బానిస అయిన యువత నేరాలకు పాల్పడుతోంది. ఇంత జరుగుతున్నా పోలీస్ యంత్రాంగం మాత్రం నిద్రమత్తు వీడటం లేదు.

నెల్లూరు (క్రైం), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గంజాయిని పెద్దఎత్తున పట్టుకుంటున్నా... ఆ వ్యాపారం మాత్రం జిల్లాలో యథేచ్ఛగా సాగుతూనే ఉంది. గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)ను రంగంలోకి దించినా గంజాయి విక్రయాలు, సేవనం మాత్రం అదుపు కావడం లేదు. జిల్లాలో విద్యార్థులు, యువత గంజాయి మత్తుకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

● పెరుగుతున్న నేరాలు

ఇటీవల నగరంలో జరుగుతున్న హత్యలు, గొడవలు, హత్యాయత్నాలు, హత్యలు.. తదితర ఘటనలన్నీ కూడా గంజాయి మత్తులోనే జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. గతంలో చిన్నబజారు పోలీసులు డ్రగ్ రాకెట్‌ను అదుపులోకి తీసుకోగా, వారు విద్యార్థులకు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, మెడికల్ విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నారు. కళాశాల యాజమాన్యాలకు తెలిసినా, తల్లిదండ్రులకు తెలియజేసి మిన్నకుండిపోతున్నారు. పోలీసులకు మాత్రం ఫిర్యాదు చేయడం లేదు.

● వ్యాపారం ఇలా..

గంజాయి వ్యాపారులు కొత్త పంథాను ప్రారంభించారు. విశాఖ, పరిసర ప్రాంతాల నుంచి గంజాయిని రైళ్లు, రోడ్డు మార్గాన జిల్లాకు తీసుకువస్తున్నారు. వారి నుంచి జిల్లాకు చెందిన కొందరు వ్యాపారులు ఆ గంజాయిని కేజీ రూ.3వేల నుంచి 5వేలకు కొంటున్నారు. వారు కింది స్థాయి వ్యాపారులకు కేజీ రూ.8 వేల నుంచి 10 వేల వరకు విక్రయిస్తున్నారు. గతంలో వీరు 20 నుంచి 50 గ్రాముల పొట్లాలుగా చేసి మత్తుప్రియులకు విక్రయించేవారు. అయితే ప్రస్తుతం వ్యాపారశైలి మారింది. యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వ్యాపారులు జిల్లాలో విక్రయాలు చేస్తున్నారు. కొంతమందిని సేల్స్‌మెన్లుగా ఏర్పాటు చేసుకొని, వారికి ఒక్కో గంజాయి పొట్లంపై కమీషన్‌తోపాటు నెలవారీ జీతం కూడా ఇస్తున్నారు. అంతేగాక విద్యార్థులు, యువతకు ముందుగా శ్యాంపిల్స్ ఇచ్చి గంజాయిని అలవాటు చేస్తున్నారు. అనంతరం వారి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అంతేగాక బార్లు, మద్యం షాపులు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విద్యాసంస్థలే లక్ష్యంగా అమ్మకాలు జరుపుతున్నారు.

కేసుల వివరాలు ఇలా...

సంవత్సరం	కేసులు	పట్టుకున్నది (కిలోలు)	విలువ (రూ.లక్షల్లో)	అరెస్టులు	వాహనాల సీజ్
2021	16	270.7	2.70	39	7
2022	7	708.4	7.8	15	7
2023	16	369.	3.69	93	10
2024	13	111.9	1.11	44	3



ఆర్టీసీ బస్టాండులో గంజాయి కేసు నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

గంజాయి స్వాధీనం

నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆర్టీసీ బస్టాండులో బస్సులను తనిఖీలు చేస్తుండగా, తమిళనాడు రాష్ట్రానికి చెందిన కన్నదశ, రాజేశ్వర్‌ను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా తునిలోని సతీష్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి దుండిగంలో అమ్మేందుకు వెళుతున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెడెంట్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ ఎస్‌డీ కాలేషావలి, కానిస్టేబుళ్లు ఎం. కిరణ్‌సింగ్, గిరిబాబు, జీవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేరుకే పరిమితమా!?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాదక మత్తు, మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా 'ఈగల్'ను ఏర్పాటు చేసింది. అయితే, జిల్లాలో ఈగల్ నిర్మాణం తూతూమంత్రంగా ఉంది. కేవలం ఓ కానిస్టేబుల్ నేతృత్వంలో ఈగల్ ముందుకు అడుగులు వేస్తోంది. దీంతో ఆశించినస్థాయిలో ప్రయోజనం ఉండటం లేదు. జిల్లాలో వరుసగా సాధారణ పోలీసులే గంజాయిని పట్టుకుని, కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం



గంజాయి కట్టడిపై ప్రత్యేకదృష్టి సారించాం. ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. వారు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, అమ్మకాలు, సేవించడంపై దాడులు నిర్వహిస్తున్నారు. ఆయా స్టేషన్ల పరిధిలోనూ అధికారులు గంజాయి, మత్తుపదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా పరిధిలోని చెక్‌పోస్టుల్లో గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

- జీ. కృష్ణకాంత్, ఎస్పీ

'యాక్సిస్' టోకరాలో

ఆ నలుగురు

- నాలుగు కంపెనీలు.. 56 మంది ఉద్యోగులు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరుతో రూ.10.6 కోట్ల రుణాలు
- బ్యాంకుకు రూ.9.2 కోట్ల రుణ బకాయిల ఎగవేత
- గతేడాది డిసెంబరులోనే వెలుగులోకి..
- అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు..
- సమగ్ర వివరాలు అడిగినా బ్యాంకు అధికారుల తాత్సారం
- తాజాగా రుణగ్రస్థులకు నోటీసులతో వెలుగులోకి..

ముత్తుకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సులభంగా బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామంటూ అమాయకులను మభ్యపెట్టారు. వారి ఆధార్ కార్డుల ద్వారా ఖాతాలు తెరిపించి వారి పేరుతో రూ.10.6 కోట్లను స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డిజిటల్ టెక్నాలజీని అడ్డం పెట్టుకుని బ్యాంకులను బురిడీ కొట్టించిన వైనం ఇది. నెల్లూరు నగరం పరిసర ప్రాంతాలకు చెందిన జాలే వాసుదేవనాయుడు, అల్లాబక్షు, శివ, వెంకట్ అనే వ్యక్తులు నగర పరిసర గ్రామాలలో అమాయకులను రుణాలు ఇప్పిస్తామని మభ్యపెట్టి యాక్సిస్ బ్యాంకుల్లో డిజిటల్ అకౌంట్లు తెరిపించారు. ఆపై నకిలీ డాక్యుమెంట్లతో ఏపీ నెట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఎంఆర్ ఇన్ఫ్రాలైన్, గ్లోబల్ సొల్యూషన్స్, క్యాపిటల్ ట్రీ పేర్లతో నాలుగు కంపెనీలను సృష్టించి ముత్తుకూరులోని యాక్సిస్ బ్యాంకులో కంపెనీ ఖాతాలను ప్రారంభించారు. అకౌంట్లు ఉన్న 56 మందిని కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించి ఆరు నెలల పాటు జీతాలను వారి ఖాతాకు బదిలీ చేశారు. అన్నీ సిద్ధం చేసుకున్నాక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించిన 56 మంది పేరుతో రూ.10.6 కోట్లు డిజిటల్ పర్సనల్ రుణాలు తీసుకున్నారు. కొందరి పేరుతో డిజిటల్ క్రెడిట్ కార్డులు తీసుకుని రూ.26లక్షల46వేల రుణాలు పొందారు. ఇదంతా (మిగతా 7లో..)



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఉద్రిక్తత

కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు మున్సిపల్ కార్మికుల యత్నం

అడ్డుకున్న పోలీసులు : నలుగురికి అస్వస్థత

నెల్లూరు (వైద్యం) జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం గాంధీబొమ్మ నుంచి ప్రదర్శనగా వచ్చిన కార్మికులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అందరూ కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. కేవలం నాయకులు మాత్రమే లోనికి వెళ్లాలని సూచించారు. అయితే కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని గేట్లు వేశారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య తొక్కిసలాట జరిగి, నలుగురు కార్మికులు కింద పడిపోయి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. చివరికి కొందరు నాయకులు మాత్రమే ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు మోహన్‌రావు, రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పెంచలనర్సయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నెల్లూరులోనే మొదటిసారి కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసేందుకు మంత్రి నారాయణ పూను కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు సూర్యనారాయణ, సుధాకర్, నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.



కార్మికులను అడ్డుకుని గేట్లు వేస్తున్న పోలీసులు

25న విచారణకు రండి!

● మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకు పోలీసుల నోటీసు

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుపై కోవూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి సోమవారం రాత్రి పోలీసులు నోటీసులు అందించారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు కోవూరు సర్కిల్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని, పోలీసులకు తెలియకుండా ఇంటిని విడిచి వెల్లకూడదని ఇలా పలు కండీషన్స్‌తో ప్రసన్నకు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ నోటీసులు అందించారు.

ఐరన్‌ఓర్ మైనింగ్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి 8

బస్టాండ్లకు సొబగులు

● జిల్లాలోని ఆర్టీసీలో పలుచోట్ల పనుల ప్రారంభం



జలదంకి ఆర్టీసీ బస్టాండ్‌లో జరుగుతున్న మరమ్మతులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్ల మరమ్మతులపై దృష్టి సారించలేదు. దీంతో ప్రయాణికులకు కనీస వసతులు కూడా వారు బస్టాండ్లకు రావడమే మానేశారు. బస్సులు బస్టాండు బయటే నిలిపే పరిస్థితులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడంపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లను మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

● జలదంకిలో పనుల పూర్తి

జిల్లాలో ముత్తుకూరు, పొదలకూరు, వింజమూరు, కలిగిరి, జలదంకి బస్టాండ్లను మరమ్మతులు చేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో భాగంగా ముందుగా జలదంకి బస్టాండు పనులు ప్రారంభించారు. ఆర్టీసీ కార్మికులు పెయింటింగ్‌లు, ఇతర సామగ్రితో జలదంకి బస్టాండులో కనీస వసతులు ఉండేలా పనులు పూర్తి చేశారు. బుచ్చి, ముత్తుకూరు, పొదలకూరు బస్టాండ్ల మరమ్మతుల పనులను కాంట్రాక్టర్లకు అప్పగించగా,అక్కడ కూడా పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన బస్టాండ్లలో సైతం త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.



బ్రెయిన్.. బాగుండాలి!

- మెదడు వ్యాధులపై తస్మాత్ జాగ్రత్త
- జిల్లాలో 1.50 లక్షల మంది బాధితులు
- జీవనశైలిలో మార్పు అవశ్యం
- నేడు ప్రపంచ బ్రెయిన్ దినోత్సవం

పొద్దున నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు చిన్నా.. పెద్దా.. అని లేదు, అందరికీ రకరకాల టెన్షన్లు. అన్నీ రంగాల్లో మానసిక ఒత్తిడి పెరగడం, సక్రమంగా నిద్ర పోకపోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, వీటన్నింటికీ తోడు స్మార్ట్ ఫోన్ వ్యసనం.. వెరసి మనిషి మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా శరీరాన్నంతటినీ నియంత్రించాల్సిన మెదడు గాడి తప్పుతోంది. వయసుతో నిమిత్తం లేకుండా మెదడు వ్యాధులు బాధిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 1.50 లక్షల మందికిపైగా మెదడు సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు అంచనా. ప్రశాంత జీవనం, ఆరోగ్యకరమైన ఆహారం, యోగా, ధ్యానం వంటివి అలవర్చుకోవడం ద్వారా మస్తిష్కాన్ని రోగాల నుంచి కాపాడవచ్చనేది నిపుణుల సూచన. - వివరాలు 8లో...

ఐటీఐ రెండోవిడత కౌన్సెలింగ్‌కు ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీన మెరిట్ నెం.1 నుంచి 90వరకు ఉదయం, 91 నుంచి 180వరకు మధ్యాహ్నం కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 24న 181 నుంచి 270 వరకు ఉదయం, 271 నుంచి 359 వరకు మధ్యాహ్నం ఉంటుందన్నారు. 25న జనరల్ పూల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని మొబైల్స్ ద్వారా అభ్యర్థులకు తెలియచేశామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

హలో.. టెండర్ వేయొద్దు!



నాబార్డు నిధులతో అభివృద్ధి చేయనున్న బాంబే హైవే-ఆత్మకూరు రోడ్డు

- ఆ వర్కు నేను తీసుకుంటున్నాను!
- పంచాయతీరాజ్‌లో ఓ కాంట్రాక్టర్ రుబాబు
- రూ.6.30 కోట్లతో ఆత్మకూరు రోడ్డుకు టెండర్లు
- ఆ వర్కుకు పోటీ లేకుండా అడ్డుకునే ప్రయత్నం
- తోటి కాంట్రాక్టర్లకు ఫోన్లు చేసి బెదిరింపులు?

నెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : 'హలో.. నేను ఆత్మకూరు రోడ్డు వర్కును తీసుకుంటున్నాను. మీరు ఆ వర్కు జోలికి రావద్దు. టెండర్ వేయవద్దు. కాదని వేస్తే ఇబ్బందులు పడతారు జాగ్రత్త!' పంచాయతీరాజ్‌లో ఓ కాంట్రాక్టర్ తీరిది. రూ.6.30 కోట్లతో అభివృద్ధి చేయనున్న బాంబే హైవే- ఆత్మకూరు రోడ్డు టెండర్ విషయంలో సదరు కాంట్రాక్టర్ వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తోటి కాంట్రాక్టర్లు పోటీకి రాకుండా ఉండేందుకు అక్రమదారులు తొక్కుతున్నారు. ఎలాగైనా ఈ వర్కును ఎక్సెస్‌కు దక్కించుకునేందుకు కుట్ర చేస్తున్నట్లు పంచాయతీరాజ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకు తనకున్న పలుకుబడిని ఉపయగించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి ఫలితంగా బాంబే హైవే నుంచి ఆత్మకూరు పట్టణంలోకి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డును నాబార్డు ద్వారా రూ.6.30 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం వర్కుకు పంచాయతీరాజ్ అధికారులు టెండర్లు ఆహ్వానించి ఉన్నారు. ఈ నెల 28వ తేదీ వరకూ బిడ్ దాఖలుకు గడువుంది. నాబార్డు వర్కు కావడంతో బిల్లులు త్వరగా వస్తాయన్న ఆశతో కాంట్రాక్టర్లంతా టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కాంట్రాక్టర్లు పోటీ పడితే టెండర్ లెస్‌కు వెళ్లే అవకాశముంది. అప్పుడు ప్రభుత్వ నిధులు ఆదా అవుతాయి. కానీ ఆత్మకూరు మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ వర్కుపై కన్నేశారు. ఎలాగైనా దక్కించుకోవాలని అడ్డదారులు తొక్కుతున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ వర్కుకు టెండర్ వేసేందుకు సిద్ధమవుతున్న కాంట్రాక్టర్లకు ఫోన్లు చేసి, చేయిస్తూ పరోక్షంగా బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరూ టెండర్ వేయవద్దని సూచిస్తున్నట్లు సమాచారం. ఈ రోడ్డు వర్కుకు టెండర్ వేయాలంటే 70 కి.మీ పరిధిలో మిక్సింగ్ ప్లాంట్ ఉండాలన్న నిబంధన ఉంది. దీంతో ఆ పరిధిలో ఐదు వరకూ ప్లాంట్లు ఉండగా, వారికి కూడా ఫోన్లు చేసి, ఎవరికీ ప్లాంట్లు లీజుకు ఇవ్వొద్దంటూ హెచ్చరిస్తున్నట్లు పంచాయతీరాజ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఈ వ్యవహారం ఇప్పుడు పంచాయతీరాజ్‌లో చర్చనీయాంశంగా మారింది.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 520

గ్రామాల్లో బెల్టు షాపులు ఎత్తివేయాలని వినతి

కావలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక, ఆరోగ్యాలపై ప్రభావం చూపుతున్న మద్యం బెల్టు షాపులను ఎత్తి వేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. మల్లి మాట్లాడుతూ కావలి డివిజన్‌లో మద్యం దుకాణాలు పాడుకున్నవారు గ్రామాల్లో డిపాజిట్లు కట్టించుకుని బెల్టుషాపులు ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. కొన్ని గ్రామాల్లో బెల్టు షాపులకు వేలం పాటలు కూడా పెట్టి వాటిని దక్కించుకున్నారని చెప్పారు. ప్రతి దుకాణం పక్కన ఉన్న కూల్‌డ్రింక్ షాపులలో కూల్ డ్రింక్స్ కన్నా మద్యం బాటిళ్లే ఎక్కువగా దొరుకుతున్నాయన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులను ఎత్తి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి బాధ్యులు బాపట్ల సత్యవతి, కొండమ్మ, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

దగదర్తి(బిట్రగుంట), జూలై 21(ఆంధ్రజ్యోతి): దగదర్తిలో వైసీపీ మండల కన్వీనర్ వెల్లినేని మహేష్‌నాయుడు ఆధ్వర్యంలో పార్టీ విస్తృత సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి శేఖర్‌నాయుడు, చింతలబోయిన వెంకటేశ్వర్లు, పీ.అనిల్‌రెడ్డి, సీహెచ్.వరుణ్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, ఆత్మకూరు గిరినాయుడు, ఎల్వీ ప్రసాద్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ నేత్రదానం


మెతుకు అలకానంద (ఫైల్)

కావలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురంకు చెందిన మెతుకు అలకానంద (59) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేయడానికి కావలి రెడ్‌క్రాస్ సభ్యుడు ఏజే మల్లేశ్వరరావు ప్రేరణతో ఆమె భర్త మెతుకు కోటయ్య అంగీకరించారు. దీంతో కార్నియాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నికల్ సునీల్ సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదాన ప్రశంసా పత్రాన్ని అందచేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 138వ నేత్రదానమని రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ. రవిప్రకాష్, నేత్రదాన విభాగం పర్యవేక్షకురాలు ఇలింద్ర శ్రీవాణి తెలిపారు.

510 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 633 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 510 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-97, ఆర్‌ఆర్-5, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-9 కారణాలతో 123 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.210.58గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

పీజీఆర్ఎస్‌కి ఒకే వినతి

కొండాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ఒక వినతి అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. గొట్టిగుండాలలో పొలాలకు వెళ్లే దారి ఆక్రమణకు గురైందని, సర్వే చేసి హద్దులు తేల్చాలంటూ రైతులు వినతిపత్రం అందచేశారన్నారు. ఈ సమస్య పరిష్కారం కొరకు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి ఆదేశాలిచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

బిట్రగుంట, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని కాండ్ర యువనేస్తం వ్యవస్థాపకుడు సతీష్‌నాయుడు అన్నారు. బోగోలు మండలం నాగులవరంలో వెలసి ఉన్న గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరుకు చెందిన ఏనుగుల డేనియల్ రెడ్డి శ్రీదేవమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు అందచేసిన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాండ్ర రామసుబ్బానాయుడు, రఘురామ్ నాయుడు, మల్లికార్జున నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్, వేణుగోపాల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే...

దగదర్తి(బిట్రగుంట) జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే సుపరిపాలన తొలిఅడుగుతో మీముందుకు వస్తున్నామని ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు అన్నారు. దగదర్తి మండలంలోని మాలేపాటి స్వగృహంలో మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజలు స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రైతు నాయకులు సుధాకర్ నాయుడు, కంచర్ల కృష్ణ, ముప్పాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ దరఖాస్తుకు రేపటి వరకు గడువు

కలిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23వ తేదీ వరకు గడువు ఉందని తహసీల్దారు గిరీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని రైతులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు, 1బి, అడంగల్ కాపీలను సమీప సచివాలయం లేదా తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.



కందుకూరు ఏఎంసీ, మాలకొండ ఆలయ కమిటీల

నియామకం ఎప్పుడో?

» పెరుగుతున్న ఆశావహులు » కొలిక్కి రాని నామినేటెడ్ పదవుల ప్రక్రియ » రిజర్వేషన్ మార్పు కారణంగానే జాప్యమా?

కందుకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవుల నియామకం ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్నా కందుకూరు నియోజకవర్గంలో ఉన్న రెండు ప్రధాన పాలక మండళ్ల వ్యవహారం కొలిక్కిరాకపోవడం చర్చనీయాంశమైంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల పాలక మండళ్లకు ఇప్పటికే మూడు జాబితాలు విడుదలైనా అందులో కందుకూరు లేకపోవడమే కాక ఐదారు నెలల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లి ఉన్న మాలకొండ దేవస్థానం పాలకమండలిని కూడా ప్రభుత్వం ప్రకటించకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతోన్నాయి. మాలకొండ దేవస్థానం పాలకమండలి పదవిని వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లోని పలువురు టీడీపీ సీనియర్ నాయకులతో పాటు కందుకూరు పట్టణానికి చెందిన పలువురు ఆశించినప్పటికీ బీసీ సామాజిక వర్గానికి ఆ పదవిని కేటాయించాలని నిర్ణయించిన నాయకత్వం వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి

● రిజర్వేషన్ మార్పుకోసమే ఆలస్యం?

చెందిన ప్రగడ నరసింహం పేరును సిఫార్సు చేస్తూ మిగితా కమిటీ సభ్యుల జాబితాతో ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తోంది. అయినా ఆ పాలకవర్గానికి జీవో విడుదల కాలేదు. అలాగే జిల్లాలోని అన్ని ఏఎంసీలకు పాలకవర్గాలను ప్రకటించినప్పటికీ కందుకూరు మాత్రం ఆ జాబితాలో లేకపోవటం చర్చనీయాంశంగా మారింది.

కందుకూరు ఏఎంసీ ఛైర్మన్ రిజర్వేషన్‌ను మార్పు చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పట్టుబడుతుండటమే పాలకవర్గం ప్రకటించకుండా జాప్యం జరగుతుండటానికి కారణంగా స్థానికులు భావిస్తున్నారు. కందుకూరు ఏఎంసీ ఎస్సీ (మహిళ)కు రిజర్వ్ అయ్యింది. అయితే ఈ రిజర్వేషన్ గత వైసీపీ ప్రభుత్వంలో చేసినది కావడంతో దానిని మార్పు చేయాలని కోరుతుండటంతో దీనిపై నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం జరుగుతుందని పార్టీ శ్రేణులు అంటున్నారు. ఈ పదవి కోసం గత ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన పలువురు నేతలు ఆశిస్తూ గత ఏడాది కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ మండల అధ్యక్షుడు నార్నె రోశయ్యలతో పాటు పలువురు సీనియర్ నేతలు ఉన్నారు. అయితే ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యి ఉండడం, పదవి ఆశిస్తున్న వారంతా ఓసీ సామాజిక


మాలకొండ ఆలయ ముఖద్వారం

వర్గంకు చెందిన వారు కావడంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందోనన్న సందేహాలు వ్యక్తమవుతోన్నా యి. ఎస్సీ రిజర్వేషన్‌కు అనుగుణంగా కొన్ని పేర్లను కూడా ప్రతిపాదిస్తూ సిఫార్సు చేసి ఉన్నప్పటికీ ఎస్సీ మహిళ రిజర్వేషన్ గత ప్రభుత్వం చేసినది అయినందున దానిని మార్చాలని కోరుతుండటంతో దీనిపై సస్పెన్స్ నెలకొంది. ప్రస్తుతం జిల్లా అంతా పాలకమండళ్లను ప్రకటించినప్పటికీ ఆ జాబితాలో కందుకూరు లేకపోవటంతో రిజర్వేష న్ మార్పు జరుగుతుందన్న ఆశాభావం ఆపార్టీ నాయకుల్లో ఏర్పడింది. పదవిని ఆశిస్తున్న వారిలో దామా మల్లేశ్వరరావు ఇటీవల తిరిగి పార్టీ పదవి చేపట్టేందుకు అంగీకరించగా రూరల్ మం డల అధ్యక్షుడుగా ఉన్న నార్నె రోశయ్య మాత్రం అవకాశం వస్తే పదవి తీసుకుంటాను లేకుంటే పార్టీకోసం స్వచ్ఛందంగా పనిచేస్తాను తప్ప తనకు పార్టీ పదవి వద్దని, రూరల్ మండల అధ్యక్షుడిగా మరొకరికి అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో కందుకూరు ఏఎంసీ రిజర్వేషన్ మార్పు జరిగితే ఆపదవి నార్నె రోశయ్యను వరించడం ఖాయమని అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వంలో చేసిన రిజర్వేషన్‌ను మార్చాలన్న వాదన కూడా బలంగా వినిపిస్తున్నందున మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : ఎంపీ

● రూ.6.2 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలసి మండలంలోని చలంచర్లలో పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గుర్రం సునీల్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సుపరిపాలనతో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో రూ.6.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ కావలికి బాగా పనిచేసే ఎమ్మెల్యే దొరికడం ప్రజల అదృష్టమన్నారు. అలాగే దగదర్తి ఏయిర్ పోర్టు సత్వర నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. రానున్న రెండేళ్లలో మండలంలోని ప్రతి మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తానన్నారు. గౌరవ రంలో భూగర్భ డ్రైనేజ్ పనులు జరుగుతు న్నాయని, అవి పూర్తి కాగానే ప్రతి గ్రామంలో భూగర్భ డ్రైనేజ్‌కు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్ర కాష్, పీఆర్ ఈఈ వేణుగోపాల్, డీఈ శ్రీనివాసులు, ఏఈలు సతీష్, సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి, టీడీపీ రూరల్ మండల అ ధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, నాయకులు ఉప్పాల వెంకట్రావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, కండ్లగుంట మధుబాబు నాయుడు పాల్గొన్నారు.

● నార్తుమోపూరులో...

అల్లూరు : కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొని అభివృద్ధివైపు పరుగులు పెడుతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నార్తుమోపూరులో ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేబాల శంకర్‌రెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, ఊటు శ్రీకాంత్ రెడ్డి, ఎండేటి హరికృష్ణ, కప్పిరి విష్ణు, ఏలూరు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అల్లూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం రాత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరాపై అధికారులను వివరణ కోరగా వారు తెలిపిన వివరాలకు స్థానికులు తెలిపిన సమస్యలకు పొంతన లేకపోవడంతో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


కరపత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఉలవపాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అండగా ఉంటానని, తప్పుదారి పట్టించే వారి మాటలు నమ్మవద్దని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం సాయంత్రం మండలంలోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీ, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలలో ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధిని ఓర్వలేని కొందరు అమాయక ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం కరేడులో భూసేకరణ చేపట్టనుందని, అభివృద్ధిని ఓర్వలేని కొందరు అమాయక ప్రజల్లో భయాందోళనలు పుట్టిస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మొద్దన్నారు. రామకృష్ణాపురం, ఉప్పరపాలెం భూసేకరణలో భాగంగా తొలగించబడతాయన్నారు. ఆ రెండు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద జాతీయ రహదారికి ఆనుకొని 5 సెంట్ల భూమిలో పక్కా గృహాలు నిర్మించి ఇస్తారని అందుకు తనదే బాధ్యతన్నారు. ఆ ఇళ్లలోకి చేరిన తరువాతే ఉన్న గ్రామాలను ఖాళీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే అందరం కలిసి మాట్లాడుకొని ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని రామకృష్ణాపురం ఎస్టీలు చెప్పగా, ఉప్పరపాలెం గ్రామస్థులు గ్రామం ఖాళీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆదాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30న పారా అథ్లెటిక్స్ పోటీలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాల్యాద్రి

కావలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): జూనియర్స్, సబ్‌జూనియర్స్ విభాగాల్లో పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఈనెల 30వ తేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని పారా క్రీడల కమిటీ జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రినాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని భవిత పాఠశాలలో దివ్యాంగులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగ క్రీడాకారులందరూ ఈ పోటీలకు హాజరు కావాలని కోరారు. జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో అర్హత సాధించిన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలకు, రాష్ట్రస్థాయి అర్హత సాధించిన వారిని జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక చేస్తామన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు ఉద్యోగాలలో మూడు శాతం రిజర్వేషన్‌ను కూటమి ప్రభుత్వం కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. క్రీడలకు హాజరయ్యే విద్యార్థులు దివ్యాంగుల సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫొటోతో సొంత ఖర్చులతో వచ్చి ఈనెల 30న ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలన్నారు.



మండలంలో తాగునీటి సమస్యలు లేవు

● సీహెచ్ రాజశేఖర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

లింగసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో 10 అడుగుల నీటిమట్టం ఉన్నందున 2026 జనవరి వరకు మండలంలో తాగునీటికి ఎ లాంటి ఇబ్బందులు ఉండవు. ఈ ప్రాజెక్టు ఆధారంగా గుడ్లూరు, రాళ్లపాడు-రోళ్లపాడు, చుండి-చెర్లోపాలెం పథకాల ద్వారా 38 గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు.

? మండలంలో తాగునీటి సరఫరా ఎలా జరుగుతోంది.

! రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే మూడు భారీ మంచి నీటి పథకాల ద్వారా 38 గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోంది.

? వర్షాలు కురవకపోతే ప్రాజెక్టులో నీరు ఎన్ని నెలలకు వస్తుంది.

! ఇప్పుడు వర్షాలు కురవకపోయినా వచ్చే ఏడాది జనవరి నెల వరకు ప్రాజెక్టు లోని నీరు సరఫరా చేయవచ్చు.

? మంచినీటి పథకాల నిర్వహణకు అవసరమైన సిబ్బంది ఉన్నారా.

! మంచినీటి పథకాల నిర్వహణకు సిబ్బంది కొరత లేదు. ఎక్కడైనా సమస్య వస్తే ఒక్కరోజులో పరిష్కరిస్తున్నాం.

? గ్రామాల్లో ఎన్ని చేతిపంపులు ఉన్నాయి. వాటి పరిస్థితి ఏమిటి.

! మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో సుమారు 400 చేతి పంపులు ఉన్నాయి. వీటిలో 10 పని చేయడం లేదు.

'యాక్సిస్' టోకరాలో ఆ నలుగురు

(5వ పేజీ తరువాయి)

ఫిబ్రవరి 2022, జనవరి 2024 మధ్య కాలంలో చోటుచేసుకుంది. ఆపై కొద్ది నెలల పాటు రుణాల ఈఎంఐ కింద రూ.కోటి41 లక్షల నగదు చెల్లించారు. ఆపై అడ్రస్ లేకుండా వెళ్లిపోయారు. రుణాలన్నీ డిజిటల్‌గా తీసుకోవడంతో ఆయా ఖాతాదారులకు రుణాల సంగతి తెలియకపోవడం గమనార్హం. రుణా ల బకాయిలు పేరుకుపోవడంతో నెల్లూరు నగర యాక్సిస్ బ్యాంకు మేనేజర్ మన్నేపల్లి మదన్మోహన్ కంపెనీ ఖాతాలు ఉన్న ముత్తు కూరు పరిధి పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది డి సెంబరు 23న ఫిర్యాదు చేశారు. తమ బ్యాంకును వాసుదేవనాయుడు, అల్లాబక్షు, శివ, వెంకట్‌లు 56 మందితో కలిసి నకిలీ పత్రాలు దాఖలు చేసి ఉద్దేశపూర్వకంగా రుణాల పేరుతో రూ.9.20 కోట్లు స్వాహా చేసి మోసం చేశారని ఆ ఫిర్యాదులో తెలిపారు. అప్పట్లో విచారించి కేసు రిజిస్టర్ చేసిన పోలీసులు 56 ఖాతాలను సంబంధించి దాఖలు చేసిన ధ్రువపత్రాలు, ముత్తుకూరు బ్యాంకులోని నాలుగు కంపెనీ ఖాతాల వివరాలు అందజేయాలని, బ్యాంక్ అధికారులకు లిఖితపూర్వకంగా కోరారు. అయితే, ఎందుకనో ఈ కేసు దర్యా ప్తులో పురోగతి కనిపించలేదు. తాజాగా నాలు గు రోజుల కిందట యాక్సిస్ బ్యాంకు నుంచి అసలైన ఖాతాదారులకు రుణాలు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామంటూ నోటీసులు జారీ అయ్యాయి. అసలు రుణాలు ఏమిటి.. ఎవరు ఇచ్చారో తెలియని కొందరు ఖాతాదారులు నెల్లూరులోని గిరిజన సంక్షేమ సంఘాన్ని ఆశ్రయించడంతో గుట్టు రట్టయింది.

కొద్దిపాటి వర్షానికే నీరు నిల్వ


కొండబిట్రగుంట గిరిజనకాలనీలో వర్షపు నీరు

బిట్రగుంట, జూలై 21(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురవడంతో సోమవారం పలు చోట్ల వర్షపు నీరు నిల్వ చేరింది. అభివృద్ధి పేరుతో గ్రామాల్లో ఇష్టాను సారంగా వేసిన సీసీ రోడ్ల కారణంగా వర్షపు నీరు వెళ్లే అవకాశం లేక ఈ పరిస్థితి నెలకొంది. కొండబిట్రగుంట గిరిజన కాలనీలో రోడ్లపైనే కాకుండా ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ చేరడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. సైడు కాలువలు తీసి గిరిజన కాలనీ వాసులను ఆదుకోవాలని కోరారు.

బీసీ బాలుర వసతి గృహంలో వైద్యశిబిరం

లింగసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ విద్యావతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, చిన్న చిన్న వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎంఎల్‌హెచ్‌పీలు మృదుల, శ్రీహరి, ఖాసింబాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న పెంచలయ్య

కావలి(టౌన్), జూలై 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను ఏజెన్సీలకు అప్పగించ కుండా పర్మినెంట్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. సోమవారం 5వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరే కిస్తున్నామన్నారు. వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తోపాటు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు చట్టబద్ధమైన సెలవులివ్వాలని జీవో 36 ప్రకారం జీతాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం పోలయ్య, ఎస్‌కె షానవాజ్, యూనియన్ నాయకులు టీ శీనయ్య, రమేష్, మహేష్, చిన్నమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూమి సమస్య పరిష్కరించండి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కచ్చేరిమిట్ట బాధితులు

కావలి(టౌన్), జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కచ్చేరిమిట్టలో చుక్కల భూమి సమస్య పరిష్కరించాలని బాధితులు సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అంజేశారు. వారు మాట్లాడుతూ తమ ఇళ్ల స్థలాలు, ఇళ్లు చుక్కల భూముల కింద ఉండడంతో రిజిస్ట్రేషన్‌లు జరగడంలేదని, బ్యాంకు రుణాలు ఇవ్వడంలేదని, క్రయ విక్రయాలు కష్టతరంగా మారాయన్నారు. 70 ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో నివశిస్తున్నామని, 2016 వరకు రిజిస్ట్రేషన్‌లు జరగడంతో పాటు బ్యాంక్ రుణాలు కూడా పొందామన్నారు. 2016 నుంచి చుక్కల భూమి నెపంతో రిజిస్ట్రేషన్‌లు జరగడంలేదని, దీంతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దిలీప్‌కుమార్, బాధితులు రతన్‌ప్రసాద్, ఈదూరు జైపాల్, ఇమ్మానియేల్, తాతపూడి ప్రసాద్, సందేశ్, కొనిదల మార్క్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై అవగాహన


సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వార్డు సచివాలయాల పారిశుధ్య విభాగం సిబ్బంది

కందుకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలు, ప్లాస్టిక్ వినియోగంను ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా బహిష్కరించాల్సిన ఆవశ్యకతపై స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాల పారిశుధ్య విభాగం సిబ్బంది విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వలన పర్యావరణానికి పొంచిఉన్న ముప్పును వివరించారు. విద్యార్థులంతా ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటంతో పాటు తల్లిదండ్రులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలని కోరారు.

శబాష్ సారూ..

- నాడు 22.. నేడు 110 మంది
- ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్య



ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా చేయాలని సంకల్పించిన ఆ ఉపాధ్యాయులు ఆ దిశగా అడుగులు వేశారు. 22 మంది ఉన్న విద్యార్థుల సంఖ్యను 110కి పెంచారు. అనంతసాగరం ఉర్దూ ప్రాథమి క పాఠశాలను ఈ ఏడాది ప్రభుత్వం ఆదర్శ పాఠశాలగా గుర్తించి, ఐదుగురు ఉపాధ్యాయులను నియమించారు. అప్పటికి అక్కడ విద్యార్థుల సంఖ్య కేవలం 22 మంది మాత్రమే. కాగా ఆ సంఖ్యను ఎలాగైన పెంచాలని టీచర్లు సంకల్పం బూని విద్యార్థుల కోసం వేట సాగించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి పిల్లల్ని ఆదర్శ పాఠశాలకు పంపాలని అభ్యర్థించారు. ప్రైవేటుకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని నమ్మకం నమ్మకం కలిగించారు. ఇంకేముంది.. ఒక్కొక్కరు గా పాఠశాలలో చేరడం ప్రారంభించి, చివరకు 110 మందికి చేరింది.

● వెంటాడుతున్న సమస్యలు

విద్యార్థుల సంఖ్యను పెంచడంలో ఉపాధ్యాయుల కృషి ఫలించింది. అయితే అందుకు తగ్గట్టు అక్కడ వసతులు మాత్రం కరువయ్యాయి. వర్షం కురిస్తే చాలు పాఠశాల ప్రాంగణం చిత్తడిగా మారుతుంది. మరుగుదొడ్లు సరిగా లేవు. కొన్ని తరగతి గదుల్లో వైట్‌వాష్ చేయలేదు. ఫ్యాన్లు లేవు. అధికారులు చొరవ చూపి స్కూలులో వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

యూరియా టెన్షన్ వద్దు!

కలువాయి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి కళారాణి తెలిపారు. సోమవారం ఏకరాకు ఒక బస్తా వంతున 400 బస్తాలు అధికారులు రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని కలువాయి, మాదన్నగారి పల్లె, కుల్లూరు, బద్దెవోలకు ఇప్పటికి 2300 బస్తాలు యూరియా పంపిణీ చేశామని, ఇంకా కావలసిన రైతులకు రైతుసేవా కేంద్రాల ద్వారా సొసైటీ ద్వారా యూరియా అందజేస్తామని తెలియ జేశారు. కాగా, సోమవారం యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు కలువాయి సొసైటీ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు అవగాహన కార్యక్రమాలు, రక్షణ చర్యలు తీసుకుంటున్నా కొందరికి తలకెక్కడం లేదు. ఒకరు లేదా ఇద్దరు వెళ్లాల్సిన మోటారుబైక్‌పై ముగ్గురు, నలుగురు ప్రయాణం చేస్తున్నారు. అందులోనూ హెల్మెట్ కూడా ధరించడం లేదు. ఆదివారం సంగం ముంబాయి జాతీయ రహదారిపై ఓ కుటుంబం లోని భర్త, భార్య, ఇద్దరు పిల్లలు ఒకే మోటారుబైక్‌పై వెళ్తూ ఆంధ్రజ్యోతి కంటపడ్డారు. ఇలాగైతే ప్రమాదాలు జరగవా.. ప్రాణానికి రక్షణ ఎక్కడ ఉంటుందని పలువురు పేర్కొన్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)



ఇలాగైతే ప్రమాదాలు జరగవా?

సేంద్రియ ఎరువులపై అవగాహన పెంచుకోవాలి

- డీఏవో సత్యవాణి ● పోస్టర్లు విడుదల చేసిన కలెక్టర్, జేసీ



సేంద్రియ, జీవన ఎరువుల వినియోగంపై అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), జూలై 21 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ, జీవన ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి పేర్కొన్నారు. సేంద్రియ, జీవన ఎరువులు, పొడినేలల్లో చల్లే నవధాన్యాల పద్ధతులపై అవగాహన కల్పించే పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్, జేసి కార్తీక్ విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా 25 శాతం వరకు రసాయనిక ఎరువుల ఖర్చును తగ్గించవచ్చన్నారు. రైజోబియం, బ్లూ గ్రీన్ ఆల్గే, అజోల్ల, మైకోరైజా వంటి నత్రజని ఆధారిత జీవ ఎరువుల వాడకం వల్ల వాతావణంలోని నత్రజనిని నేలలో నిలుపుతూ మొక్కలకు అందుబాటులోకి తీసుకురావచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, ఏడీఏ నర్సోజీరావు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజ్‌కుమార్, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● పీ 4 గ్రామసభలు పక్కాగా జరగాలి : కలెక్టర్

పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించడం, ఆర్థికంగా స్థిరపడిన మార్గదర్శులకులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పీ 4 గ్రామ సభలు పక్కాగా జరగాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన ప్రాంగణంలో సోమవారం పీ 4పై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పీ 4 కార్యక్రమం ఉద్దేశ్యాన్ని ఆయా శాఖల పరిధిలోని కిందిస్థాయి సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈసమావేశంలో డీపీవో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ సీఈవో మోహన్ రాజు, సీపీవో నరసింహారావు, జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, డ్వామా పీడీ గంగా భవాని, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, డీఎంహెచ్‌వో సుజాత, డీటీసీ చందర్ తదితరులు పాల్గొన్నారు.

● కంపోస్టబుల్ ఉత్పత్తులే వాడాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు కంపోస్టబుల్ ఉత్పత్తులే వాడాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన ప్రాంగణంలో సోమవారం కంపోస్టబుల్ ప్రొడక్ట్‌లపై అవగాహన కల్పించారు. జేసి కార్తీక్ మాట్లాడుతూ ఈ ఉత్పత్తులపై అన్నీ శాఖల అధికారులు అవగాహన పెంచుకుని కలెక్టర్ సూచనల మేరకు తొలి అడుగు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, జిల్లా అధికారులు లక్ష్మీ పాలీమర్స్ రాజు, ఎలైట్ బయోటెక్ కంపెనీ ప్రతినిధి హేమసాయి తదితరులు పాల్గొన్నారు.

మెదడును మెలిపెట్టొద్దు!

- నేడు ప్రపంచ బ్రెయిన్ దినోత్సవం
- ఆధునిక సమాజంలో మెదడు వ్యాధులు అధికం
- జీవనశైలిలో మార్పులతో అనర్థాలు
- అన్నీ వయసుల వారికి సమస్యలు
- వృద్ధాప్యంలో మరింత చేటు
- జిల్లాలో 1.50 లక్షలమంది వ్యాధిగ్రస్థులు
- ముందు జాగ్రత్తలు తప్పనిసరి

మానవ శరీరంలో అత్యంత ప్రాధాన్యత గల భాగం మెదడు(బ్రెయిన్). శరీరాన్నంతటినీ నియంత్రించేది ఇదే. అలాంటి మెదడు ఆరోగ్యం విషయం లో అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతినే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ న్యూరోఫెడరేషన్ మెదడుకు సంబంధించి అనేక హెచ్చరికలు చేశారు. ఈ క్రమంలో ఏటా జూలై 22వ తేదీన ప్రపంచ మెదడు దినోత్స వం జరుపుకోవాలని నిర్ణయించాయి. మెదుడు వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని సూచించింది.

వ్యాధులకు కారణాలు....

- విపరీతంగా మద్యం సేవించడం
- ప్రకాశవంతమైన కాంతిని అదే పనిగా చూడడం
- మందులు విపరీతంగా తీసుకోవడం
- ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు
- ప్రమాదాల సమయంలో హెల్మెట్ వాడకపోవడం
- ఎక్కువగా కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్లతో కాలం గడపడం
- ఎక్కువ ఎత్తు ప్రదేశాలు ఎక్కడం
- ప్రసవ సమయంలోగానీ, ప్రమాద సమయంలోగానీ తలకు గాయం కావడం
- మెదడులో కంతులు, చీముగడ్డలు, హెచ్ఐవీ సంక్రమణ.

రోగ నిర్ధారణ... చికిత్సలు

- రక్తపరీక్షలు, కంప్యూటరైజ్, యాక్సియల్ కోమోగ్రఫీ పరీక్షలు, ఎలక్ట్రో ఎన్సెఫాలోగ్రఫీ(ఈఈజీ) చేస్తారు.
- సిటీస్కాన్, మాగ్నటిక్ రిసోనాన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ) ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు.
- యాంటీ కన్వల్సెన్స్ అనే మందులు ఉపయోగించడం
- మెదడులోని వ్యాధికి కారణమైన భాగాన్ని శస్త్రచికిత్స ద్వారా తొలగించడం
- ఆహార నియమాలు పాటించడం
- అధిక కొవ్వు, తక్కువ పిండి పదార్థాలు వాడడం
- మూర్ఛ వ్యాధిని తగ్గించేందుకు మెదడులో ఉన్న వేగస్ అనే ప్రాంతాన్ని పేస్‌మేకర్ వంటి ఎలక్ట్రికల్ పరికరాన్ని అమర్చడం ద్వారా ప్రేరేపించడం.



నెల్లూరు (వైద్యం), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక జీవనశైలిలో విపరీతమైన ఒత్తిళ్ల కారణంగా, మనోవేదన కారణంగా ఎంతో మంది మెదడు సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. కొందరు జన్యు సంబంధ కారణాలతో ఈ వ్యాధులబారిన పడుతున్నారు. జిల్లాలో 1.50 లక్షలమందికిపైగా మెదడు సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు సమాచారం. వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ ఈ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. మెదడు కణాల్లో ఏర్పడిన సమస్య కారణంగా శరీరంలో కొంకర్లు, మూర్ఛ, ఫిట్స్ వంటి సమస్యలు వస్తున్నాయి. ఎక్కువగా పట్టణ ప్రాంతాల వారు ఈ వ్యాధులకు గురవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. నిత్యం ఉరుకులు.. పరుగుల జీవితం, శారీరక వ్యాయామం లేకపోవడం మెదడు పనితీరుపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా వ్యాధులపై పూర్తిగా అవగాహన పెంచుకుని ప్రశాంత జీవనాన్ని అలవాటు చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వృద్ధాప్యంలో మరింత జాగ్రత్త

వృద్ధాప్యంలో మెదడు వ్యాధుల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. బ్రెయిన్ స్ట్రోక్‌తోపాటు, పార్కిన్‌సన్, మతిమరుపు వంటివి బాధిస్తాయి. 60 నుంచి 80 ఏళ్ల వయసున్న వారిలో 10 నుంచి 20 శాతం మంది ఈ వ్యాధుల బారినపడుతున్నట్లు అంచనా. నరాల వ్యాధులతో బాధపడేవారు త్వరగా మెదడు వ్యాధులకు గురవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఇడియోపతి పార్కిన్‌సన్స్(వణుకుడు) వ్యాధి సాధారణంగా వృద్ధాప్యంలో వస్తుంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది. మెదడులోని డొపెమిన్ నరాలు సంఖ్య తగ్గడం వల్ల ఈ వ్యాధికి గురవుతారు. క్రమంగా మతిమరుపు పెరిగి ఆ తర్వాత మనుషులను గుర్తించలేని స్థితికి చేరుకుంటారు.

అప్రమత్తంగా ఉండాలి



మెదుడు వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరగా నయంచేసే అవకాశం ఉంటుంది. నిర్లక్షం వహిస్తే ఒక్కోసారి అది ప్రాణాపాయానికి దారితీస్తుంది. వృద్ధులకు ఎక్కువగా పార్కిన్‌సన్ వ్యాధి వస్తుంది. ఇది మెదుడులోని రసాయన లోపం వల్ల వస్తుంది. వీటి లక్షణాలను ముందే గ్రహిస్తే నివారణ మార్గాలు కూడా ఉన్నాయి.

- డాక్టర్ ధీరజ్, జీజీహెచ్, న్యూరో సర్జన్

వరుస చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్టు

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో పట్టపగలే వరుస చోరీలకు పాల్పడిన ముఠాను కావలి వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నగరంలో రెండురోజుల క్రితం పట్టపగలే చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలోని ఉమాకాంత్ ఇంట్లో 12 సవర్ల బంగారు నగలు, సోమేశ్వరి ఇంట్లో 36.75 గ్రాముల నగలు, అదే ప్రాంతంలో మరో ఇంట్లో దోపిడీకి యత్నించారు. అదే రోజు వేదాయపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని బుచ్చయ్య ఇంట్లో 50 సవర్ల బంగారు ఆభరణాలు, నగదు, వెండి దోచుకెళ్లారు. ఒకేరోజు నగరంలో వరుసగా మూడు ప్రాంతాల్లో చోరీలు, ఓ ఇంట్లో దోపిడీయత్నం జరగడం జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ క్రమంలోనే జిల్లాలో జరిగిన చోరీల గురించి తెలుసుకున్న తిరుపతి జిల్లా పోలీసులు ఇదే కోవలో తమ జిల్లాలోనూ చోరీలు జరిగాయని ఇక్కడ పోలీసు అధికారులతో చర్చించారు. దీంతో అప్రమత్తమైన నెల్లూరు, తిరుపతి పోలీసులు నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో తిరుపతి పోలీసులు నెల్లూరులో దొరికిన సీసీ పుటేజీల ఆధారంగా నలుగురు నిందితులను కావలి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైం) : ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరు ఎంజీబీ లేవుట్‌లో ప్రభుత్వ ఉద్యోగి వెంగయ్యలక్ష్మి దంపతులు ఉంటున్నారు. లక్ష్మి ఇటీవల తన పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 19న వెంగయ్య ఆ ఫీసుకు వెళ్లారు. అక్కడ నుంచి తన స్వగ్రామమైన చిలకలమర్రికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 44గ్రాముల ఆభరణాలను చోరీ చేశారు. 20వ తేదీ ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన పక్కింటివారు వెంగయ్యకు ఫోన్‌చేసి చెప్పారు. దీంతో ఆయన నగరానికి చేరుకున్నారు. చోరీపై వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

27, 28 తేదీల్లో వడ్డెరల సంఘం రాష్ట్ర మహాసభలు



పాటల క్యాసెట్‌ను విడుదల చేస్తున్నవడ్డెర సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం) జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈ 27, 28వ తేదీల్లో నెల్లూరు నగరంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ తెలిపారు. సోమవారం నగరంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోటకొండ వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ వడ్డెర సమాజం నిర్మాణ రంగంలో పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. అయితే ప్రభుత్వం వీరికి తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలును, ఇబ్బందులను కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ప్రజా నాట్యమండలి వడ్డెరల సమస్యలపై రూపొందించిన పాటల క్యాసెట్లను విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, కోశాధికారి మల్లి నాగార్జున, నేతలు వల్లపు సుధాకర్, బత్తల రత్తయ్య, నారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా మాజీ కార్యదర్శి విజయ కుమార్, సోమవరపు వెంకయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఎస్‌టీసీలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష కార్యాలయం పరిధిలో జిల్లాలో నిర్వహించే నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ల(ఎన్ఆర్ఎస్‌టీసీ)కు మండలాల వారీగా అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 ఏళ్లలోపు బడి మానేసిన విద్యార్థులను, ఇప్పటి వరకు పాఠశాలలకు వెళ్లని పిల్లలను, వివిధ పనులు చేస్తున్న పిల్లలను గుర్తించి వారిని ఎన్ఆర్ఎస్‌టీసీలలో చేర్పించాలన్నారు. ఇందు కోసం అన్నీ మండలాల్లోనూ కేంద్రాలు ఏర్పాటుకు స్థానికంగా బీఈడీ, డీఈడీ అర్హతున్న అభ్యర్థులు ఈనెల 24 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్నీ ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వైద్య సేవల ధరలు ప్రకటించాలి

- డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం) జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్‌లు, ల్యాబ్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా ఆయా వైద్య సేవల ధరల పట్టికను ప్రకటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ఆసుపత్రుల ముందు ధరల ప్రకటన బోర్డులు పెట్టాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఆసుపత్రి, డయాగ్నోస్టిక్, ల్యాబ్‌ల వద్ద సేవల ధరలను కచ్చితంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. అలాగే రిసెప్షన్ కౌంటర్ వద్ద స్పష్టంగా కనిపించేలా ఈ పట్టిక ఉంచాలన్నారు. ఆ వివరాలను ఫొటోతీసి వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపాలన్నారు. ఈ పక్రియను వారంలో పూర్తి చేయాలని ఆమె సూచించారు.

వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలులో ఉన్నందున తాత్కాలికంగా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు. కాకాణి అందుబాటులోకి వచ్చే వరకు చంద్రశేఖర్‌రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారని తెలిసింది. కాగా, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా ఉన్న ఎంపీ మిధున్‌రెడ్డి అరెస యిన నేపథ్యంలో ఆయన స్థానంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును నియమించారు.

ప్రజా ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ ఆనంద్ ● అందిన 249 ఫిర్యాదుల్లో రెవెన్యూవే అధికం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(విద్య), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో కొన్ని శాఖలు వెనుకబడి ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వే, ఎడ్యుకేషన్, పోలీస్, గనులశాఖ, డిజేబుల్ వెల్ఫేర్, దేవదాయ శాఖలు సమస్యల పరిష్కారంలో వెనుకంజలో ఉన్నాయన్నారు. ఫిర్యాదుల విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని, ప్రతీ శాఖ కూడా ఫిర్యాదుల విషయంలో ఆడిట్ నిర్వహించుకుంటూ సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. మొత్తం 249 ఫిర్యాదులు అందగా, వీటిలో రెవెన్యూవి 103, సర్వే, ల్యాండ్ రికార్డ్‌కు 16, మునిసిపల్‌వి 16, పంచాయితీరాజ్‌వి 16, ఎడ్యుకేషన్‌వి 15, పోలీస్ శాఖవి 11 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, డీపీవో శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మునిపిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కలెక్టర్ చొరవ చూపాలని సీఐటీయూ నేతలు కోరారు. కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం గాంధీబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. పోలీసులతో జరిగిన స్వల్ప వివాదం అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, సీఐటీయూ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, పెంచల నరసయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

● అక్రమాలను విచారించాలి

జలదంకి పంచాయతీలో అక్రమాలకు పాల్పడే పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలని సర్పంచి సీహెచ్.అనూరాధ కోరారు. సోమవారం ఆమె కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. తమ పంచాయతీలో సర్పంచితో పాటు 14 మంది వార్డు సభ్యులు ఉండగా, పంచాయతీ కార్యదర్శి ఏకపక్షంగా రికార్డుల్లో సంతకాలు పెడుతున్నాడని ఆరోపించారు. అందరినీ బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. సదరు కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● మరణ ధ్రువీకరణ ఇప్పించండి

భర్త చనిపోయి బాధల్లో ఉన్న తనకు తన భర్త మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా సంబంధిత అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని బుచ్చి మండలం పెనుబల్లికి చెందిన ఇండ్ల లక్ష్మమ్మ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె కోరారు.

● రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

సంగం మండలం జెండాదిబ్బలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సంజయ్‌కుమార్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 15 ఏళ్లుగా ఎలాంటి వసతుల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు దృష్టి సారించి గ్రామంలో వసతులు కల్పించాలని కోరారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 82 వినతులు

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 82 మంది బాధితులు తరలి వచ్చి, వారి సమస్యలను విన్నవించుకున్నారు. నగర డీఎస్పీ పీ. సింధుప్రియ, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కి వచ్చిన ఫిర్యాదులన్నింటీ పై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.



ఫిర్యాదుదారుడి సమస్యను వింటున్న మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రామారావు

ఐరన్‌ఓర్ మైనింగ్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతల డిమాండ్



విలేకరుల సమావేశంలో పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

కందుకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో ఉన్న అపార ఐరన్‌ఓర్ ఖనిజ సంపదను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టకుండా ప్రభుత్వమే మైనింగ్ నిర్వహించి జాతిసంపదను కాపాడాలని ఆమ్ ఆద్మీ, సీపీఎం, సీపీఐ పార్టీలు, వివిధ ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బీ వెంకటేశ్వర్లు(బీవీ) తదితరులు ఐరన్ ఓర్ ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు భావిస్తున్న గ్రామాల్లో సోమ వారం పర్యటించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అపార ఖనిజ సంప దను జేఎస్‌డబ్ల్యూ (జిందాల్) కంపెనీకి కట్టబెట్టడం సరికాదని, ప్రభుత్వమే మైనింగ్ నిర్వహించాలని, వీలైతే ప్రభుత్వమే ఉక్కు కర్మాగారం స్థాపించి ఐరన్‌ఓర్‌ను వినియోగించి జాతిసంపదను పెంపొందించాలని డిమాండ్ చేశారు. రెండు మండలాల పరిధిలో ఐరన్‌ఓర్ నిక్షేపాలు ఉన్నట్లు జియోగ్రాఫికల్ సర్వేలో తేలినందున ఇక్కడ ఐరన్‌ఓర్ కోసం ప్రైవేట్ సంస్థలు తవ్వకాలు ప్రారంభమైతే పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ పరిసరాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కందుకూరు నియోజకవర్గంలో తూర్పు తీర ప్రాంతాన్ని విశ్వేశ్వరరెడ్డికి, పశ్చిమప్రాంతాన్ని జిందాల్ కంపెనీకి కట్టబెట్టేందుకు వైసీపీ, టీడీపీలు ఒకే అజెండాతో ముందుకు సాగుతుండటం నియోజకవర్గ ప్రజల దురదృష్టమని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం నాయకులు బీ. సురేష్‌బాబు, ఎస్ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.